


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 20 గురువారం ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 156
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

త్వరలో

# ఉపఎన్నికలు

- పార్టీ ఫిరాయించిన 10స్థానాల్లో ఉప ఎన్నికలు తప్పవు
- ఈ పది స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓటమి..బీఆర్ఎస్ గెలుపు
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు
- అనతికాలంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్
- వందశాతం తెలంగాణలో బీఆర్ఎస్‌కు అధికారం ఖాయం
- ఏడాది పొడవునా బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు
- ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సభ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంద న్నారు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్. తెలంగాణ భవన్‌లో బుధవారం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కేసీఆర్ కీలక ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు కేసీఆర్. ప్రజల కోసం పోరాటాలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ అని.. తెలంగాణ కోసం బీఆర్ఎస్ మాత్రమే పోరాడగలదని అన్నారు.

# ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా

- ఢిల్లీ సీఎంను ప్రకటించిన బీజేపీ..
- అందరి అంచనాలు తారుమారు..
- అనూహ్యంగా తెరపైకి రేఖాగుప్తా
- సామాన్యురాలి నుంచి ఢిల్లీ పీఠం వరకు
- నేడు రాంలీలా మైదానంలో ప్రమాణస్వీకారం
- మోదీ,షాతో సహా పలువురు హాజరు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
ఢిల్లీ సీఎం ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీలో సమావేశమైన బీజేపీ శాసనసభపక్ష సమావేశంలో ఢిల్లీ కొత్త సీఎంను ఎన్నుకున్నారు. గత కొద్దిరోజులుగా ఎన్నో పేర్లు సీఎం రేసులో వినిపించినప్పటికీ చివరి వరకు గోప్యత పాటించిన బీజేపీ అధిష్టానం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒకరోజు ముందు ఢిల్లీ సీఎం పేరును ప్రకటించింది.
ఢిల్లీ సీఎం ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఫిబ్రవరి8వ తేదీన ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి ఢిల్లీ సీఎంగా బీజేపీ ఎవరిని ఎంపిక చేస్తుందనే ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. కొద్దిసేపటిక్రితం సమావేశమైన బీజేపీ శాసనసభ పక్షం సీఎం అభ్యర్థిని ఎన్నుకుంది. షాలీమార్ బాగ్ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖా గుప్తాను బీజేపీ ఎమ్మెల్యేలు సీఎంగా ఎన్నుకున్నారు. రేపు రామ్‌లీలా మైదానంలో జరిగే కార్యక్రమంలో ఆమె ఢిల్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు

# విస్తరణంపై విస్తృత చర్చ!

- టీ-కాంగ్రెస్‌లో హాట్ టాపిక్స్.. తేలేదెన్నడు?!
- విస్తరణ అంశంపై వేడి వేడి చర్చలు
- బీసీ ముఖ్యమంత్రి అంశంపైనా అదే వూపు
- మంత్రివర్గ విస్తరణ రేపు..రేపు..అంటూ ఊరడి(రి)ంపు
- సీఎం మదిలో ఒకటి..అధిష్టానం ఆలోచన మరొకటి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో.. రెండు కీలక విషయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇవి ఎప్పుడు ముడిపడతాయన్నది ఆసక్తిగా ఉండడమే కాదు.. ఇవి సంచలనాలకు కూడా వేదికగా మారనున్నాయనడంలో సందేహం లేదు. 1) మంత్రి వర్గ విస్తరణ. 2) బీసీ ముఖ్యమంత్రి. ఏ ఇద్దరు నాయకులు కలిసినా ఈ రెండు విషయాలే చర్చకు వస్తున్నాయి. మంత్రి వర్గ విస్తరణ వ్యవహారం.. కొన్నాళ్లుగా నలుగుతూనే ఉంది. అదిగో విస్తరణ అంటే.. ఇదిగో విస్తరణ అంటూ.. మీడియాలో కథనాలు రావడమే తప్ప.. కాలు ముందుకు పడడంలేదు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న పరిణామాలు.. మంత్రి వర్గ విస్తరణపై ప్రభావం చూపుతున్నాయన్న టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కూడా గడవకముందే.. మంత్రివర్గంలో మార్పులు చేస్తే.. ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుందన్న చర్చ సాగుతోంది. మరోవైపు.. కేంద్రం నుంచి ఎదురవుతున్న సమస్యలు కూడా కాంగ్రెస్ పార్టీని పూర్తిస్థాయిలో రాష్ట్రంపై దృష్టిపెట్టేలా చేయలేక పోతున్నాయన్న చర్చ కూడా ఉంది. వెరసి ఈ ప్రభావం మంత్రివర్గ విస్తరణపై కనిపిస్తోంది. మరోవైపు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన భిన్నంగా ఉంది. స్థానిక సమరంలో గెలుపు గుర్రం ఎక్కాలంటే.. మంత్రి వర్గం విస్తరణను ఊరించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆశావ హులు ఎందరో ఉన్న నేపథ్యంలో .. వారంతా కలిసి కట్టుగా పనిచేసేందుకు.. మంత్రి వర్గ విస్తరణ మంత్రంగా పనిచేస్తుందని

## జగన్‌పై నల్లపాడు పీఎస్‌లో కేసు

2



గుంటూరు మిర్చి యార్డులో జగన్ పర్యటన ఎమ్మెల్సీ కోడ్ ఉన్నా పర్యటనకు వచ్చారని కేసు మరికొందరు వైసీపీ నేతలపైనా కేసు నమోదు చేసిన పోలీసులు

## మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదిక

2

హైదరాబాద్‌లోనే మిస్ వరల్డ్ 72 ప్రారంభ, ముగింపు వేడుకలు 'బ్యూటీ విత్ ఏ పర్సన్' అనే థీమ్‌తో ఈ మిస్ వరల్డ్ పోటీలు



# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఊరట

2

- ముడా స్కాంలో లోకాయుక్త క్లీన్ చిట్
- ముడా కేసులో సీఎం,ఆయన సతీమణి ప్రమేయంపై ఆధారాల్లేవు
- ఇద్దరిపై వచ్చిన అభియోగాలకు తగిన సాక్ష్యాలు లేవు
- తుది నివేదికను కర్నాటక హైకోర్టుకు సమర్పించిన అధికారులు

బెంగుళూరు-నవభూమిబ్యూరో
కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు భారీ ఉపశమనం లభించింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్థల కేటాయింపు కేసులో ముఖ్యమంత్రి, ఆయన భార్య, మరో ఇద్దరికి ఆధారాలు లేవని పేర్కొంటూ లోకాయుక్త క్లీన్ చిట్ ఇచ్చింది. దర్యాప్తులో ఎటువంటి నేరపూరిత చర్య జరగలేదని తేలింది. దర్యాప్తులో ఆరోపణలు సివిల్ స్వభావం గలవని.. క్రిమినల్ చర్యలు అవసరం



# జనసాంద్రతలో మనమే టాప్

- జనసాంద్రతలో ఢిల్లీని దాటేసిన హైదరాబాద్
- ఢిల్లీలో ప్రతి చ.కి.మీకు 11,313 మంది ..హైదరాబాద్‌లో 18,161
- ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా రాజధాని మనీలా
- దేశంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా ముంబై(28,508)

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
హైదరాబాద్ కిటకిట.. ఢిల్లీని దాటేసిందట వాళ్లు వీళ్లు అన్న తేడా లేదు. సౌత్..నార్త్ అన్న సమస్య రాదు. ఎవరి భాష మాట్లాడినా.. ఎవరో ఒకరు సమాధానం ఇస్తుంటారు. వాళ్లు వీళ్లు అన్న తేడా లేదు. సౌత్..నార్త్ అన్న సమస్య రాదు. ఎవరి భాష మాట్లాడినా.. ఎవరో ఒకరు సమాధానం ఇస్తుంటారు. ఫుడ్ కోసం ఇబ్బందులు అసలే రావు. ఇన్ని ప్లస్ పాయింట్లు ఉన్న మహానగరం మన దేశంలో హైదరాబాద్ ఒక్కటి మాత్రమే ఉంటుంది. అందుకే.. ఇప్పుడు అందరి చూపు భాగ్యనగరం మీదనే. గడిచిన కొన్నేళ్లుగా భాగ్యనగరికి అన్ని రాష్ట్రాలకు చెందిన వారు వస్తున్నారు. ఉపాధి అవకాశాల కోసం.. ఉద్యోగాల కోసం.. చదువుకోవటానికి.. ఇలా ఒకటి కాదు రెండు కాదు ప్రతి అంశానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది హైదరాబాద్. ఈ కారణంతోనే జనసాంద్రత విషయంలో దేశ రాజధాని ఢిల్లీని దాటిపోయింది భాగ్యనగరం. ఈ విషయాన్ని తాజాగా విడుదలైన తెలంగాణ రాష్ట్ర గణాంకాల శాఖ విడుదల చేసిన రిపోర్టులో వెల్లడయ్యాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఢిల్లీ మహానగరంలో ప్రతి చదరపు కిలోమీటర్‌కు 11,313 మంది నివసిస్తుండగా.. హైదరాబాద్ జనసాంద్రత 18,161గా నమోదైంది. అంటే.. హైదరాబాద్ మహానగరంలోని ప్రతి చదరపు కిలోమీటర్ లో 18వేలకు పైగా ప్రజలు నివసిస్తున్న పరిస్థితి. ప్రపంచంలో అత్యధిక జనసాంద్రత కలిగిన నగరంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాను చెబుతారు. అక్కడ ప్రతి చదరపు కిలోమీటర్ కు 43,079 మంది నివసిస్తుంటారు. మన దేశానికి వస్తే అత్యధిక జనసాంద్రత కలిగిన మహానగరంగా ముంబయి నిలుస్తుంది. ఇక్కడ ప్రతి చదరపు కిలోమీటర్ కు 28,508 మంది ఉంటున్నారు. ఇక్కడో ఆసక్తికరమైన అంశాన్ని ప్రస్తావించాలి. హైదరాబాద్ మహానగరంలో జనసాంద్రత అంతకంతకూ పెరిగిపోతుంటే.. ఈ మహానగరి ఉన్న తెలంగాణ రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు జనసాంద్రత తక్కువగా ఉండటం గమనార్హం. బిహార్.. పశ్చిమ

## వనపర్తి జిల్లాలో

# బర్డ్‌ఫ్లూ కలకలం

- 4 వేల కోళ్లు మృతి..రైతు గగ్గోలు
- మదనపురం మండలం కొన్నూరులో ఘటన

2

**వనపర్తి-నవభూమిబ్యూరో:** జిల్లాలోని బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో శివకేశవరెడ్డి అనే రైతుకు చెందిన కోళ్ల ఫామ్‌లో 4000 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బర్డ్ ఫ్లూ వ్యాధితో ఇంత పెద్ద సంఖ్యలో కోళ్లలో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎప్పటి లాగే ఈరోజు ఉదయం రైతు శివకేశవరెడ్డి కోళ్లఫామ్‌కు వచ్చి చూడగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోయి కనిపించాయి. దీంతో వాటిని గుంతలో పోడ్చేశారు. అయితే నాలుగువేళ్ల కోళ్ల మృతిపై వెటర్నరీ అధికారులకు రైతు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు.

# ఏపీ కేబినెట్ భేటీ వాయిదా

- నేడు జరగాల్సిన ఏపీ కేబినెట్ భేటీ
- ఢిల్లీలో సీఎం ప్రమాణ స్వీకారానికి సీఎం
- ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న బీజేపీ




న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతున్న సీఎం చంద్రబాబు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరగాల్సి ఏపీ కేబినెట్ భేటీ వాయిదా పడింది. ఈ నెల 20న రాష్ట్ర కేబినెట్ భేటీ నిర్వహించాలని భావించారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు అదే రోజున ఢిల్లీ వెళుతున్నారు. రేపు ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానం అందుకున్న ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు కూడా ఉన్నారు. ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీజేపీ హైకమాండ్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. దాంతో చంద్రబాబు కూడా ఢిల్లీ వెళుతున్నారు. చంద్రబాబు ఢిల్లీ నుంచి తిరిగొచ్చాక కేబినెట్ భేటీ రీషెడ్యూల్ చేసే అవకాశం ఉంది. త్వరలోనే ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో... రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది.

# కేంద్రం వర్సెస్ రాష్ట్రం

- గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ రచ్చ..
- గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం భూముల సేకరణ
- సర్కార్ ఇచ్చే పరిహారం సరిపోదంటున్న రైతులు
- నిరసన వ్యక్తం చేస్తూ భూసేకరణకు రైతుల అడ్డంకులు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణపైన రచ్చ కొనసాగుతుంది. రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం తాము ఇచ్చే భూములకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన పరిహారం సరిపోదని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో నింద కేంద్రం పైన వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వమే రైతుల విషయంలో సానుకూలంగా లేదని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ విషయంలో రచ్చ కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం అన్నట్టు గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ పరిహారం విషయంలో జరుగుతున్న రచ్చ అంతా ఇంతా కాదు. రైతులు నిరసనలు చేస్తూ భూసేకరణను అడ్డుకుంటున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పరిహారం నిర్ణయించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోతున్నారు. అయితే నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుంది. రైతుల డిమాండ్ ఇదే రాష్ట్రప్రభుత్వం సరైన ధర నిర్ణయించి కేంద్రానికి పంపాలని రైతులు కోరుతున్నారు. అయితే కేంద్రమే పరిహారం విషయంలో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వం , రాష్ట్రమే రైతులకు అన్యాయం చేస్తుందని కేంద్రం చెప్తున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం విషయంలో కేంద్రంపై అపవాదు వేయడం సమంజసం కాదు తెలంగాణ రైతాంగాన్ని

# ఏపీ పొలిటికల్ హీట్

- జగన్ పర్యటనతో మారుతున్న సమీకరణలు
- విజయవాడ,గుంటూరు పర్యటనలతో
- వైసీపీ కార్యకర్తల్లో పెరిగిన జోష్
- జగన్ వచ్చిన ప్రతీ చోటా జనం ఫుల్

2




**అమరావతి-నవభూమిబ్యూరో:**ఏపీలో పొలిటికల్ హీట్ పెరిగింది. వార్ వన్ సైడ్ అన్నట్లుగా 2024 ఎన్నికల్లో మొత్తానికి మొత్తం 164 సీట్లను కైవశం చేసుకుని కూటమి ప్రభుత్వం జెండా ఎగరేసింది. వైసీపీ పూర్తి స్థాయిలో డీలా పడిపోయింది. గడచిన తొమ్మిది నెలలుగా చూస్తే వైసీపీలో చడీ చప్పుడు లేకుండా ఉంది. వైసీపీ నుంచి నేతలు ఒక్కొక్క రుగా బయటకు వెళ్ళిపోతున్న వైనం కూడా ఉంది. అంతే కాదు జగన్ సైతం ఎక్కువగా బెంగళూరులో గడుపుతున్నారు అన్న చర్చ వచ్చింది. అయితే ఇటీవల కాలంలో జగన్ గేర్ మార్చినట్లుగా కనిపిస్తోంది. ఆయన లండన్ ట్రిప్ నుంచి వచ్చిన తరువాత క్యాడర్‌తో మాట్లాడుతూ 2.0 అన్నారు. ఆ మీదట చేరికల మీద ఫోకస్ పెట్టారు. ఆయన వరస పర్యటనలు చేపడుతున్నారు. నిన్న విజయవాడ నేడు గుంటూరు ఇలా జగన్ టూర్లు సాగాయి. ఇకపోతే జగన్ వెళ్ళిన చోటల్లా జనాలు బాగానే వస్తున్నారు. పార్టీ నాయకులు కూడా ఉత్సాహంగా కనిపించారు. జగన్ సైతం ఫుల్ ఫోకస్‌తో కూటమి ప్రభుత్వం మీద కామెంట్స్ చేస్తూ వస్తున్నారు. ఆయన గుంటూరు మిర్చీ యార్డులో పర్యటించిన సందర్భంగా ప్రభుత్వం మీద నిప్పులు చెరిగారు. ఇక సమరమే అని కూడా స్పష్టం చేశారు. కూటమి సర్కార్‌తో రాజకీయ యుద్ధానికి సిద్ధమని కూడా ఆయన పూర్తి స్థాయిలో క్లారిటీ ఇచ్చారు. ఇక విజయవాడలోనూ గుంటూరులోనూ ఆయన మాట్లాడిన మాటలు చూస్తే కనుక మళ్లీ వైసీపీ ఏపీలో అధికారంలోకి వస్తుందన్న సందేశాన్ని అటు పార్టీలో ఇటు జనంలోనూ పంపించారు. అదే విధంగా కూటమి ప్రభుత్వానికి కూడా ఇదే రకమైన సిగ్నల్ ఇచ్చారు. మేము మళ్ళీ వస్తామని అపుడు ఇదే లెక్క అమలు చేస్తామని ఆయన చెప్పడం జరిగింది. గుంటూరు పర్యటనలో జగన్ కి కనీస భద్రత కల్పించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ కి జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉంది. కానీ అది ఎక్కడా అమలు కాలేదు. దాంతో జగన్ వద్దకు జనం



# విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవు.. ఎప్పుడంటే..

హైదరాబాద్-నవభూమి:విద్యార్థులకు సెలవులంటే చాలు ఎక్కడ లేని సంతోషం వస్తుంది. టీచర్స్ క్లాసెస్, హోం వర్క్ బాధలు తప్పుతాయని హమ్మయ్య అని అనుకుంటారు. సెలవులు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తుంటారు. అయితే ఫిబ్రవరి చివరి వారంలో రెండు రోజుల పాటు స్కూల్స్, కాలేజీలకు సెలవులు రానున్నాయి. మహా శివరాత్రి, ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 26, 27 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవులను ప్రకటించింది.

**రెండు రోజుల సెలవులు:**
మహా శివరాత్రి (ఫిబ్రవరి 26): మహా శివరాత్రి పండుగ హిందువులకు ఎంతో ప్రత్యేకమైనది. ఈ పండుగ సందర్భంగా రేవంత్ ప్రభుత్వం తెలంగాణలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది.ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్( ఫిబ్రవరి 27): తెలంగాణలో గ్రాడ్యుయేట్, టీచర్ స్థానాలకు ఎన్నికలు ఎంపిక చేసిన జిల్లాల్లో జరుగుతాయి. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు ఫిబ్రవరి 27న ప్రభుత్వం సెలవు ప్రకటించింది.ఆంధ్రప్రదేశ్ లో కూడా ఫిబ్రవరి 26 మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సెలవు ఉండగా ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే జిల్లాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని పాఠశాలలకు ఫిబ్రవరి 27న సెలవు ఉంటుంది. ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేయడానికి అర్హులు.



# తెలంగాణలో 'బుక్' పాలిటిక్స్.. ఇప్పుడిదే ట్రెండ్ గురూ..!



హైదరాబాద్-నవభూమి:తెలంగాణలో ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు పాలిటిక్స్ కూడా అంతే హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 'బుక్' పాలిటిక్స్ ట్రెండ్ నడుస్తోంది. ఏపీ మంత్రి నారా లోకేష్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెరమీదకు తీసుకొచ్చిన బుక్ పాలిటిక్స్ కల్చర్ ప్రస్తుతం తెలంగాణలోకూ వ్యాపించింది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉండగా.. ప్రభుత్వ అధికారులు విపక్షంగా వ్యవహరిస్తూ తీసుకునే తప్పుడు నిర్ణయాలను తాము రెడ్ బుక్‌లో రాస్తున్నట్లు లోకేష్ ఓ డైరీ చూపించారు. అందులో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అందరి ఉద్యోగుల పేర్లు నమోదు చేస్తున్నామని.. తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని లోకేష్ హెచ్చరించారు.
ప్రస్తుతం తెలంగాణలోనూ బుక్ కల్చర్ మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. ప్రభుత్వం చేస్తున్న తప్పులు, సీఎం రేవంత్ రెడ్డి అరాచకాలను 'పింక్ బుక్'లో నోట్ చేస్తున్నామన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని తాము అధికారంలోకి రాగానే.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నేతలు, అధికారులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తాజాగా.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా 'ఆరెంజ్ బుక్' తెరమీదకు తీసుకొచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వరంగల్ జిల్లాలో పర్యటించిన ఎంపీ ఈటల .. అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాస్‌ల ఆదేశాలు మేరకు కాకుండా.. చట్టానికి, నిబంధనలకు లోబడి పనిచేయాలని హితవు పలికారు. లేదంటే కఠిన చర్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. తాము కూడా 'ఆరెంజ్ బుక్' మెయింటైన్ చేస్తున్నామన్న ఈటల.. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నామన్నారు. ఎల్లకాలం కాంగ్రెస్ అధికారంలో ఉండదని... సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ముఖ్యమంత్రి బంధువులు, మిత్రులు చెప్పారని చట్టవ్యతిరేక పనులు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్టు భావిస్తే ఉద్యోగులకు తగదన్నారు. టైం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఇలా తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం బుక్ పాలిటిక్స్ ట్రెండ్ అవుతోంది. బీఆర్ఎస్ పింక్ బుక్ తెరపైకి తీసుకొస్తే.. బీజేపీ ఆరెంజ్ బుక్ ఉందని హెచ్చరిస్తోంది.

## విజయవాడ రూట్‌లో ప్రయాణించేవారికి ఆర్టీసీ గుడ్‌న్యూస్..



హైదరాబాద్-నవభూమి:తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో విజయవాడ రూట్‌లో ప్రయాణాలు సాగించేవారికి టీజీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే లహరి- నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10 శాతం స్పెషల్ డిస్కౌంట్ ప్రకటించారు. రాజధాని ఏసీ బస్సుల్లో 8 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు సంస్థ యాజమాన్యం వెల్లడించింది. ఈ డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సంస్థ కోరుతోంది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tgsrtcbus.in అధికారిక వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించింది.తెలంగాణ నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులకు కూడా ఇటీవల ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. బెంగళూరు మార్గంలో టికెట్ ధరలో 10 శాతం రాయితీని కల్పిస్తోంది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ఏసీ స్లీపర్, ఏసీ సీటర్, రాజధాని, సూపర్ లగ్జరీ, నాన్ ఏసీ స్లీపర్, నాన్ ఏసీ సీటర్ బస్సుల్లో రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 ఆదా అవుతుందని యాజమాన్యం వెల్లడించింది.శివరాత్రికి ప్రత్యేక బస్సులు.. ఇక మహా శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వేములవాడ , శ్రీశైలం , ఏడుపాయల , కీసర పాలకుర్తి దేవాలయాలకు వెళ్ళే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించాలని మంత్రి ఆదేశారు. గత సంవత్సరం కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బస్‌స్టాండ్‌ల వద్ద అధిక రద్దీ ఉన్నప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఆరుగురిని చంపిన కేసులో ఇద్దరికి జీవితఖైదు

నిజామాబాద్-నవభూమి: స్నేహితుడి అప్పును ఎగ్గొట్టాలని, అతడి ఆస్తిని కాజేయాలనే కుట్రతో అతడిని, అతడి భార్య, ఇద్దరు చెల్లెళ్లు, మైనర్లయిన ఇద్దరు కూతుళ్లను ఇలా ఒకరికి తెలియకుండా మరొకరిని ఓ వ్యక్తి దారుణంగా హత్య చేసిన ఘటన గుర్తుందా? 2023 డిసెంబరులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు చిన్నారుల హత్య కేసును వేరుగా విచారించిన నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్ కోర్టు.. నిందితుడైన వ్యక్తిని, హత్యలకు సహకరించిన అతడి తల్లిని దోషులుగా నిర్ధారించి యావజ్జీవకారాగార శిక్ష విధించింది. జిల్లాలోని మాక్లూర్‌కు చెందిన పుణె ప్రసాద్‌కు భార్య శాన్విక, కూతుళ్లు చైత్రిక, చైత్రి, చెల్లెళ్లు శ్రావణి, స్వప్న, తల్లి సుశీల ఉన్నారు. ప్రసాద్ ఓ యువతి హత్య కేసులో ఆరోపణలెదుర్కొని కొన్నాళ్లు జైల్లో ఉండి వచ్చాడు. తాను జైల్లో ఉన్నప్పుడు తన కుటుంబానికి ఆసరాగా ఉన్న మిత్రుడు మెడిద ప్రశాంత్ అడిగితే రూ.3.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. జైలు నుంచి వచ్చాక ప్రసాద్‌ను గ్రామస్థులు ఊర్లో ఉండనీయకపోవడంతో కుటుంబంతో కలిసి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పాల్వంచకు మారాడు.
ఈ క్రమంలో ప్రసాద్‌కు అప్పులు పెరగడంతో మాక్లూర్‌లోని తన సొంతింటిని తాకట్టు పెట్టి అప్పు తీసుకునేందుకు ప్రయత్నించాడు. అయితే అతడిపై కోర్టు కేసు ఉండటంతో రుణం తీసుకోవడం సాధ్యపడలేదు. తన పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే.. లోన్

# కొత్త రేషన్ కార్డులు మంజూరు.. కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు



హైదరాబాద్-నవభూమి:తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించిన సంగతి తెలిసిందే. గత నెల 26న రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. తొలి విడతలో మండలానికో గ్రామం చెప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ తర్వాత ప్రజాపాలన, గ్రామ సభలు, మీ సేవ కేంద్రాల ద్వారా అప్లికేషన్లు తీసుకొని వారికి కూడా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎవరికీ కార్డులు ఇవ్వలేదు. కార్డులు ఇచ్చేలోగా.. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీతో పాటుగా నల్గొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీలకు నోటిఫికేషన్, ఎన్నికల కోడ్ విడుదలైంది. దీంతో కార్డుల జారీపై సందిగ్ధత నెలకొంది.
ఈ నేపథ్యంలో ప్రజల ఆందోళలకు తెరదించుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న జిల్లాలను మినహాయించి మిగిలిన జిల్లాల్లో కార్డులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. తాజాగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రేషన్ కార్డుల జారీపై కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో త్వరలోనే కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రారంభించాలని చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కోడ్ అమల్లో లేనందున ఆయా జిల్లాల్లో కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు.క్యూఆర్ కోడ్‌తో పోస్ట్ కార్డు సైజులో కొత్త కార్డులు.. ఇక కొత్త రేషన్ కార్డులు బార్ కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌తో పోస్ట్ కార్డు సైజులో ఉండనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్తవి, పాతవి కలిపి కోటి రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. అన్ని కార్డులు కొత్తగా మంజూరు చేసేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. కొత్త రేషన్ కార్డుల్లో ఒక వైపు ముఖ్యమంత్రి, మరో వైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటోలతో పాటు ప్రభుత్వ లోగో ఉండనున్నాట్లు సమాచారం.

# మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదిక

**హైదరాబాద్‌లోనే మిస్ వరల్డ్ 72 ప్రారంభ, ముగింపు వేడుకలు**
**'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే థీమ్‌తో ఈ మిస్ వరల్డ్ పోటీలు**
**ఈ ఏడాది మే 7వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోటీలు**



హైదరాబాద్-నవభూమి: మిస్ వరల్డ్-72 పోటీలకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదిక కానుంది. మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ ప్రారంభ, ముగింపు వేడుకలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే హైదరాబాద్‌లో జరగనుంది. ఈ మిస్ వరల్డ్ పోటీల్లో 120 దేశాల నుండి యువతులు పాల్గొననున్నారు.'బ్యూటీ విత్ ఏ పర్పస్' అనే థీమ్‌తో ఈ మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మే 7వ తేదీ నుండి 31వ తేదీ వరకు తెలంగాణ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే ఉండనుంది. గతంలో ముంబై, న్యూఢిల్లీల్లో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి.మిస్ వరల్డ్ 71వ ఎడిషన్ ముంబైలో నిర్వహించారు. విభిన్నమైన కళా వారసత్వం ఉన్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈవో జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రకటించారు.

# వనపర్తి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కలకలం

(1వపేజీ తరువాయి) ఇన్ని కోళ్లు చనిపోవడానికి కారణం ఏంటో చెప్పాలని.. తనకు న్యాయం చేయాలని కోరారు. బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని అనుకుంటున్నానని.. దానిపై అధికారులు నిర్ధారణ చేయాలన్నారు. ప్రతీసారి తనకు కోళ్లపై లాభం వచ్చేదని.. కానీ ఈసారి మాత్రం పూర్తి నష్టపోయాయనని న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. కాగా.. 5500 కోళ్ల కెపాసిటీతో నిర్మించిన శివకేశవరెడ్డికి చెందిన కోళ్లఫామ్‌లో నాలుగువేల కోళ్లు మృత్యువాతపడ్డాయి. ఈ కోళ్లను ప్రీమియర్ కంపెనీ నుంచి సాకుతున్నాడు రైతు. అయితే నిన్నటి నుంచి కోళ్లు చనిపోవడాన్ని గుర్తించిన శివకేశవ రెడ్డి కంపెనీ యాజమాన్యానికి ఫోన్‌లో సమాచారం అందించారు. అయితే దీన్ని తేలిగ్గా తీసుకున్న కంపెనీ యాజమన్యం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రైతుకు చెప్పింది. అయితే బర్డ్ ఫ్లూగా అనుమానించిన శివకేశవరెడ్డి నిన్న చనిపోయిన 500 కోళ్లను గొయ్యి తీసి పాతిపెట్టాడు. ఈరోజు ఉదయం నుంచి వరుసగా కోళ్లు చనిపోయాయి. దాదాపు 4000 కోళ్లు మృత్యువాత పడటంతో వాటిని కూడా గోతి తీసి పాతిపెట్టాడు రైతు. ఇలా వరుసగా కోళ్లు చనిపోవడంపై పశుసంవర్ధక శాఖ అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామంలో పౌల్ట్రీ రైతులు ఆందోళనకు దిగారు.

## ఎల్ఆర్ఎస్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

గత నాలుగేళ్లుగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)పై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు నేడు సమీక్ష నిర్వహించారు.అనధికార లేఔట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు తెచ్చిన ఎల్ఆర్ఎస్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఢిల్లీ సీఎంగా రేఖాగుప్తా

(1వపేజీ తరువాయి)ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరవుతా రు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. ఢిల్లీ సీఎం ఎంపిక కోసం కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ జాతీయ కార్యదర్శి ఓపీ దన్కర్‌ను బీజేపీ అధిష్టానం నియమించిం ది. ఢిల్లీ బీజేపీ ఎమ్మెల్యేలతో సమావేశమైన ఈ ఇద్దరు పరిశీలకులు శాసనసభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే సమయంలో అధిష్టానం నిర్ణయాన్ని సభ్యుల ముందుంచారు. చివరిగా ఏకగ్రీవంగా రేఖా గుప్తా పేరును ఢిల్లీ సీఎంగా ఎన్నుకున్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు విడుదలై 12 రోజులు పూర్తైనా.. సీఎం ఎవరనేదానిపై క్లారిటీ రాలేదు. బీజేపీ శాసనసభపక్ష సమావేశం జరగడానికి ముందువరకు కూడా పది పేర్లు వినిపించాయి. ముందుగానే బీజేపీ అధిష్టానం ఢిల్లీ సీఎం ఎవరనేదానిపై ఓ నిర్ణయానికి వచ్చినప్పటికీ ఆ పేరు బయటకు రాకుండా చివరవరకు గోప్యత పాటించింది. ఢిల్లీ సీఎం ఎంపిక కోసం నియమించిన పరిశీలకులు ఎమ్మెల్యేల సమావేశంలో అధిష్టానం నిర్ణయాన్ని వెల్లడించారు. బీజేపీ హైకమాండ్ నిర్ణయానికి ఎమ్మెల్యేలంతా ఓకే చెప్పడంతో ఎలాంటి వివాదం లేకుండా ఢిల్లీ సీఎం ఎంపిక జరిగిపోయింది. ముఖ్యంగా రేఖా గుప్తా, ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్, పవన్ శర్మ, ఆశిష్ సూద్, శిఖా రాయ్, పర్వేష్ సాహిబ్ సింగ్, రవీంద్ర ఇంద్రరాజ్ సింగ్, కైలాష్ గంగ్వాల్, అనిల్ గోయల్, రాజ్ కుమార్ భాటియా పేర్లు వినిపించాయి. అనూహ్యంగా రేఖ గుప్తాను బీజేపీ ఢిల్లీ సీఎంగా ఎంపిక చేసింది.
గతంలోనూ..బీజేపీ సీఎంల ఎంపికలో ఎప్పుడూ గోప్యత పాటిస్తూనే వచ్చింది. గతంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ సీఎంల ఎంపికలో అనూహ్యంగా కొత్తపేర్లను తెరపైకి తీసుకువచ్చింది. సామాజిక సమీకరణలతో పాటు తాజా రాజకీయ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని బీజేపీ ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఊరట

(1వపేజీ తరువాయి)లేదని తేల్చారు. ఈ కేసుకు సంబంధించి సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతిపై వచ్చిన అభియోగాలకు తగ్గ సాక్ష్యాలు లేని కారణంగా నేరు రుజువు చేయలేకపోయినట్లు.. తుది నివేదికను కర్ణాటక హైకోర్టుకు సమర్పించినట్లు విచారణలో పాల్గొన్న అధికారులు వెల్లడించారు. ఈ కేసులో వచ్చిన ఆరోపణలకు సాక్ష్యాధారాలు లేని కారణంగా నేరం రుజువు కాకపోవడంతో తుది నివేదికను కోర్టుకు సమర్పిస్తున్నట్లు లోకాయుక్త పోలీసులు ముడా కేసులో ఫిర్యాదుదారు అయిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ కు లేఖలో వెల్లడించారు. ముడా స్థల కేటాయిం పులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఇతరులు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరో పించారు. భారత శిక్షాస్మృతి, అవినీతి నిరోధక చట్టం, బినామీ లావాదేవీల (నిషేధం) చట్టం, కర్ణాటక భూ కబ్జా చట్టంలోని అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే, లోకా యుక్త దర్యాప్తులో ఎటువంటి క్రిమినల్ తప్పు జరగలేదని తేలింది. అందువల్ల నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తుది నివేదిక సమర్పిం చబడింది. క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ 2016, 2024 మధ్య ముడా చేసిన పరిహార భూకేటా యింపులను ఇప్పటికీ దర్యాప్తు చేస్తామని లోకాయుక్త తెలిపింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు. తదుపరి దర్యాప్తు అనంతరం సీఆర్పీసీ సెక్షన్ 173(8) కింద మరొక నివేదిక కోర్టుకు సమర్పించబడు తుంది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని సంక్షిప్తంగా ముడా అని పిలుస్తారు. ఇది మైసూరు నగర అభివృద్ధి పనులకు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. భూమి సేకరణస, కేటాయింపు పని ఈ సంస్థ బాధ్యత. మైసూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ 1992లో రైతుల నుంచి కొంత భూమిని సేకరించి దానిని నివాస ప్రాంతంగా అభివృద్ధి చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా దానిని వ్యవసాయ భూమి నుంచి వేరు చేశారు. కానీ 1998లో స్వాధీనం చేసుకున్న భూమిలో కొంత భాగాన్ని ముడా రైతులకు తిరిగి ఇచ్చింది. ఈ విధంగా ఆ భూమి మరోసారి వ్యవసాయ భూమిగా మారింది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ వివాదం 2004లో ప్రారంభమైంది. సిద్ధరామయ్య భార్య పార్వతికి మైసూర్‌లోని కేసరే గ్రామంలో 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆమెకు సోదరుడు మల్లికార్జున్ బహుమతిగా ఇచ్చారు. కానీ అదే సమయానికి ఆ భూమిని అభివృద్ధి చేసేందుకు ముడా స్వాధీనం చేసుకుది. పరిహారం కింద 2021లో సిద్ధరామయ్య భార్య పార్వతికి దక్షిణ మైసూర్‌లో కీలకమైన విజయనగర్‌లో 38, 238 చదరపు అడుగుల ప్లాట్లను కేటాయించింది. సిద్ధరామ య్య భార్య పార్వతికి మైసూరులోని సంపన్న ప్రాంతంలో 14 స్థలాల కేటాయింపు చట్టవిరుద్ధ మని సామాజిక కార్యకర్తలు లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనివల్ల రూ.45 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులో సిద్ధరామయ్యతో పాటు ఆయన భార్య, కుమారుడు ఎస్ యతీంద్ర, ముడా సీనియర్ అధికారుల పేర్లు కూడా ఉన్నాయి. మరో కార్యకర్త స్నేహమయ కృష్ణ కూడా ఈ భూ కుంభకోణంలో సిద్ధరామ య్య, ఆయన భార్య, ముడా, పరిపాలనా అధికారుల ప్రమే యం ఉందని ఆరోపించారు. ' సిద్ధరామయ్య ఇంతకు ముందు ఏమని చెప్పుకున్నారంటే? తన భార్య పరిహారం పొందిన భూమిని తన సోదరుడు మల్లికార్జున 1998లో బహుమతిగా ఇచ్చాడని సిద్ధరామయ్య పేర్కొన్నారు. కానీ కార్యకర్త కృష్ణ 2004 లో మల్లికార్జున దానిని అక్రమంగా సంపాదిం చారని, ప్రభుత్వ, రెవెన్యూ అధికారుల సహాయంతో నకిలీ పత్రాలను ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని 1998లో కొనుగోలు చేసినట్లు చూపించారు.

## జగన్‌పై నల్లపాడు పీఎస్‌లో కేసు నమోదు

నల్లపాడు-నవభూమి: వైసీపీ అధినేత జగన్ గుంటూరు మిర్చి యార్డులో పర్యటించడంపై కేసు నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, పర్యటనకు రావొద్దని ఈసీ, జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ... జగన్ మిర్చి యార్డు పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో, ఆయనపై గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఈసీ, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు బేఖాతరు చేస్తూ మిర్చి యార్డులో కార్యక్రమం నిర్వహించారం టూ... జగన్, అంబటి రాంబాబు, కొడాలి నాని, లేళ్ల అప్పిరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగం సురేశ్ తదితరులపై కేసు నమోదు చేశారు.

# ఏపీ పొలిటికల్ హీట్

(1వపేజీ తరువాయి)తోసుకుంటూ వచ్చారు. ఒక దశలో ఆయనే జనాలను సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చింది. దాంతో ఆయన మేము అధికారంలోకి వచ్చాక చంద్రబాబుకు ఇలాంటి పరిస్థితి వస్తే ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇంకో వైపు చూస్తే వైసీపీలో ఆత్మ స్థైర్యాన్ని కలిగించేందుకు జగన్ వరస టూర్లు దోహదపడ్డాయని అంటున్నారు. వైసీపీకి జనంలో ఆదరణ ఉందని చెప్పడానికి ఇవి పనికి వచ్చాయని అంటున్నారు. జగన్ అంటే ఇంకా ప్రజలలో మోజు ఉందని కూడా ఈ పర్యటనలు చాటి చెప్పాయని అంటున్నారు. ఒక విధంగా వైసీపీలో ఆశావహమైన వాతావరణాన్ని పెంచడానికి ఈ టూర్లు ఉపయోగపడ్డాయని చెప్పాలి. మరో వైపు చూస్తే జగన్ విమర్శలకు ప్రతి విమర్శలు టీడీపీ నుంచి పెద్ద ఎత్తున వచ్చాయి. నారా లోకేష్ నుంచి అచ్చెన్నాయుడు నుంచి ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పల్లా శ్రీనివాస్ నుంచి చాలా మంది నేతలు విమర్శల వర్షం కురిపించారు. జగన్ వ్యాఖ్యలను ఆయన విమర్శలను గట్టిగా తిప్పికొట్టారు. ఆ విధంగా గడచిన రెండు రోజులుగా చూస్తే ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగిందని చెప్పాలి. ఒక వైపు వేసవి సెగల సంకేతాలు వస్తూంటే మరో వైపు జగన్ రాజకీయ వేడిని పెంచేశారు. దాంతో 2024 ఎన్నికల తరువాత స్తబ్దుగా ఉన్న ఏపీ రాజకీయం గేర్ మార్చుకుంటుందనే అంటున్నారు. ఇక మీదట జనంలో ఉండేందుకు జగన్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్న వేళ ఇది ముందస్తు సన్నివేశంగా చెప్పాల్సి ఉంది అని అంటున్నారు. ఇక ఏపీలో పాలసీల మీద డిబేట్లు జరిగి చాలా కాలం అవుతోంది. రాజకీయ విమర్శలు ప్రతి విమర్శలే అటూ ఇటూ ఉంటూ వస్తున్నాయి. ఇపుడు కూడా అలాంటి సన్నివేశాలే చూడాల్సి ఉంటుంది. ఏపీ బడ్జెట్ సెషన్ తరువాత ఏపీలో రాజకీయ వాతావరణం మరింత వేడిగా మారే అవకాశాలు అయితే పుష్కలంగానే ఉన్నాయని అంటున్నారు.

## త్వరలో ఉపఎన్నికలు

(1వపేజీ తరువాయి)ప్రజల కష్టాలు బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే తెలుసన్నారు. వందశాతం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు కేసీఆర్. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఏడాది పొడవునా బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలన్నారు. ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సిల్వర్ జూబ్లీ కార్యక్రమాల కోసం సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఉంటుందని కేసీఆర్ తెలిపారు. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు, ఆ తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు చేయనున్నట్లు కేసీఆర్ తెలిపారు. అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు కేసీఆర్. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ బీఆర్ఎస్ కాదన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసిన పార్టీ అని అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉపఎన్నికలు ఖాయమని కేసీఆర్ అన్నారు. ఆ స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. ఇక కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో భవిష్యత్ లేదని వ్యాఖ్యానించారు.

## విస్తరణంపై విస్తృత చర్చ!

(1వపేజీ తరువాయి)రేవంత్ ఆలోచన. అలా కాకుండా.. ఇప్పటికిప్పుడు విస్తరణ చేస్తే.. అది వ్యతిరేక ఫలాలు ఇచ్చినా.. ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉందన్న లెక్కలు కూడా వేస్తున్నారు. బీసీని ముఖ్యమంత్రిని చేయడం. రాష్ట్రంలో 46 శాతం మంది బీసీలు.. కేవలం 12 -20 శాతం లోపు రెడ్లు ఉన్న నేపథ్యంలో బీసీని ముఖ్యమంత్రిని చేయాలన్న డిమాండ్ ఇప్పుడిప్పుడే.. జిల్లాలస్థా యిలో వినిపిస్తోంది. దీనికి మానసికంగా సీఎం రేవంత్ రెడ్డి కూడా రెడీ అయ్యారు. ఆయనే స్వయం తానే చిట్టచివరి రెడ్డి ముఖ్యమంత్రి అయినా ఫర్వాలేదన్న విషయాన్ని కూడా చర్చిస్తున్నారు. అయితే.. ఇప్పటికిప్పుడు కాకపోయినా.. ఎన్నికలకు ముందు మాత్రం బీసీ ముఖ్యమంత్రి ఖాయమని.. నాయకులు చర్చించుకుంటున్నా రు. ప్రస్తుతం ఈ రెండు అంశాలే.. టీ కాంగ్రెస్‌లో ఎక్కువగా వినిపిస్తుండడం గమనార్హం.

## జనసాంద్రతలో మనమే టాప్

(1వపేజీ తరువాయి)బెంగాల్‌తో పోల్చినా కూడా తెలంగాణలో జనసాంద్రత తక్కువగా నమోదు అవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభా 3.5 కోట్లు. సగటున చదరపు కిలోమీటర్ కు 312 మంది మాత్రమే నివసిస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ మహానగరంలో చదరపు కిలోమీటర్ కు నివసిస్తున్న వారు 18,161తో పోల్చినప్పుడు జనాభా ఎంత ఎక్కువగా ఉన్నారన్న విషయం అర్థమవుతుంది. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 2036 నాటికి యువ జనాభా తగ్గి పెద్దవయస్కుల జనాభా పెరుగుతుందన్న ఆందోళనకర అంశం వెల్లడైంది. 2011తో పోలిస్తే 2036 నాటికి తెలంగాణలో 34 ఏళ్ల లోపు వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. అదే సమయంలో పెద్ద వయస్కుల జనాభా పెరగనుంది. జనాభా నియంత్రణ విధానాల్ని పాటించటంతో జననాల రేటు తగ్గిపోవటమే కారణంగా చెబుతున్నారు. 2011లో తెలంగాణలో రాష్ట్రంలో ఏడాది అంతకంటే తక్కువ వయసున్న చిన్నారులు 5.79 లక్షల మంది.2036 నాటికి చిన్నారుల సంఖ్య 3.94 లక్షలకు తగ్గిపోతారని చెబుతున్నారు. ఇదే విధంగా మిగిలిన వయస్కుల విషయంలోనూ ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణంతోనే ఎక్కువ మంది పిల్లల్ని కనాలన్న మాట ఇప్పుడు ప్రభుత్వాధినేతల నోటి నుంచి తరచూ వస్తోంది.

## కేంద్రం వర్సెస్ రాష్ట్రం

(1వపేజీ తరువాయి)ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని చెప్తున్న రైతాంగానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తమ మద్దతు తెలిపారు. భూసేకరణ కోసం కలెక్టర్లతో కమిటీ వేసి ప్రాంతాలవారీగా వాస్తవ ధరలు నిర్ణయించాలని, ఆ నివేదికను కేంద్రానికి పంపాలని వారు చెప్తున్నా రాష్ట్రం మాత్రం ఈ విషయంలో స్పందించటం లేదని అంటున్నారు. పరిహారం నష్టం కలగకుండా ఇస్తేనే భూములు ఇస్తామన్న రైతులు తెలంగాణా రాష్ట్రంలో హైవేల నిర్మాణం కోసం కేంద్రం దూకుడుగా ముందుకు వెళ్తుందని బీజేపీ నేతలు చెప్తుంటే, ఏ ఇబ్బంది అయినా కేంద్రం వల్లే వస్తుందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు.

### కేసీఆర్ 14 నెలలు అజ్ఞాతంలో ఉన్నారు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్-నవభూమి:14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న కె. చంద్రశేఖర రావుకు రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఎలా కనిపిస్తుందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఆయన సీజనల్ రాజకీయ నాయకుడని ఎద్దేవా చేశారు.



## స్నానానికి పనికిరావ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** మహా కుంభ మేళా సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న త్రివేణి సంగమ ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా పడిపోయింది. మురుగుతో నీరు కలుషితం అయిపోతోంది. ఇక్కడి నీటి కాలుష్యం ప్రాథమిక ప్రమాణాల స్థాయిని మించిపోయి స్నానానికి అనుకూలం కాని విధంగా మారిపోయింది. నీటిలో ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా స్థాయిని మించి పెరిగిపోయింది. తాము పరీక్షించిన అన్ని ప్రాంతాల్లోనూ ఆ బ్యాక్టీరియా ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా ఉందని ఈ నెల 3న నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఓ నివేదిక ద్వారా తెలిపింది. ఇటీవల ఓ కేసు విచారణలో ఎన్జీటీ ధర్మాసనం సీపీసీబీ నివేదికను సమీక్షించి ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణ చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తాము కోరినా స్పందించని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (యూపీపీసీబీ)పై ఎన్జీటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో బుధవారం జరిగే తదుపరి విచారణకు యూపీపీసీబీ సభ్య కార్యదర్శితో పాటు ఇతర అధికారులు పాల్గొనాలని ఆదేశించింది. కాగా, త్రివేణి సంగమంలో నీటి నాణ్యతపై అడిషనల్ కలెక్టర్ వివేక్ చతుర్వేది వివరణ ఇచ్చారు. పుణ్య స్నానాలకు వీలుగా నదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. అన్ని ఘాట్లలో పీసీబీ బృందం ప్రతిరోజు నీటి పరీక్షలు చేస్తోందని, నీటి నాణ్యత నియంత్రణలోనే ఉందని చెప్పారు. పువ్వులు, కొబ్బరికాయలు, ఇతరత్రా పూజా సామగ్రిని ప్రతి రెండు గంటలకు ఓసారి మెషీన్ల సాయంతో తొలగిస్తున్నామని వెల్లడించారు.

## మహా కుంభమేళా వ్యాపారం ఈసారి 3 లక్షల కోట్లు.. సరికొత్త రికార్డ్



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఈసారి అనుకున్న దానికంటే ఎక్కువ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ సెక్రటరీ జనరల్ చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. ఈ క్రమంలో వస్తువులు, సేవల ద్వారా దాదాపు రూ. 3 లక్షల కోట్ల వ్యాపారం సృష్టించబడిందన్నారు. 144 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ ప్రత్యేక మహా కుంభమేళా జనవరి 13న మొదలు కాగా, ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది.ఈ కుంభమేళా ప్రారంభానికి ముందు ప్రాథమిక అంచనాల ప్రకారం 40 కోట్ల మంది భక్తులు వస్తే, దాదాపు రూ. 2 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు జరుగుతాయని ఖండేల్వాల్ చెప్పారు. కానీ ఇప్పటికే వచ్చిన భక్తుల సంఖ్య 55 కోట్లను దాటేసింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 26 నాటికి దాదాపు 60 కోట్ల మంది ఈ మహాకుంభమేళాలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. దీంతో రూ. 3 లక్షల కోట్లకు పైగా వ్యాపార టర్నోవర్ జరుగుతుందని సెక్రటరీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇది ఉత్తర్ ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించిందని, దీంతోపాటు కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించిందని ఆయన అన్నారు.

మహా కుంభమేళా నేపథ్యంలో ఆతిథ్యం, ఆహారం, పానీయాలు, రవాణా, లాజిస్టిక్స్, మతపరమైన దుస్తులు, పూజా సమగ్రి, హస్తకళలు, దుస్తులు, ఇతర వినియోగ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ వ్యాపారాలు పుంజుకున్నట్లు తెలిపారు. దీంతోపాటు మీడియా, ప్రకటనలు, వినోదం, పౌర సేవలు, టెలికాం, మొబైల్, ఆధారిత సాంకేతికత, %జజుఎ% కెమెరాలు వంటి అనేక ఇతర వ్యాపార రంగాలు కూడా మంచి ఆర్థిక కార్యకలాపాలను చూశాయని ఖండేల్వాల్ చెప్పారు.

ఈ క్రమంలో కుంభమేళా 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నగరాలు, పట్టణాలు కూడా గణనీయమైన వ్యాపార వృద్ధిని సాధించాయన్నారు. దీని ద్వారా ఆయా స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలోపేతం అయినట్లు చెప్పారు. దీంతోపాటు అయోధ్య, వారణాసి, ఇతర మతపరమైన ప్రదేశాలలో కూడా యాత్రికుల సందర్శనలు పెరిగాయన్నారు. ఎందుకంటే భక్తులు అయోధ్యలో రాముడు, వారణాసిలో శివుడు, సమీప జిల్లాల్లో దర్శనం, పూజల కోసం ప్రయాణించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాలలో కూడా భారీ ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయన్నారు. యూపీ ప్రభుత్వం ప్రయాగ్‌రాజ్‌లో ఫ్లైఓవర్లు, రోడ్లు, అండర్‌పాస్‌ల కోసం రూ. 7500 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ. 1500 కోట్లు మహాకుంభమేళా ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా కేటాయించబడ్డాయి.

## ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారానికి కేజ్రీవాల్, అతిషి హాజరవుతారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇరవై ఏడేళ్ల తర్వాత దేశ రాజధానిలో బీజేపీ పాలనకు శ్రీకారం చుడుతూ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి రామ్‌లీలా మైదాన్ ముస్తాబవుతోంది. ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. భారీ ఏర్పాట్ల మధ్య జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, మాజీ సీఎం అతిషికి ఆహ్వానం పంపుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.కేజ్రీవాల్, అతిషితో పాటు ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ దేవేంద్ర యాదవ్‌ను స్వయంగా బీజేపీ ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ ఆహ్వానించనున్నారు. దేశ రాజధానిలోని క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లు, మురికివాడల ప్రజానీకాన్ని కూడా ఈ వేడుకకు ఆహ్వానిస్తున్నారు.5,000 మంది భద్రతా సిబ్బంది..బీజేపీ నేతలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఇతర ప్రముఖులు సైతం ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి వస్తుండటంతో రామ్‌లీలా మైదాన్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. 5,000కు పైగా భద్రతా సిబ్బందిని మోహరిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 10 కంపెనీల పారామిలటరీ బలగాలను కూడా రంగంలోకి దింపుతున్నారు. యుద్ధప్రాతిపదికన రామ్‌లీలా గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు జరుగుతున్నట్టు బీజేపీ ఎంపీ యేగేంద్ర చందోలియా తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు పాల్గొంటున్న హైప్రొఫైల్ ఈవెంట్ కావడంతో తామెంతో ఉత్సుకతతో ఉన్నామని, మోదీని గెలిపించి బీజేపీకి పట్టంకట్టిని ప్రజలు సైతం ఎంతో ఆసక్తిగా ఉన్నారని తెలిపారు.

## ఆ వేడుక వల్ల అయోధ్య రామమందిరం పనులకు బ్రేక్..

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**మహాకుంభమేళా సందర్భంగా అయోధ్య రామమందిరానికి భక్తుల తాకిడి భారీగా పెరిగిందని రామమందిరం నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలోనే రామాలయ నిర్మాణ పనులు 25 రోజులుగా ఆగిపోయినట్లు ఆయన తెలిపారు. మార్చి నెలలో పూర్తి కావాల్సిన పనులు జూన్ నాటికి అవుతాయని నృపేంద్ర వెల్లడించారు. అయోధ్యలోని రామ జన్మభూమి సముదాయంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులపై నృపేంద్ర మిశ్రా నేతృత్వంలో రెండు రోజులుగా సమావేశాలు జరుగుతున్నాయి. నిన్న(మంగళవారం) మ్మొదటి రోజు జరిగిన సమావేశంలో ఆలయానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నృపేంద్ర తెలిపారు. ఆయన నిర్మాణాలు పరిశీలించామని, అలాగే కొన్ని కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.మహాకుంభమేళా సందర్భంగా అయోధ్య బాల రాముడి దర్శనార్థం వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ దర్శన, నిష్క్రమణ ద్వారాలను విస్తరించాలని ప్రణాళికలు రూపొందించినట్లు నృపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి నిర్మాణ కమిటీలోని ముఖ్య సభ్యులందరూ నేడు ఆలయాన్ని పరిశీలించి చర్యలు చేపడతారని చెప్పారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో భక్తుల బూట్లు, చెప్పులు ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రామ జన్మభూమి సముదాయంలోని 11వ నంబర్ గేట్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అయితే భక్తుల తాకిడి వల్ల గేట్ నంబర్ 3 పనుల పూర్తి ప్రస్తుతం సాధ్యం కాదని చెప్పారు.

## భారత్‌లోని ఎక్స్ యూజర్లకు బిగ్ షాకిచ్చిన ఎలాన్ మస్క్.. 3 నెలల్లో రెండోసారి..!



భారత్‌లోని ఎక్స్ వినియోగదారులకు.. ఆ సంస్థ అధినేత ఎలాన్ మస్క్ పెద్ద షాక్ ఇచ్చారు. ఎక్స్ ప్రీమియమ్ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరలను భారత్‌లో భారీగా పెంచేసింది. ఈ పెంపుతో గతంలో ఉన్న ధరలకు ఈ ధరలు రెట్టింపు కావడం గమనార్హం. మరోవైపు.. ఇప్పటికే ఒకసారి ఎక్స్ ప్రీమియమ్ ప్లస్ ఛార్జీలను పెంచగా.. 3 నెలల వ్యవధిలోనే ఇప్పుడు రెండోసారి పెంచడంతో ఎక్స్ యూజర్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. గ్రోక్ 3 ఏఐ మోడల్ విడుదల తర్వాత ఈ ధరల పెంపు జరిగింది.ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి స్టార్టప్ సంస్థ "ఎక్స్ఏఐ '.. తాజాగా గ్రోక్ 3 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇక ఈ ఎక్స్ఏఐని ఉపయోగించాలంటే ఎక్స్‌లో ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని దాన్ని ప్రవేశపెట్టి సమయంలోనే ఎక్స్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీమియమ్ ప్లస్ ప్లాన్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ఇప్పటివరకు భారత్‌లో ప్రీమియం ప్లస్ ప్లాన్ సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.1750గా ఉండగా.. తాజా పెంపుతో అది రూ.3,470కి చేరింది. ఇక ఏడాది మొత్తానికి తీసుకునే ప్లాన్ ధరను రూ.18300 నుంచి రూ.34340కి పెంచింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. అయితే ట్విటర్‌ను కొనుగోలు చేసిన ఎలాన్ మస్క్.. ఆ తర్వాత అందులో ఎన్నో సంచలనాత్మక మార్పులు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ట్విటర్‌ను కొనుగోలు చేసిన వెంటనే దాని పేరును ఎలాన్ మస్క్ ఎక్స్‌గా మార్చేశారు.ఆ తర్వాత ఎక్స్ నుంచి ఆదాయన్ని సమకూర్చుకునేందుకు 2023 అక్టోబర్‌లోనే మొట్టమొదటిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్‌ను ఎక్స్ ప్రవేశపెట్టింది. అయితే మొదట ఈ ప్రీమియమ్ ప్లస్ ప్లాన్ ధర తక్కువగానే నిర్ణయించారు. 2023 అక్టోబర్‌లో రూ.1,300గా ఉన్న ఎక్స్ ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర.. ఆ తర్వాత 2024 డిసెంబర్‌లో రూ.1,750కి పెంచేశారు. ఈ క్రమంలోనే 3 నెలలు తిరగకుండానే.. తాజాగా ఈ ప్లాన్ ధరను భారీగా పెంచేశారు. రూ.1750 నుంచి ఒక్కసారిగా ఏకంగా రూ.3,470కు పెంచడంతో యూజర్లపై ఆర్థిక భారం పడనుంది.అదే సమయంలో ఎక్స్‌లో ఇతర ప్లాన్ల ధరలను మాత్రం అలాగే పెంచకుండా ఉంచింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరుతో మూడు రకాల సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా నిర్ణయించారు. ఇక ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్- ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ పదాలు రాసే అవకాశం ఈ ప్రీమియం ప్లాన్ల ద్వారా ఎక్స్ యూజర్లకు లభిస్తుంది.

## రైతన్నలకు కేంద్రం తీపి కబురు..

### మరో 5 రోజుల్లోనే ఖాతాల్లోకి పీఎం కిసాన్ డబ్బులు!



**న్యూఢిల్లీ-నవభూమి:** రైతన్నలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రతీ ఏటా అన్నదాతలకు పెట్టుబడి సాయంగా సర్కారు అందిస్తున్న పీఎం కిసాన్ నిధులను త్వరలోనే విడుదల చేయబోతుంది. ముఖ్యంగా పీఎం కిసాన్ 19వ విడుత నిధుల విడుదల తేదీకి ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసింది. ఫిబ్రవరి 24వ తేదీ సోమవారం రోజున.. నేరుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే నిధులను విడదల చేయబోతున్నారు. ఈక్రమంలోనే ఎకరానికి 2 వేల రూపాయల చొప్పున డబ్బులు.. నేరుగా రైతుల ఖాతాల్లో జమ కాబోతున్నాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 19వ విడత నిధులను.. నేరుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే విడుదల చేయబోతున్నారు. బిహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనబోతున్న ప్రధాని మోదీ.. అక్కడే 9.7 కోట్ల మంది అన్నదాతలకు ప్రయోజనం చేకూర్చబోతున్నారు. ఎకరానికి రూ.2 వేల చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయబోతున్నారు. అయితే పీఎం కిసాన్ పథకం కింద డబ్బులు అందుకోవాలనుకుంటే రైతులు.. ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కల్గి ఉండాలి. అంతేకాకుండా ఇ-కేవైసీ చేసి ఉండాలి.ఇప్పటి వరకు మొత్తంగా 18 విడతల్లో కేంద్ర ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్ నిధులను అందించగా.. చివరి సారిగా 2024 అక్టోబర్ 15వ తేదీన డబ్బును అన్నదాతల ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ద్వారా ప్రతీ ఏడాది రైతులకు రూ.6 వేల పెట్టుబడి సాయం అందుతోంది. ముఖ్యంగా మూడు విడతల్లో ఎకరానికి 2 వేల రూపాయల చొప్పున జమ చేస్తున్నారు. మొదట్లో డబ్బులు వచ్చి ఇప్పుడు పొందలేకపోతున్న వారు వెంటనే పీఎం కిసాన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా ఈ కేవీసీని పూర్తి చేయాలి. లేదంటే కామన్ సర్వీసెస్ సెంటర్ల ద్వారా బయోమెట్రిక్ కేవైసీని చేయించుకోవాలి. లేని పక్షంలో డబ్బులు రావు. వీరు మాత్రం ఈ పథకానికి అనర్హులు..!

ఇవన్నీ చేసిన కొంత మందికి మాత్రం డబ్బులు రావు. వాళ్లలో ప్రధానంగా రాజ్యాంగపరమైన పోస్టుల్లో ఉన్నవారు, గతంలో సేవలు అందించిన వారు ఉంటారు. మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జిల్లా పంచాయతీ ఛైర్మన్లు సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కంపెనీలు, ఆటోనమస్ బాడీ, లోకల్ బాడీ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులు.

## బీరు తాగితే ఎముకలు బలంగా ఉంటాయన్న పెటా..





**న్యూఢిల్లీ-నవభూమి:**బీరు తాగితే లాభాలు ఉన్నాయని.. పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్-పెటా రూపొందించిన వీడియో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీరులో సిలికాన్ స్థాయిలు అధికంగా ఉంటాయని.. దాని వల్ల బీరును తాగినపుడు.. ఎముకలకు బలం వస్తుందని పేర్కొంటూ రూపొందించిన వీడియోను.. పెటా తన అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేసింది. దీంతో అసలు బీరు తాగడం వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుందా అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే పెటా రూపొందించిన వీడియోపై నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదంతా తప్పు అని కొట్టిపారేస్తున్నారు. అంతేకాకుండా పెటా చేసిన యాడ్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు..బీరు తాగడం వల్ల ఎముకల ఆరోగ్యానికి మంచిదని పెటా ఒక యాడ్ వీడియోను యూట్యూబ్‌లో పోస్ట్ చేసింది. అంతేకాకుండా ఎముకలు పెలుసుబారడం వల్ల వచ్చే ఆస్టియోపోరోసిస్ వ్యాధిని నివారించవచ్చని పేర్కొంది.నిజం ఏంటి?..పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్-పెటా చేసిన యాడ్‌పై ఆరోగ్య నిపుణులు తీవ్రంగా మండిపడుతున్నారు. బీరు తాగడం వల్ల ఎముకల ఆరోగ్యం పెరుగుతుంది అంటూ చేసిన ఈ యాడ్ చాలా తప్పు అని పేర్కొన్నారు. ఇది వినియోగదారులను తప్పుదారి పట్టించేదిగా అభివర్ణిస్తున్నారు. నిజానికి మద్యం సేవించడం వల్ల ఎముకల వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు.

**వెరిఫికేషన్ అండ్ మెథడాలజీ**

పెటాకు యూట్యూబ్‌లో సుమారు 1.2 మిలియన్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అందులో పోస్ట్ చేసిన ఒక వీడియోలో.. బీరు తాగడం వల్ల ఎముకల అనారోగ్యం, ఎముకల వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. ఎందుకంటే బీరులో సూక్ష్మపోషక సిలికాన్ ఉంటుందని.. మితంగా బీర్ తాగడం అనేది ఆవు పాలు తాగడం కంటే ఆరోగ్యకరమైందని అందులో చెప్పారు.బీర్ ఎముకలకు ఆరోగ్యకరమైన పానీయం అంటూ ప్రచారం చేస్తూ.. అదే సమయంలో పాలు తాగే వ్యక్తులను నిరుత్సాహపరిచేలా పెటా తయారు చేసిన యాడ్.. ప్రపంచవ్యాప్తంగా మెడికల్ ఎక్స్‌పర్ట్స్ తీవ్రంగా మండిపడుతున్నారు. దీనిపై భారతీయ వైద్య నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అందుబాటులో ఉన్న చాలా బీర్లలో తక్కువ సిలికాన్ స్థాయిలు ఉన్నాయని గుర్తించారు. ఇక కర్ణాటక మైసూర్‌లోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ముఖేష్ కపూర్ దీనిపై స్పందించారు. బీర్ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకునేందుకు సమాచారాన్ని విశ్లేషిస్తున్నారని తెలిపారు. జర్నల్ ఆఫ్ ది సైన్స్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్‌లో కాలిఫోర్నియా డేవిస్ యూనివర్సిటీ సైంటిస్ట్‌లు చేసిన అధ్యయనం ప్రచురితం అయింది. ప్రధానంగా ఉత్తర అమెరికా, యూరోపియన్ బ్రూవరీల నుంచి వచ్చిన 100 బీర్లలో సిలికాన్ స్థాయిలు ఉన్నట్లు పేర్కొంది. అయితే దాని వల్ల ఎముకల ఆరోగ్యం మెరుగైనట్లు ఎలాంటి సమాచారం కనుగొనలేదు. అయితే ఈ అధ్యయన ఫలితాలు భారతీయ వినియోగదారులకు వర్తించకపోవచ్చని డాక్టర్ కపూర్ పేర్కొన్నారు. భారత్‌లోని బీర్ల తయారీలో.. మాల్టెడ్ బార్లీ కంటే బియ్యం, గోధుమలను అధికంగా ఉపయోగిస్తారని.. ఇది సహజంగానే తక్కువ సిలికాన్‌ను కలిగి ఉంటుందని తెలిపారు.ఈ అధ్యయనంలో బీర్లలో సగటున 29.4 సిలికాన్ ఉందని.. ఇండియా పేల్ ఆల్స్ 41.2 వద్ద అత్యధిక సిలికాన్ కంటెంట్‌ను చూపుతుందని వెల్లడైంది. ఎముకల ఆరోగ్యం కోసం ఆల్కహాల్ సేవించడం అనేది తప్పుదారి పట్టించడమే కాకుండా.. సిలికాన్ కంటెంట్ వాదన భారతీయ బీర్లకు వర్తించదని ఢిల్లీలోని ఎయిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆనంద్ చంద్ర స్పష్టం చేశారు. మరోవైపు.. నిజానికి ఆల్కహాల్ వినియోగం.. ఎముకల పగుళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతూనే ఉన్నారు.బీరు తాగితే ఎముకల ఆరోగ్యం, ఎముకల వ్యాధిని తగ్గిస్తుంది అని పెటా చేసిన యాడ్ తప్పుదారి పట్టించేదిగా ఉందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## మోనాలిసాకు బిగ్ షాక్.. బాలీవుడ్ సినిమా ఆఫర్ ఓ ట్రాప్



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో రుద్రాక్ష మాలలు అమ్ముతూ.. తన అందంతో సోషల్ మీడియాను షేక్ చేసిన మోనాలిసా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందరిలాగే ఈమె అందానికి ఫిదా అయిన బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఈమెకు తన సినిమాలో ఛాన్స్ ఇచ్చారు. అందుకుగాను ఆమె 21 లక్షల రూపాయల పారితోషికం కూడా ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే ఆమె అదృష్టాన్ని చూసి అంతా సంబురపడిపోతుండగా.. ఇప్పుడో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. డైరెక్టర్ సనోజ్ మిశ్రా.. సినిమా ఆఫర్ పేరుతో మోనాలిసాను శారీరకంగా వాడుకోవాలని చూస్తున్నాడని ఓ నిర్మాత చెప్పాడు.

కుంభమేళాలో కనిపించి.. తన అందం, ముఖ్యంగా తేనె కళ్లతో అందరినీ మంత్రముగ్ధులను చేసింది మోనాలిసా. అమాయకత్వం, అంతకుమించిన నవ్వుతోనే.. సోషల్ మీడియా క్వీన్‌గా మారిపోయింది. దీంతో ఆమె అందాన్ని చూసిన బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఈమెకు తన సినిమాలో ఆఫర్ ఇచ్చాడు. ముఖ్యంగా "డైరీ ఆఫ్ మణిపూర్" చిత్రంలో మోనాలిసాను తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. ఈక్రమంలోనే ఆమె ఇంటికి వెళ్లి మరీ.. సినిమాపై అధికారికంగా సంతకం కూడా తీసుకున్నారు. ఈ సినిమా కోసం ఆమెకు రెమ్యునరేష,గా 21 లక్షల రూపాయలు కూడా ఇస్తానన్నారు.ఒక్క వీడియోతోనే బాలీవుడ్ సినిమాలో నటించే స్థాయికి వెళ్లిన ఆమెకు.. అదృష్టం పట్టిందని అంతా అనుకున్నారు. కానీ ఇదంతా ఓ ట్రాప్ అంటూ తాజాగా బాలీవుడ్ ప్రొడ్యూసర్ జితేంద్ర నారాయణ్ సింగ్ త్యాగి కామెంట్లు చేశారు. డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఓ తాగుబోతు అని చెబుతూనే.. అమ్మాయిలకు సినిమా అవకాశాలు ఇస్తానంటూ వారిని శారీరకంగా వాడుకుం టాడని చెప్పారు. 21 లక్షల రెమ్యునరేషన్, మోనాలిసాకి సినిమా ఆఫర్ అంతా ఉత్తదేనని.. ఆమె కూడా మోసపోబోతుందంటూ బిగ్ బాంబ్ పేల్చారు. అంతటితో ఆగకుండా మిశ్రా తీసిన ఒక్క సినిమా కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదన్నారు.ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. నిజంగానే ఇదంతా ఉత్తదేనా అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిపై స్పందించిన కుంభమేళా వైరల్ గర్ల్ మోనాలిసా మాత్రం.. జితేంద్ర చేసినవన్నీ తప్పుడు వ్యాఖ్యలేనని వివరించారు.తనకు యాక్టింగ్ రాకపోయినా డైరెక్టర్ సనోజ్ మిశ్రా తనకు ఛాన్స్ ఇచ్చారని.. ప్రస్తుతం నటన కూడా నేర్పిస్తున్నారని చెప్పుకొచ్చింది. తనతో ఆయన ఏమాత్రం తప్పుగా వ్యవహరించలేదని.. కన్నబిడ్డలా చూసుకుంటున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో కూడా నెట్టింట వైరల్ అవుతోంది.

## అత్తను ఎలా చంపాలి.. మెసేజ్ పెట్టిన కోడలు.. కట్ చేస్తే బిగ్ ట్విస్ట్..



**బెంగళూరు-నవభూమి:** అత్తా కోడళ్ల పంచాయితీకి సంబంధించిన వార్తలు నిత్యం మనం చూస్తూనే ఉంటాం. కోడలిని చిత్రహింసలు పెడుతున్న అత్త.. అత్తపై దాడి చేసిన కోడలు.. ఇలాంటి ఘటనలు దేశ వ్యాప్తంగా నిత్యం ఎక్కడో చోట జరుగుతూనే ఉంటాయి. తాజాగా ఇలాంటి ఘటనే కర్ణాటకలో వెలుగు చూసింది. అయితే ఈ స్టోరీ చాలా భయనకంగా ఉంటుంది. ఓ మహిళ తన అత్తను చంపేందుకు.. ఏకంగా డాక్టర్‌నే సలహా అడిగింది. వాట్సాప్‌లో డాక్టర్‌కు మెసేజ్ చేసిన ఆ మహిళ.. నా అత్తను చంపేయాలి.. ఇందుకోసం ఎలాంటి మందులు వేయాలో చెబుతారా? అంటూ ఆ మెసేజ్‌లో పేర్కొంది. అది చూసి అవాక్కవ్వడం ఆ డాక్టర్ వంతైంది.. మరి ఆ మహిళ తన అత్తను ఎందుకు చంపాలనుకుంది.. ఆ మెసేజ్ చూసిన డాక్టర్ ఏం చేశాడు.. తరువాత జరిగిన ట్విస్ట్ ఏంటి.. పూర్తి వివరాలు తెలియాలంటే ఈ కథనం పూర్తిగా చదవాల్సిందే..

కొందరు అత్తా కోడళ్లు మంచిగా ఉంటారు.. మరికొందరు బద్ధ శత్రువుల్లా ఉంటారు.. మంచిగా ఉంటే పర్లేదు. శత్రువుల్లా ఉంటేనే అసలు సమస్య. ఇప్పుడు మనం చెప్పుకోబోయే అత్తాకోడళ్లు కూడా శత్రువుల్లా నిత్యం ఘర్షణకు దిగేవారు. కోడలు తన అత్తను ఎంతగా ద్వేషించేదంటే.. ఆమె ప్రాణాలు తీయాలని పథకాలు వేసింది. ఈ క్రమంలోనే.. వాట్సాప్‌లో వైద్యుడికి మెసేజ్ చేసి.. తన అత్తను చంపాలనుకుంటున్నట్లు చెప్పింది. ఆమెను అంతమొందించేందుకు ఎలాంటి మందు వాడాలో చెప్పరా అంటూ సలహా కోరింది. ఆ మెసేజ్ చదివిన వైద్యుడు షాక్ అయ్యాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. ఇక్కడే అసలైన ట్విస్ట్ చోటు చేసుకుంది.ఆ ట్విస్ట్ ఏంటంటే.. మెసేజ్ చేసిన మహిళ ఎవరో ఆ వైద్యుడికి తెలియదు. పైగా ఆ మహిళ తాను పంపిన మెసేజ్‌లను వెంటనే డిలీట్ చేసి నెంబర్‌ను బ్లాక్ చేసింది. కానీ, ఇంతలోనే డాక్టర్ ఆ మెసేజ్‌లను స్క్రీన్ షాట్ తీసుకుని దగ్గర పెట్టుకున్నారు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవికాస్తా వైరల్ అయ్యాయి. ఆ స్క్రీన్‌షాట్స్‌ని పోలీసులకు చూపించి.. కంప్లైట్ చేశాడు. ఇది కుట్ర కావచ్చునని అనుమానం వ్యక్తం చేశాడు వైద్యులు.డాక్టర్ సునీల్ కుమార్ పోలీసులకు ఏం చెప్పాడంటే.. 'నేను సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటాను. కొన్ని రోజుల క్రితం సహానా అనే మహిళ ఇన్‌స్టాగ్రమ్‌లో నాకు మెసేజ్ చేసింది. అక్కడ తాను పేషెంట్‌లా పరిచయం చేసుకుంది. నాతో మాట్లాడటం కోసం ఫోన్ నెంబర్ అడిగింది. నా ఫోన్ నెంబర్ ఇచ్చాను. ఆ తరువాత ఫిబ్రవరి 17న నా వాట్సాప్‌కు సహానా ఒక మెసేజ్ పెట్టింది.' అని చెప్పుకొచ్చాడు.

వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఇదే..

సహానా: హాలో.. నేను మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. కానీ, మీరు నన్ను తిడతారని భయపడుతున్నాను.

డాక్టర్: పర్వాలేదు చెప్పు, ఏం చెప్పాలనుకుంటున్నావు?

సహానా: నాకు చెప్పడానికి భయంగా ఉంది.

డాక్టర్: భయపడకు, చెప్పు.

సహానా: నా అత్తను చంపడానికి ఏదైనా మందు చెప్పండి.

డాక్టర్: హత్య చేసేందుకా? కానీ ఎందుకు?

సహానా: మా అత్త నన్ను చాలా హింసిస్తారు. వాళ్ల చిత్రహింసలు నేను భరించలేకపోతున్నాను.

డాక్టర్: మేము వైద్యులం, ప్రాణాలను కాపాడటమే మా పని. ఎవరి ప్రాణాలను తీయకూడదు.

అని ఇద్దరి మధ్య సంభాషణ జరిగింది. ఆ వెంటనే సహానా.. డాక్టర్‌కి పంపిన మెసేజ్‌లను డిలీట్ చేసింది. ఆ వెంటనే అతని నెంబర్‌ను బ్లాక్ చేసింది.నాపై కుట్ర చేశారేమో..ఈ చాట్ గురించి పోలీసులకు వివరించిన డాక్టర్ సునీల్ కుమార్.. ఇది తనపై ఎవరైనా కుట్రలో భాగంగా చేశారేమో అని అనుమానం వ్యక్తం చేశారు. తాను రాజకీయంగా, సామాజికంగా చాలా చురుకుగా ఉంటానని.. ఇది జీర్ణించుకోలేక ఎవరైనా కుట్ర చేశారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. సహాన తాను పంపిన మెసేజ్‌లన్నింటినీ డిలీట్ చేసిందని, తన ఫోన్ నెంబర్‌కు కూడా బ్లాక్ చేసిందని చెప్పారు. కానీ, అంతకు ముందే తాను అన్ని మెసేజ్‌లను స్క్రీన్ షాట్ తీసిపెట్టుకున్నట్లు వైద్యుడు తెలిపారు. డాక్టర్ సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సంజయ్ నగర్ పీఎస్ పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఎఫ్ పెట్టుబడి నిబంధనల్లో మార్పులు

**న్యూఢిల్లీ-నవభూమి:** మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు కొత్త పథకాల ద్వారా సమీకరించే నిధుల పెట్టుబడి నిబంధనలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మార్చింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇక ఈ పెట్టుబడులను ఫండ్ ఆఫర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న నిబంధనలకు లోబడి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలి. లేకపోతే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ మదుపరులకు ఉంటుందని సెబీ గత ఏడాది డిసెంబరులోనే స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానుంది.మరింత పక్కాగా స్టాక్ ట్రేడింగ్: టెక్ ఆధారిత స్టాక్ మార్కెటింగ్ ట్రేడింగ్‌నూ మరింత సురక్షితం చేయాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మొబైల్ ఆధారిత సిమ్ గుర్తింపు వ్యవస్థతో పాటు యూనిక్ కస్టమర్ కోడ్ (యూసీసీ) మరిం త పటిష్ఠం చేయాలని భావిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్పులతో మంగళవారం ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | గురువారం | 20 । ఫిబ్రవరి । 2025






## ఓ బండి నెంబర్ ప్లేటు చూసి విస్తుపోయిన విజయవాడ

**విజయవాడ- నవభూమి:** విజయవాడలో ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఓ బండిని, దానికున్న నెంబరు ప్లేటును చూసి విస్మయానికి గురయ్యారు. ఆ బండి నెంబరు ప్లేటుపై నెంబరుకు బదులుగా మాఫియా అని రాసి ఉంది. బెజవాడలోని ఓ సర్కిల్ వద్ద ట్రిపుల్ రైడింగ్ ను గమనించిన ట్రాఫిక్ పోలీసులు ఆ బండిని ఆపారు. నెంబరు కోసం చూడగా, మాఫియా అని రాసి ఉన్న అక్షరాలు కనిపించాయి. ఈ నెంబరు ప్లేటు ఏంది తమ్ముడూ... ఇన్సూర్డ్ బై మాఫియా అని రాసి ఉందేంట్రా. ఇదేం నెంబరు ప్లేటురా.... నేనెప్పుడూ చూడలేదు... కొత్తగా ఉంది ట్రాఫిక్ పోలీసు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. మాఫియా ఏందిరా... ఏ మాఫియారా మీరు... అంటూ ప్రశ్నించారు. అంతేకాదు, బైక్ సైలెన్సర్ ను కూడా మోడిఫై చేసి ఉండడం గుర్తించారు. కాగా, ఆ బైక్ ను ఇటీవలే వేరే వ్యక్తి నుంచి కొనుగోలు చేశానని, అయితే నెంబరు ప్లేటును మార్చకుండా అలాగే ఉంచానని సదరు బైకర్ వెల్లడించాడు. దాంతో, ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు ఆ కుర్రాడ్ని ఇంటికి పంపించి నెంబరు ప్లేటు తెప్పించి, అక్కడే రోడ్డుపైనే బండికి బిగించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.



## రైతు మనుగడకు ముంచుకొస్తున్న మరో ముప్పు

ప్రపంచమంతా కరోనా విజృంభణతో లాక్‌డౌన్‌లో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 2020, జూన్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు ఆర్డినెన్సులను తీసుకువచ్చి, ఆ తరువాత వాటిని చట్టాలుగా మార్చడం తెలిసిన విషయమే. ఈ మూడు చట్టాలను భారత రైతాంగం పూర్తిగా వ్యతిరేకించి, చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా దాదాపు 15 మాసాలు దేశ రాజధానిలో చేసిన దీక్షలు, ధర్నాల ఫలితంగా... చివరికి దేశ ప్రధాని రైతాంగానికి క్షమాపణ చెప్తూ ఈ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. ఆ సమయంలో ఆయన రైతాంగానికి కొన్ని నిర్దిష్టమైన హామీలను ఇచ్చారు. అందులో ముఖ్యమైనది కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పించడం. ఈ హామీ నేటికీ అమలు చేయకపోవడంతో భారత రైతాంగం తిరిగి పోరాట బాట పట్టింది. రైతాంగం నుంచి ఇంత వ్యతిరేకతతో కూడిన పోరాటాలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్‌ఎఎం) ముసాయిదా రూపంలో మళ్లీ రద్దు చేసిన నల్ల చట్టాలలోని కొన్ని అంశాలను రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం.

2024, నవంబర్ 24న భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్‌ఎఎం) ముసాయిదాను విడుదల చేసి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరింది. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తే, గతంలో రద్దయిన మూడు నల్ల చట్టాలలో రెండిటిని తిరిగి ఈ కొత్త మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దనున్నట్లు తెలుస్తుంది. భారత ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంపై రైతులు, రాష్ట్రాలు, నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతుల కోసం కాకుండా, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిన విధానమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ముసాయిదాలో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు ఏమిటో చూద్దాం.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారింది. అంతేకాక రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఎంఎస్‌పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టం. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుంది. అంతేకాక, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఈ విధానం పూర్తిగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా, అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీస్ (ఎపిఎంసీ) వ్యవస్థను బలహీనపరచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నాయి.

మరొక ముఖ్యమైన అంశం ఏమంటే, ఈ విధానం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోయి, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ విధానం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) ప్రధాన భాగస్వాములుగా చూపబడుతున్నప్పటికీ, కార్పొరేట్ సంస్థల కేంద్రీకృత నియంత్రణకు దోహదపడుతుంది. తద్వారా చిన్న రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారి, వాళ్ళు మార్కెట్‌లో బలహీనపడే ప్రమాదం పొంచివుంది. ఈ విధానంలో ఉన్న గిడ్డంగుల ప్రైవేటీకరణ ద్వారా, రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారు. ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సిన పద్ధతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వ్యాపారులు అనైతిక వర్తక సంఘాలుగా ఏర్పడి, రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందడం లాంటివి జరిగే ప్రమాదం ఉంది. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంలోని ఇలాంటి ప్రమాదకర అంశాల వల్ల రైతుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. వారు తమ పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మరొకవైపు, మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలను పెంచే అవకాశముంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవ సాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. గతంలో ఎపిఎంసీ చట్టం2002 సవరణ చేయవలసి వచ్చినప్పుడు ఆనాటి కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి శాసనసభ తీర్మానాలు తీసుకున్న తరువాత అమలులోకి తెచ్చేది. అలాంటి సంప్రదాయాలను నేటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. ఈ సమగ్ర విధానాలలో భాగంగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా కాస్ట్%-%3 పైన 50శాతం మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయడం, కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న గిడ్డంగులను ఆధునీకరించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎఫ్‌పిఓలను బలోపేతం చేయడం, మార్కెట్ రిస్క్ నుంచి రైతులను కాపాడడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల హక్కులకు ముప్పుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం సరైన మార్పులు చేసి, ఈ విధానాన్ని సమతుల్యం చేయాలి. రైతులు భవిష్యత్తులో బలహీనం కాకుండా, వారు తమ హక్కులను సాధించేందుకు అది సమర్థంగా ఉండాలి.

# "నవ సమాజ నిర్మాణంలో సామాజిక న్యాయం పాత్ర "



**ఫిబ్రవరి 20 ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా...**

ఒక దేశం అభివృద్ధి బాటలో పయనించాలంటే అక్కడ ఉండే ప్రజల సహకారం అవసరం. దీనికి ప్రజలందరికీ వివక్ష లేకుండా సామాజిక న్యాయం అందించబడాలి. ఒకవేళ సరైన రీతిలో సామాజిక న్యాయం అమలుకాకపోతే అక్కడ ప్రజలలో అసంతృప్తి పేరుకొని ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు చెలరేగుతాయి.




**సామాజికన్యాయం:**

సమాజంలో వనరులు, అవకాశాలు, విశేషాధికారాల నిష్పాక్షిక, సమాన పంపిణీని సామాజిక న్యాయం అంటారు. దీనిని పంపిణీన్యాయం అని కూడా అంటారు. ఈ భావన ప్లేటో తాను వ్రాసిన " ది రిపబ్లిక్ " గ్రంథంలో ప్రస్తావించారు. ఆధునిక కాలంలో ఈ భావన పంతొమ్మిదివ శతాబ్దం ప్రారంభంలో పారిశ్రామిక విప్లవ అనంతరం పెట్టుబడిదారీ దోపిడీకి బలైపోతున్న మానవ శ్రమకు పరిష్కారం చూపించి సమానత్వ సమాజాలను సృష్టించే లక్ష్యంగా యూరప్ అంతటా జరిగిన పౌర విప్లవాల సమయంలో ఉద్భవించింది. సామాజిక న్యాయం అంటే వ్యక్తికి సమాజానికి మధ్య న్యాయమైన సంబంధం. సరళంగా చెప్పాలంటే, సమాజంలో సంపద, అవకాశాలు, హక్కుల పంపిణీ పరంగా న్యాయాన్ని సూచిస్తుంది. ఇది జాతి, లింగం, మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సమానత్వంతో జీవిస్తున్నారనే భరోసా ప్రజలలో కలగాలి. చట్టబద్ధమైన పాలన ద్వారా సామాజిక ఆర్థిక అసమానతల సవాలును ఎదుర్కోవడం దీని లక్ష్యం.

సామాజిక న్యాయం ఎందుకు?

సామాజిక న్యాయం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు మెరుగ్గా పనిచేసేలా చేస్తుంది. పేదరికం, అసమానతలు, సామాజిక ఉద్రిక్తతలను తగ్గిస్తుంది. సామాజిక న్యాయం యొక్క ఆలోచన ఏమిటంటే చట్టపరమైన, రాజకీయ, ఆర్థిక, ఇతర పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రజలు సంపద, ఆరోగ్యం, శ్రేయస్సు, న్యాయం, సమాన ప్రాప్తిని కలిగి ఉండాలి. ఆర్థిక పరంగా, సామాజిక న్యాయ ప్రయత్నాలు సాధారణంగా జాతి, లింగం మతం వంటి సమూహ గుర్తింపు లేదా జనాభా లక్షణాల ద్వారా నిర్వచించబడిన వివిధ సమూహాల ఆర్థిక స్థితిని పెంచడానికి ప్రయత్నిస్తాయి.

**సామాజికన్యాయ దినోత్సవం:**

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న నిర్వహించబడుతుంది. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికి సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించడానికి చేయవలసిన కృషికోసం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. "సామాజిక న్యాయం కోసం ప్రపంచ కూటమి: అంతరాలను తగ్గించి పొత్తులను నిర్మించడం." అనే ఇతివృత్తాన్ని ఈ ఏడాది తీసుకున్నారు. దేశాలలో అంతర్గతంగా, విభిన్న దేశాల మధ్య శాంతి, భద్రతను సాధించడానికి, నిర్వహించడానికి సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం ఎంతో అవసరమని, అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవం లేనప్పుడు సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం పొందలేమని ఈ దినోత్సవం గుర్తిస్తుంది. న్యాయమైన, మరింత సమానమైన సమాజాలను నిర్మించాల్సిన అవసరం గురించి అవగాహన పెంచడం ఈ రోజు లక్ష్యం. పేదరిక నిర్మూలన, పూర్తి ఉపాధి, గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడం, లింగ సమానత్వం, సామాజిక శ్రేయస్సు, అందరికీ న్యాయం పొందడంలో అంతర్జాతీయ సమాజం యొక్క ప్రయత్నాలను మరింత బలోపేతం చేయడానికి ఈ దినోత్సవం దోహదపడుతుంది. సమాజం తన సామాజిక వనరులను ఎలా విభజిస్తుందో దానిలో న్యాయాన్ని ఇది నొక్కి చెబుతుంది. సామాజిక న్యాయం సామాజిక సంస్థలలో హక్కులు బాధ్యతలను ఏర్పరుస్తుంది. సహకార ప్రయోజనాలు, ఖర్చులలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావడానికి అనుమతిస్తుంది. పన్నులు, సామాజిక బీమా, ప్రజారోగ్యం, ప్రజా విద్య, ప్రజా సేవలు, కార్మిక చట్టం, మార్కెట్ నియంత్రణ అనేవి సమాన అవకాశాలు, సంపద పంపిణీని నిర్ధారించడంలో సహాయపడే కొన్ని సంబంధిత సంస్థలు.

**మన దేశంలో సామాజిక న్యాయం:**

సామాజిక న్యాయం సమస్య సామాజిక సమానత్వంతో ముడిపడి ఉంది. స్వాతంత్ర్యం సమయంలో సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం అనే భావన రాజ్యాంగ నిర్మాతలను బాగా ప్రభావితం చేసింది. సోషలిస్ట్, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర వంటి పదాలను అదే కారణంతోనే రాజ్యాంగ ప్రవేశికలో చేర్చారు. సామాజిక న్యాయం అంటే అన్ని వర్గాల ప్రజలను ఎటువంటి సామాజిక భేదం లేకుండా న్యాయంగా చూసుకోవడం. ఇది సమాజంలోని పేద తరగతులు (ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు), మహిళల పరిస్థితులు బలోపేతం అవుతాయని నిర్ధారిస్తుంది. ఇది సంపద, జీతం, ఆస్తిలో స్పష్టమైన అసమానతలను తొలగిస్తుంది. "పంపిణీ న్యాయం" అని పిలువబడేది సామాజిక, ఆర్థిక న్యాయాల కలయిక. ప్రవేశిక కింద భారతీయులందరికీ అవకాశం, హోదాలో సమానత్వం హామీ ఇవ్వబడింది. సామాజిక పురోగతికి సామాజిక న్యాయాన్ని ఒక సమర్థవంతమైన సాధనంగా మార్చడానికి, విధానాలు సరిగ్గా, నిష్పాక్షికంగా అమలు చేయబడతాయని పాలకులు హామీ ఇవ్వడం చాలా ముఖ్యం. మన దేశంలో సామాజిక న్యాయం రాజ్యాంగం ఆర్టికల్స్ ద్వారా దేశ ప్రజలకు హామీ ఇస్తుంది. ఆర్టికల్ 15(1) మతం, జాతి, కులం, లింగం లేదా పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఆర్టికల్ 16(1) అందరికీ సమానావకాశాలు కల్పిస్తుంది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిర్మూలించి దాని ఉనికిని నిషేధించింది. ఆర్టికల్ 19 దేశ ప్రజల ప్రాథమిక హక్కులను ప్రతిబింబిస్తుంది. 23, 24 ఆర్టికల్స్ దోపిడీకి వ్యతిరేకంగా ప్రాథమిక హక్కులను కల్పిస్తున్నాయి. ఆర్టికల్ 38 ప్రజల సంక్షేమాన్ని పెంపొందించడానికి ఒక సామాజిక క్రమాన్ని రూపొందించాలని రాష్ట్రాన్ని నిర్దేశిస్తుంది. జీవితం అర్థవంతంగా, గౌరవంతో జీవించగలిగేలా ఉండాలంటే, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన విధంగా అందరికీ న్యాయం చేయడం, వారి హక్కులను కాపాడడం చాలా ముఖ్యం. ఇది సమాజంలోని పేదలు, బలహీన దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాల బాధలను తగ్గించడానికి ఒక సాధనం. ఇది ఆరోగ్యం, విద్య సౌకర్యాలను అందించడం ద్వారా మానవ వనరుల పరిరక్షణకు సహాయపడుతుంది. సమాజంలో కుల వ్యవస్థ, అంటరానితనం, ఇతర వివక్షత వంటి సవాళ్లను నిర్మూలించడానికి సహాయపడుతుంది. మహిళల పట్ల దుర్వినియోగాన్ని పరిష్కరించడానికి సామాజిక న్యాయం తప్పనిసరి. వరకట్నం, ఆడ భ్రూణహత్య వంటి దురాచారాలు తగ్గుతాయి. ఇది తగ్గుతున్న లింగ నిష్పత్తి, బాలికలకు పరిమిత విద్యా అవకాశాల సమస్యలను కూడా పరిష్కరిస్తుంది. అన్ని వర్గాల ప్రజలకు వారి సామాజిక, ఆర్థిక స్థితి, వారి ఆర్థిక వనరులతో సంబంధం లేకుండా సామాజిక న్యాయాన్ని అందించాలి. దీనిని పూర్తిగా అమలు చేస్తే సమాన అవకాశాలను నిర్ధారించడంలో సహాయపడుతుంది. పిల్లలకు సంబంధించి బాలకార్మికత, బాల్యవివాహం, పోషకాహార లోపం, ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, పిల్లలపై వేధింపులు, పిల్లల అశ్లీలత, శిశు మరణాలు లేకుండా ఉండాలి. మైనారిటీలకు సంబంధించి ఏటువంటి సమస్యలు లేకుండా చూడాలి.

**ముందుకు సాగాలి:**

సామాజిక సమస్యలను, సవాళ్లను పరిష్కరించి ముందుకు పోవాలి. అందరికీ అందుబాటులో విలువలతో కూడిన విద్యను అందించాలి. దళితులు, గిరిజనులుకు రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించబడాలి. మహిళలకు అన్ని హక్కులు అమలుకావాలి. ఎటువంటి వివక్ష లేకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి. అప్పుడే సమసమాజం నిర్మితమవుతుంది.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**

# మతతత్వ మురికిలో పొర్లుతున్న సినిమా రంగం



ఒకానొకప్పుడు సినిమా రంగం ప్రగతిశీల భావాలకు నెలవుగా ఉండేది. సామాజిక రుగ్నతలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే సాధనంగా కొనియాడబడేది. కానీ నేడు అదే సినిమా మానవ సంబంధాలకు విఘాతం కలిగిస్తూ, మానవీయ విలువలకు పాతర వేస్తూ, సాంస్కృతిక కాలుష్యాన్ని పెంచుతూ సమాజంలో అనైక్యతకు, ముస్లింలపై ద్వేషం పెంచే మతతత్వ ఫాసిస్టు పోకడలకు బాటలు వేస్తుంది. మొత్తం సినిమా రంగమంతా కాకపోయినా తులసీవనంలో గంజాయి మొక్కల్లాంటి కొందరు మతపిచ్చ నటులు, దర్శకులు, నిర్మాతలు, మాటల రచయితల వల్ల ఇలాంటి పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సమాజంలో అతిపెద్ద మైనార్టీ సమాజమైన ముస్లింల మనోభావాలకు వీసమెత్తు విలువ ఇవ్వకుండా దేశద్రోహులుగా, ఖూనీకోర్లుగా చిత్రీకరిస్తూ ఇతర వర్గాల్లో ముస్లిం వ్యతిరేకత పెంచే ఫాసిస్టు కుట్రలకు పాల్పడుతుంది. చరిత్ర ముసుగులో చరిత్రను వక్రీకరించి హిందూ, ముస్లిం ల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతుంది. దేశభక్తి, చరిత్ర ముసుగులో ముస్లిం ద్వేష కేంద్రంగా ఇతివృత్తాలు నిర్మిస్తూ లౌకికవ్యవస్థకే సినీ రంగం గొడ్డలిపెట్టులా మారటం దురదృష్టకరం. ఓ వైపు బతుకు పోరాటంలో ఎన్నో సమస్యలతో కునారిల్లుతూ శ్రామిక జీవన సంస్కృతి కలిగి దేశ ఉత్పత్తి రంగంలో ప్రధాన శ్రమశక్తిగా ఉన్న ముస్లింలు నేడు సినిమా చూడాలంటేనే భయపడే పరిస్థితి దాపురించింది. అదేమంటే చూపించవల్సిన ఫ్యాక్షన్ అంతా చూపించి చివరిలో ఫ్యాక్షన్ తప్పు అని సందేశం ఇచ్చినట్టు ఒక మంచి ముస్లిం క్యారెక్టర్ కూడా పెట్టాం కదా! అని అంటారు. ఇటువంటి కుత్సితమైన మతతత్వ పూరితమైన ఆలోచనలు సినీ పరిశ్రమకు, సమాజానికి మరింత హాని చేసేవే కానీ మేలు చేసేవి కావు. ఈ మధ్య వచ్చిన యానిమల్ సినిమాలో ఖురఖా వేసుకొని ముస్లిం స్త్రీలు సిగరెట్ తాగుతున్నట్టు చూపారు. విలన్



ముస్లిం క్యారెక్టర్ను పెట్టి చాలా జుగుప్స చూపించారు. గర్భంతో ఉన్న ముస్లిం స్త్రీని(విలన్ భార్య )శత్రువు భార్య కదా చంపేసేయండి అని హీరో అంటాడు. 'పోలీస్ కమీషనర్' అనే సినిమాలో హీరో ఓ ముస్లిం క్యారెక్టర్ను 'రేయ్ తురకోడా' అని పిలుస్తాడు. 'ఖడ్గం' సినిమాలో హీరో టోపీ గడ్డం ఉన్న విలన్ను హిందూ దేవతా విగ్రహం ఉన్న గుడి కేసి తల మోది చంపుతాడు. పాకిస్తాన్ క్రికెట్లో గెలిస్తే ముస్లింలంతా స్వీట్స్ పంచుకుని ఆనందించినట్లు చూపిస్తాడు. వీటివల్ల సినిమా సంచలనాలు నమోదు చేసుకుని పది కాసులు సంపాదించి పెడితే పెట్టుందేమో కానీ సమాజానికి ఎంతహాని చేస్తుందో వేరే చెప్పనక్కరలేదు. అయినా ఈ దేశం కోసం రక్తతర్పణ చేసిన ముస్లింల త్యాగాలు ఒక చరిత్ర కాలేకపోయిన చోట ఇంతకన్నా మంచి సినిమాలు వస్తాయని ఆశించడం భంగపాటే అవుతుంది. పైసల కోసం మానవ విలువల్ని, వలువల్ని దిగజార్చేవాళ్ళకు దేశభక్తిని గురించి మాట్లాడే అర్హతే లేదు. ఒక ముస్లిం తన సమస్యల్ని మర్చిపోయి అందరిలా కాసింత వినోదం కోసం థియేటర్కు వెళితే ప్రతి రీలు నీతిలేని ఖడ్గమై కుళ్ళబొడుస్తుంది. ఇలా ఓ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వేధించటంలో సినిమా శాడిజం పరాకాష్టకు చేరుకుంది. మరో దృష్టి కోణం నుండి పరిశీలిస్తే ముస్లిం స్త్రీల జీవితాల్ని అపహాస్యం పాలు చేసే సినిమాలు వస్తున్నాయి. ఒక ముస్లిం స్త్రీ (హీరోయిన్) బురఖా లాగుతూ హీరో వెకిలి చేష్టలు (దర్శకుడి దృష్టిలో ప్రేమ) చేస్తుంటాడు. ఇలాంటి సన్నివేశాలు చిత్రీకరించటం ద్వారా వీళ్ళు సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో ఫాసిజం ఆలోచన విధానం అవగాహన చేసుకున్న వారెవరికైనా తెలుస్తుంది. ఇలాంటి సందేశాలే ఒక రకంగా ఆయేషామీరా హత్యకు కారణం అయ్యాయని ఎవరైనా అంటే తప్పు పట్టవల్సిన అవసరం లేదు.

సినీ ఇండస్ట్రీలో ముస్లిం నటులు, గాయకులు, దర్శకులు, రచయితల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. తమకు ఇష్టమైన స్వంత పేర్లతో పిలవబడే అదృష్టం కూడా వీరికి లేదు. తాము ముస్లిం పేర్లతో కొనసాగితే తమను ఎక్కడ అణిచివేస్తారోనని భయపడ్తూ సినీ రంగంలో అనేక మంది తమ పేర్లు మార్చుకోవటం ముస్లిం కళాకారుల దైన్యస్థితికి అద్దం పడుతుంది. ఇలా తెలుగు సినిమాలో వేళ్ళూనుకుంటున్న ఫాసిజం పడగనీడలో ముస్లిం క్యారెక్టర్ ఆర్టిస్టులు సైతం నిత్యం అవమానాలకు గురి అవుతూ తమ కెరీర్ను కాపాడుకోవల్సి వస్తుంది. అదే తమిళ, మళయాళ, హిందీ సినీరంగాలలో అయితే ప్రతిభకు పట్టం కడతారే తప్ప కళాకారుల కులం, మతం చూడరు. ఆ స్థాయికి తతిమ్మా సినీరంగం ఎప్పుడు ఎదుగుతుందో వేచి చూడాల్సిందే. కులం కంపులో కుళ్ళిపోతూ, మతతత్వ రొచ్చులో పొర్లాడుతూ సినిమా సగటు ప్రేక్షకులకు జుగుప్స కలిగిస్తుంది. తెలుగు సినిమాలో విప్లవ సినిమాలు తీస్తున్నామని చెప్పుకుంటున్నవారి పరిస్థితి సైతం ఇందుకు భిన్నంగా లేదు. వీరికి ముస్లింల జీవితాలు, అభద్రతా భావం, అస్తిత్వ భయాలు ఎప్పుడూ ఇతివృత్తంగా కన్పించలేదు. సమాజంలోని పీడితుడు హిందువైనా, ముస్లిమైనా అతని పక్షం వహించేవాడే నిజమైన కళాకారుడు.

అలాకాక సమాజాన్ని ముక్కలు ముక్కలు చేసి మత విద్వేషాలు పెంచాలని చూసేవారు కళాకారులుగా కాక కళాసైతానులుగా మిగిలిపోతారు. ప్రపంచవ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం, దేశీయంగా మతతత్వ ఫాసిజం బుసలు కొడ్తున్న ఈ సందర్భంలో మతసామరస్యాన్ని, నిజమైన దేశప్రేమని పెంపొందించే సినిమాలు తీయటం, ప్రోత్సహించటం సినీ నిర్మాణ సంస్థల నైతిక బాధ్యత. అయితే మొత్తం తెలుగు సినీ ప్రపంచం ఇలా కుళ్ళి పోయిందని మనం గుండెలు బాదుకోవల్సిన అవసరం లేదు కానీ కొద్ది మంది వల్ల మొత్తం సినీరంగానికి అప్రతిష్ట రాకుండా జాగ్రత్త పడవల్సిన అవసరం అందరికీ ఉంది.


ప్రపంచ చరిత్రలో ఎంతో విశిష్టమైన భారతీయ సంస్కృతిలో భాగమైన లౌకికపునాదుల్ని కాపాడుకోవటం అందరి విధి. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే సాధనంగా, సామరస్య, సహజీవన విలువల్ని పెంపొందించే కళాఖండాల్ని నిర్మిస్తూ విభిన్న వర్గాల వారధిగా తెలుగు సినిమా భవిష్యత్తులో నిలవాలని ఆశిద్దాం..

**"సినీ దర్శకుల్లారా!**
**నలిగి నలిగి నుజ్జయినోడ్ని**
**బిక్కు బిక్కుమని బ్రతికేటోడ్ని**
**చించబడ్డ బురఖాల్ని**
**మూల పడ్డ చరఖాల్ని**
**దొర్లిపడ్డ మా గడ్డం తలల్ని**
**బాయ్నెట్ నెత్తుటి వెలల్ని**
**ఎప్పుడైనా చిత్రించారా?**
**జీవితాంతం మాతో సాగే**
**ఆకలి గీతాల్ని**
**అక్షర క్షయమైన సత్యాల్ని**
**ఎప్పుడైనా విన్పించారా?**
**ఇక మీ సినిమా ఉన్మాదం**
**చూడలేము ఆపండేహె!**

**-కవి కరీముల్లా**
**వినుకొండ**



## మహాశివరాత్రి రోజు ఈ తప్పులు పొరపాటున కూడా చేయకండి..!



మహాశివరాత్రి.. పరమశివునికి అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటి. ఈ పండుగ భక్తులకు ఎంతో విశిష్టమైనది. ఈ పర్వదినాన శివుని ఆరాధించడం, శివలింగానికి పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదమని నమ్ముతారు. ఈ సమయంలో శివలింగానికి అనేక పదార్థాలు సమర్పిస్తారు. వాటిలో పాలు ముఖ్యమైనవి. అయితే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదని శాస్త్రాలు చెబుతున్నాయి. దీనికి గల కారణాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

హిందూ ధర్మంలో రాగిని అత్యంత పవిత్రమైన లోహంగా పరిగణిస్తారు. రాగి పాత్రలో ఉంచిన ఏ వస్తువు అయినా పవిత్రంగా ఉంటుందని విశ్వసిస్తారు. ఇంట్లోకి కొత్త రాగి పాత్రలు తెచ్చినప్పుడు వాటిని ముందుగా పాలతో కడుగుతారు. పాలు వస్తువులలోని నెగటివ్ ఎనర్జీని తొలగిస్తాయని నమ్మకం. అలాగే పాలు దాదాపు ప్రతి పూజలోనూ ఉపయోగిస్తారు. పాలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నంగా భావిస్తారు. రాగి ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ రాగికి కొన్ని పరిమితులు ఉన్నాయి. కొన్ని పదార్థాలతో రాగి చర్య జరుపుతుంది. పాలు ఏ వస్తువు నుండైనా నెగటివ్ ఎనర్జీని గ్రహిస్తాయి. రాగి చెంబు చుట్టూ ఏదైనా అశుద్ధం ఉంటే రాగి చెంబులో పాలు పోసినప్పుడు ఆ అశుద్ధం పాలతో కలిసిపోతుంది. దీనివల్ల పాలు అపవిత్రమవుతాయి. అలాంటి పాలను శివలింగానికి సమర్పించడం మంచిది కాదు. పాలు రాగితో కూడా చర్య జరుపుతాయి. కొన్ని సందర్భాలలో పాలు రాగి పాత్రలో ఎక్కువసేపు ఉంచితే పాలు పాడైపోయే అవకాశం ఉంది. రాగి చెంబులోని పాలు కూడా నెగటివ్ ఎనర్జీని గ్రహిస్తాయి. అందుకే రాగి చెంబులోని పాలను మద్యంతో సమానంగా భావిస్తారు. అటువంటి పాలను శివలింగానికి సమర్పించడం దోషంగా పరిగణిస్తారు. శివునికి సమర్పించే పాలు స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. అందుకే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదు.

మహాశివరాత్రి రోజున శివుడిని భక్తితో పూజించడం వల్ల ఆయన అనుగ్రహం పొందవచ్చు. శివలింగానికి స్వచ్ఛమైన పాలతో అభిషేకం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అయితే రాగి చెంబులో పాలు పోసి అభిషేకం చేయకూడదు. వేరే లోహపు పాత్రలో అంటే వెండి లేదా మట్టి పాత్రలో పాలు పోసి శివలింగానికి సమర్పించవచ్చు. కొన్ని ప్రాంతాలలో పంచామృతంతో అభిషేకం చేస్తారు. పంచామృతం అంటే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర కలిపిన మిశ్రమం. మహాశివరాత్రి పూజలో భక్తి, శ్రద్ధ ముఖ్యమైనవి. శివునికి ప్రీతికరమైన పదార్థాలను సమర్పించి ఆయనను ప్రార్థించడం వల్ల మనోభీష్టాలు నెరవేరుతాయి. రాగి చెంబులో పాలు పోయకూడదనే నియమం గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా పూజ చేయడం మంచిది.



# నవతార



## దోశలు అంటుకోకుండా రావాలంటే...

ఒక్కోసారి దోశలు వేసినపుడు అవి పెనానికి అతుక్కుపోతుంటాయి. వాటిని పెనం నుంచి తీయడానికి ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. అలాగని నాన్‌స్టిక్ పాన్‌లను ఉపయోగించడం..... ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దోశలు పెనానికి అంటుకోకుండా మంచి రంగులో క్రిస్పీగా రావాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

– ముందుగా పెనాన్ని జిడ్డు లేకుండా నున్నగా శుభ్రం చేసుకోవాలి. తరవాత స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద వేడి చేయాలి. పెనం మీద నీళ్లు చల్లితే చిటపటమంటూ వెంటనే ఆవిరైపోవాలి. అప్పుడే దోశ వేయడానికి పెనం అనుకూలంగా ఉంటుంది. ఒక పెద్ద ఉల్లిపాయను మధ్యకు కోసి దానితో పెనమంతా రుద్దాలి. తరవాత ఒక గంటెతో దోశ పిండిని పెనం మధ్యలో వేసి గుండ్రంగా వేగంగా రుద్దుతూ పెనమంతా పరచాలి. ఈ దోశ మీద కొన్ని నూనె చుక్కలు వేయాలి. మంట మధ్య స్థాయిలో ఉండేలా చూసుకుంటే ఒక నిమిషంలో చుట్టూ ఎర్రగా కాలి దోశ సులభంగా పెనం నుంచి విడివడుతుంది.

– ఒక గిన్నెలో గ్లాసు నీళ్లు తీసుకుని మూడు చెంచాల నూనె వేసి బాగా కలపండి. చిన్న గుడ్డ ముక్కను గుండ్రంగా మడిచి ఈ మిశ్రమంలో ముంచి దానితో వేడిగా ఉన్న పెనం మీద రుద్దాలి. తరవాత దోశ వేస్తే పెనానికి అంటుకోకుండా ఉంటుంది.

– పెనం వేడెక్కిన తరవాత దానిమీద అర చెంచా నూనె వేయాలి. ఒక బంగాళదుంపను తీసుకుని మధ్యకు కోసి ఒక భాగం మీద చాకుతో గాట్లు పెట్టి దానితో పెనమంతా నూనె అంటుకునేలా రుద్దాలి. తరవాత దోశ వేస్తే చక్కగా వేగి పెనం నుంచి సులువుగా వచ్చేస్తుంది.

## మీలో ఈ చెడు అలవాట్లు ఉన్నాయా.. ఏ అబ్బాయి మిమ్మల్ని ప్రేమించడు..



కొంత మంది మనిషి అందం చూసి ప్రేమిస్తారు..ఇంకొంతమంది మనిషిలోని గుణాలను చూసి ప్రేమిస్తారు. అయితే, అందాన్ని చూసి ప్రేమించేవారి కన్నా గుణాలను చూసి ప్రేమించే వారు జీవితంలో సంతోషంగా ఉంటారు. కానీ, అమ్మాయిలు అందంగా ఉండి ఈ 5 చెడు లక్షణాలు ఉంటే మాత్రం ఏ అబ్బాయి మనస్ఫూర్తిగా ప్రేమించడు. ఒకవేళ ప్రేమించినా ఆ బంధం ఎక్కువ కాలం కొనసాగదు. ఎందుకంటే అందం ఆధారంగా ఏ సంబంధమూ ఎక్కువ కాలం సాగదు. మీ ప్రవర్తనలో కొన్ని చెడు అలవాట్లు ఉంటే, మీ అందం కూడా ఆ ప్రభావాన్ని కాపాడదు. అబ్బాయిలు తరచుగా అలాంటి అలవాట్లకు దూరంగా ఉండటానికి ఇష్టపడతారు, ఇది వారి ఆత్మగౌరవం లేదా శాంతిని ప్రభావితం చేస్తుంది. మీరు అందం ఉన్నప్పటికీ అబ్బాయిలు మీకు దూరం కాగల ఆ 5 చెడు అలవాట్లను ఇప్పుడు తెలుసుకుందాం..

**1. అబ్బాయిలను తగ్గించడం:**
మీరు ప్రతి చిన్న విషయాన్ని విమర్శించడం లేదా ఇతరులలో ఎల్లప్పుడూ తప్పులు కనుగొనడం మంచిది కాదు. ఎందుకంటే ఈ అలవాటు ఎవరికైనా అసౌకర్యాన్ని కలిగిస్తుంది. సంబంధాలలో సానుకూలత, ప్రశంసలు అవసరం. అబ్బాయిలు తరచుగా తమ బలహీనతలను అర్థం చేసుకుని, పదే పదే వారిని నిరాశపరచకుండా ఉండే మహిళను భాగస్వామిగా చేసుకోవాలని కోరుకుంటారు.

**2. మితిమీరిన అహం:**
మితిమీరిన అహం మీ బంధం తెగిపోయేలా చేస్తుంది. మీరు ఎల్లప్పుడూ మీ అభిప్రాయాన్ని సరైనదని నిరూపించడానికి ప్రయత్నించడం కరెక్ట్ కాదు. ఇతరుల భావాలను గౌరవించాలి.

**3. అబద్ధం చెప్పే అలవాటు:**
అబద్ధం చెప్పే అలవాటు ఉంటే మానుకోవడం మంచిది. ఎందుకంటే ఇది మనిషిపై నమ్మకం లేకుండా చేస్తుంది. మీ బంధం ఎక్కువ కాలం కొనసాగాలంటే నిజాయితీగా ఉండండి. అబ్బాయిలు నమ్మకం లేని అమ్మాయిలతో ఉండటానికి ఇష్టపడరు.

**4. ప్రతికూలంగా ఉండటం:**
మీరు ఎల్లప్పుడూ ప్రతికూలంగా ఆలోచించడం మంచిది కాదు. ప్రతి సందర్భంలోనూ చెడును మాత్రమే చూస్తే మీ పార్టనర్ మీపై విసుగు చెందవచ్చు. అంతేకాకుండా ఈ అలవాటు ఇతరులను మీ నుండి దూరం చేస్తుంది.

**5. మితిమీరిన నియంత్రణ:**
ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ అవసరం. మీరు ప్రతి విషయంలోనూ మీ భాగస్వామిని నియంత్రించడానికి ప్రయత్నిస్తే అతడు మీపై విరక్తి చెంది మీ నుండి దూరం అవుతాడు. కాబట్టి మితిమీరిన నియంత్రణ మంచిది కాదు.

## అమ్మ మనసు అమృతం పంచుతోంది!



తల్లిపాలకు నోచుకోని శిశువుల అవస్థలు చూసి విచిత్ర సెంథిల్ కుమార్ అమ్మ మనసు చలించిపోయింది. తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన ఆమె తనవంతు ప్రయత్నంగా ప్రారంభించిన 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నాలుగువేల లీటర్లకి పైగా చనుబాలను సేకరించి, ఎంతోమంది పిల్లలకు జీవనాధారంగా నిలుస్తోంది. ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలి. మన దేశం తరఫున ఆడాలి... విద్యార్థిగా ఉన్నప్పుడు విచిత్ర సెంథిల్‌కుమార్ కల ఇది. ఆమె కాలేజీ, యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్లకు కెప్టెన్‌గా ఉన్నారు. కోయంబత్తూర్ జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టులో సభ్యురాలుగా 1999–2002 మధ్య అనేక విజయాల్లో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర జట్టుకు ఆమెను పరిగణనలోకి కూడా తీసుకున్నారు. కానీ గాయాల కారణంగా... ఆటకు దూరం కావలసి వచ్చింది. "కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా లక్ష్యాన్ని సాధించడానికి నన్ను నేను సిద్ధం చేసుకోవడం, ఎలాంటి అవరోధాలనైనా పట్టుదలతో అధిగమించి ముందుకు సాగడం లాంటివి నాకు క్రీడలే నేర్పించాయి" అని చెబుతున్నారు 41 ఏళ్ళ విచిత్ర. ఆమె స్వస్థలం తమిళనాడులోని చిన్నకలిపాళ్యెం. క్రీడల తరువాత ఆమెకు చాలా ఇష్టమైన పని... అవసరంలో ఉన్నవారికి సాయం చెయ్యడం. ఈ విషయంలో తండ్రి మరుదాచలం ఆమెకు స్ఫూర్తి. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుకు ఆయన సాయం చేసేవారు. ఆయన అండతో ఎందరో పెద్ద చదువులు చదివి, ఉన్నతోద్యోగాలు సంపాదించుకున్నారు. తండ్రి బాటనే అనుసరించిన విచిత్ర... ప్రభుత్వ పాఠశాలలోని పేద పిల్లలకు ట్యూషన్ ఫీజులు కట్టేవారు. "చిన్న చిన్న పనులు చేస్తూ బతుకు సాగించే కుటుంబాలు... తమ పిల్లల్ని బాగా చదివించాలనుకుంటాయి. కానీ ఆర్థిక పరిస్థితుల వల్ల అది చాలాసార్లు సాధ్యం కాదు. దానికోసం పాకెట్ మనీని వారి ఫీజుల కోసం ఖర్చు చేసేదాన్ని. ఈ సంగతి తెలిసి మా నాన్న నా పాకెట్ మనీని రెట్టింపు చేశారు. "మంచి పని చేస్తున్నావు. ఇంకా డబ్బు కావాలంటే అడుగు" అన్నారు. ఆ మాట విని ఉద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చేశాను" అని గుర్తు చేసుకున్నారు విచిత్ర.

**అంతగా పట్టించుకోని పెద్ద సమస్య...**

"వివాహం తరువాత తిరుప్పూర్‌లో స్థిరపడ్డాక కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించాను. దీనికి నా భర్త సెంథిల్ కుమార్ అన్ని విధాలుగా మద్దతిచ్చారు. పిల్లల చదువుకు సాయం చెయ్యడంతో పాటు... గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధుల కోసం నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వెయ్యికి పైగా క్యాటరాక్ట్ సర్జరీలు చేయించాం. ఇవన్నీ నేను, నా కుటుంబం, కొద్దిమంది స్నేహితులు కలిసి చేసిన కార్యక్రమాలు. కానీ 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' నా పరిధిని పెంచింది. సేవాభావం ఉన్న ఎందరో మహిళలను నాకు పరిచయం చేసింది" అంటారు విచిత్ర. 2021లో... ఆమెలో ఈ ఆలోచనకు బీజం పడింది. "అప్పుడు నేను నెలల బిడ్డకు తల్లిని. నా స్నేహితురాలు ఒకరు ఫోన్ చేసి "ఈరోడ్‌లో ఒక శిశువుకు తల్లిపాలు కావాలి. ఇవ్వగలవా?" అని అడిగింది. అలా అడగడం నాకు ఆశ్చర్యం అనిపించింది. అయితే చనుబాలు ఆ శిశువుకు కేవలం పోషకాహారం మాత్రమే కాదనీ, జీవనాధారం అనీ తెలుసుకున్నాక 'సరే' అన్నాను. అక్కడికి వెళ్ళిన తరువాత... వైద్యుల ద్వారా చాలా విషయాలు విన్నాను.. తల్లిపాలకు దూరమైన పిల్లల రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉంటుంది. అలెర్జీలు, జీర్ణ సంబంధమైన ఇబ్బందులు పెరుగుతాయి. ఉబ్బసం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొందరు పిల్లలకు పోతపాలు పడవు. దీనివల్ల వారు తీవ్ర అనారోగ్యాలకు గురవుతారు. కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడవచ్చునని తెలిశాక.... 'ఇది మనం అంతగా పట్టించుకోని పెద్ద సమస్య' అని అర్థమయింది. అప్పుడే చనుబాల బ్యాంక్ ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది"అంటారు విచిత్ర. ప్రసవించిన తల్లులకు, వారి శిశువులకు ఆ బ్యాంక్ అందుబాటులో ఉండాలని ఆమె అనుకున్నారు. తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి యాజమాన్యాన్ని కలిసి, తన ప్రతిపాదనను వారికి వివరించారు. వారి అంగీకారంతో... అదే ఏడాది 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' ఏర్పాటు చేశారు. పాలిచ్చే తల్లులు... వారి మిగిలిన పాలను ఈ బ్యాంకుకు దానం చేస్తే... ఎందరో చిన్నారులకు ప్రాణదానం చేసినట్టవుతుందని ప్రచారం చేశారు.






**వారి ఉదారతే ఎక్కువ...**

"తమ పిల్లల కోసం ఉద్దేశించిన పాలను ఇతరులకు ఇవ్వడం చాలామందికి ఇష్టం ఉండదు. అంతేకాదు... ఈ విషయంలో ఎన్నో అపోహలు, అనుమానాలు, మూఢ నమ్మకాలు ఉన్నాయి. ఈ అవరోధాలన్నిటినీ మెల్లగా దాటుతూ వచ్చాం" అని అంటారు విచిత్ర. తనది చిత్తశుద్ధి కలిగిన ప్రయత్నం అనే విశ్వాసాన్ని కలిగించడం కోసం... తల్లులను ఆమె స్వయంగా కలిశారు. వారి ఇంటికి వెళ్ళి, వారికి, వారి కుటుంబ సభ్యులకు 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్' గురించి, వారు విరాళంగా ఇచ్చే పాల ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. క్రమంగా దాతల సంఖ్య పెరిగింది. ఎంతోమంది ఉత్సాహంగా ముందుకువచ్చారు. "ఒక మహిళ కేవలం తొమ్మిది నెలల్లోనే 117 లీటర్ల చనుబాలను ఈ బ్యాంక్‌కు అందించారు. నేను చేసే పని మీద మహిళలకు ఏర్పడిన నమ్మకానికి ఇదొక నిదర్శనం" అని చెప్పారు విచిత్ర. గత నాలుగేళ్ళలో... నాలుగు వేల లీటర్లకు పైగా చనుబాలను ఆమె సేకరించారు. నెలలు నిండకుండా పుట్టిన పిల్లలు, తల్లితండ్రులు వదిలేసిన శిశువులు, అనారోగ్యం వల్ల, ఇతర కారణాల వల్ల చనుబాలు ఇవ్వలేని తల్లుల సంతానం... ఇలా ఎందరో ఈ బ్యాంక్ నుంచి ప్రయోజనం పొందుతున్నారు. "ప్రజలతో మమేకమై, వారి విశ్వాసాన్ని పొందే సామర్థ్యం ఆమెకు ఉంది. పసి ప్రాణాలను కాపాడాలనే ఆమె తపన అందరికీ స్ఫూర్తిదాయకం" అంటారు తిరుప్పూర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి వైద్యులు. "ఇది తల్లులకు, బిడ్డలకు మాత్రమే కాదు, కుటుంబాలకు, సమాజానికి సంబంధించిన సమస్య కూడా. అందరం కలిస్తేనే ప్రపంచంలో మార్పు సాధ్యమవుతుంది. ఇందులో నేను చేసిన దానికన్నా... ఎందరో మాతృమూర్తుల ఉదారతే ఎక్కువ. నేను ఇద్దరు పిల్లల తల్లిని. అమ్మ మనసు, అమ్మ కష్టాలు మరో అమ్మకే తెలుస్తాయి. మా 'బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్'ను నడిపిస్తున్నది, పిల్లలకు తమ పాల రూపంలో అమృతాన్ని పంచుతున్నది అలాంటి అనేక మాతృ హృదయాలే" అని చెబుతున్నారు విచిత్ర.

## తాజా తాజా చట్నీలు



ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ... ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని... అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో తయారుచేసిన పచ్చళ్లనే తినమని డాక్టర్లు సూచిస్తూ ఉంటారు. అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ... మీ కోసం.

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ


**కావాల్సిన పదార్థాలు:**
ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి– రెండు చెంచాలు, తరిగిన అల్లం: అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు– నాలుగు, పసుపు– అర చెంచా, టమోటా ముక్కలు– ఒక కప్పు, కేరట్– అర కప్పు, బీన్స్– పావు కప్పు, కాలీఫ్లవర్– అర కప్పు, తరిగిన కొత్తిమీర– రెండు చెంచాలు, చింతపండు రసం– రెండు చెంచాలు, పంచదార– ఒక చెంచా, ఉప్పు– తగినంత, నూనె– పావు కప్పు, ఆవాలు– ఒక చెంచా, మినపప్పు– ఒక చెంచా, జీలకర్ర– ఒక స్పూను, ఎండు మిరపకాయలు– రెండు, ఇంగువ– తగినంత

**తయారీ విధానం:**
కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చేదాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
కూర ముక్కల్లోని నీళ్లు ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.
జాగ్రత్తలు:పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

**ముల్లంగి ఆకుల చట్నీ**
కావాల్సిన పదార్థాలు:
తరిగిన కొత్తిమీర– అర కప్పు, ముల్లంగి ఆకులు– అర కప్పు, ముల్లంగి ముక్కలు– పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు– ఆరు, పచ్చిమిర్చి ముక్కలు– రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు– అర చెంచా, నూనె– రెండు చెంచాలు, నిమ్మకాయ రసం– నాలుగు చెంచాలు, ఉప్పు– తగినంత
తయారీ విధానం:మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.
జాగ్రత్తలు:
కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

**చేమ ఆకుల చట్నీ**
కావాల్సిన పదార్థాలు:సన్నగా తరిగిన చేమ ఆకులు– రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు– మూడు స్పూన్లు, చింతపండు రసం– రెండు చెంచాలు, బెల్లం పొడి– రుచికి తగినంత, కొబ్బరి తురుము– నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు– రెండు చెంచాలు, నూనె– పావు కప్పు, తరిగిన కొత్తిమీర– రెండు స్పూన్లు, ఉప్పు– తగినంత, నీళ్లు– తగినన్ని
తయారీ విధానం:
ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.
జాగ్రత్తలు:లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకుకూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.

## కళ్లకు విశ్రాంతి ఇలా...



శీతాకాలంలో వీచే చలిగాలుల వల్ల కళ్లలో తేమ తగ్గిపోతుంటుంది. కళ్లు ఒత్తిడికి గురై పొడిబారుతుంటాయి. దీంతో కళ్లు ఎర్రగా మారి గుచ్చుకుంటున్నట్లుగా అనిపిస్తాయి. కళ్లు త్వరగా అలసిపోతాయి కూడా. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కలు వాడడంతోపాటు కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చు.
కళ్లకు విశ్రాంతి ఇలా...శీతాకాలంలో వీచే చలిగాలుల వల్ల కళ్లలో తేమ తగ్గిపోతుంటుంది. కళ్లు ఒత్తిడికి గురై పొడిబారుతుంటాయి. దీంతో కళ్లు ఎర్రగా మారి గుచ్చుకుంటున్నట్లుగా అనిపిస్తాయి. కళ్లు త్వరగా అలసిపోతాయి కూడా. వైద్యుల సలహా మేరకు కంటి చుక్కలు వాడడంతోపాటు కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చు.

**ఏకాగ్రతగా చూడడం**
ఇది యోగాభ్యాసంలో ఒక ప్రక్రియ. స్థిరంగా చూపు నిలపడమే దీని ఉద్దేశం. మీ నుంచి మూడు అడుగుల దూరంలో ఒక కొవ్వొత్తిని ఉంచి వెలిగించండి. యథాస్థానంలో నిలబడి కొవ్వొత్తి మంటను అయిదు నుంచి పది నిమిషాలపాటు రెప్పవేయకుండా తదేకంగా చూడండి. ఇలా ప్రతిరోజూ చేస్తూ ఉంటే కళ్లలో నీరు సహజంగా ఉత్పత్తి అవుతుంది. తేమ శాతం పెరిగి కళ్లు పొడిబారే సమస్య తగ్గుతుంది. ఏకాగ్రతతో పాటు కంటి చూపు మెరుగుపడుతుంది.

**అరచేతులతో వేడి అద్దడం**
ల్యాప్‌టాపలు, కంప్యూటర్ల ముందు పనిచేసేవాళ్లకిబీ చదువుకునే పిల్లలకు కళ్లు ఒత్తిడికి గురై అలసిపోతూ ఉంటాయి. ఈ సమస్య చలికాలంలో మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటపుడు కళ్లకి విశ్రాంతి అవసరం. అరచేతులను ఒకదానిపై మరోదానిని చేర్చి వేగంగా రుద్దాలి. రెండు అరచేతులు వేడిగా అయిన తరవాత వాటిని మూసిన కళ్లమీద అద్దాలి. రెండు నిమిషాలు వేడి తగ్గే వరకు అలాగే ఉంచాలి. గట్టిగా గాలి పీల్చాలి. ఇలా వరుసగా నాలుగుసార్లు చేయాలి. అరచేతుల వేడికి కళ్లలోని కండరాలు సడలి విశ్రాంతి పొందుతాయి. కళ్లకు రక్తప్రసరణ జరిగి అలసట తగ్గుతుంది.


**కళ్లు గుండ్రంగా తిప్పడం**
కుర్చీలో కూర్చుని వీపుని నిటారుగా ఉంచాలి. కళ్లను గుండ్రంగా సవ్య దిశలో తరవాత అపసవ్య దిశలో తిప్పాలి. ఇలా పది నిమిషాలు చేయాలి. దీనివల్ల కంటి చుట్టూ ఉన్న కండరాలపై ఒత్తిడి తగ్గుతుంది. దృష్టిని కేంద్రీకరించే సామర్థ్యం పెరుగుతుంది. కళ్లలో ఎరుపుదనం తగ్గి ప్రకాశవంతంగా మెరుస్తాయి.

**వేగంగా రెప్ప వేయడం**
రెప్పవేసే ప్రక్రియ ద్వారానే కళ్లు ద్రవాన్ని ఉత్పత్తి చేసుకుంటాయి. తరచుగా రెప్పవేస్తూ ఉంటేనే కళ్లు తేమగా ఉంటాయి. కంప్యూటర్ల ముందు పనిచేసేవారు, తదేక దృష్టితో చూస్తూ చదివే పిల్లలు చాలా సమయం వరకూ రెప్ప వేయరు. దీనికి చలిగాలులు తోడైతే కళ్లలో తేమశాతం పూర్తిగా తగ్గుతుంది. అందుకే వీలుదొరికినపుడల్లా కనీసం ఇరవై సెకన్ల పాటు వేగంగా కళ్లు ఆర్పుతూ ఉండాలి. తరవాత అర నిమిషం కళ్లు మూసుకుని ఉండాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే కళ్లు పొడిబారే సమస్య తలెత్తదు.

**నీళ్లు చిలకరించడం**
ఇది కళ్లను శుభ్రం చేసేందుకు ఉపయోగించే ప్రక్రియ. దోసిలి నిండా నీళ్లను తీసుకుని ముఖానికి దగ్గరగా పెట్టుకుని మెల్లగా కళ్లమీదికి చల్లాలి. గోరువెచ్చని లేదంటే చల్లని నీళ్లను ఇలా చిలకరించుకోవచ్చు. దీనివల్ల కళ్లలోని దుమ్ము, ధూళి తొలగిపోతాయి. ఎండ, గాలి వల్ల కలిగే ఒత్తిడి, అలసట తగ్గి కళ్లు ప్రశాంతంగా కనిపిస్తాయి. త్రిఫల చూర్ణం కలిపి వడకట్టిన నీళ్లు లేదా గులాబీ నీళ్లను చిలకరించుకున్నా కూడా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.




## రూట్ మార్చిన ఎఫ్ఐఐలు.. ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..




**ముంబై- నవభూమి:**వరుసగా అమ్మకాలు సాగిస్తూ వస్తున్న విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం రూటు మార్చారు. మళ్లీ కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఆ సానుకూలాంశంతో బుధవారం ఉదయం దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. అయితే మధ్యాహ్నం తర్వాత కాస్త కుదుపునకు లోనై లాభాలను కోల్పోయాయి. చివరకు ఫ్లాట్‌గా రోజును ముగించాయి. వరుసగా నష్టపోతూ వస్తున్న మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు మాత్రం లాభాలను ఆర్జించాయి. సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి. మంగళవారం ముగింపు (75, 967)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 200 పాయింట్ల నష్టంతో రోజును ప్రారంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. ఒక దశలో 350 పాయింట్లకు పైగా లాభంతో 76 వేల పైకి ఎగబాకింది. 76, 338 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలను కోల్పోయింది. చివరకు 28 పాయింట్ల స్వల్ప నష్టంతో 75, 939 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 12 పాయింట్ల స్వల్ప నష్టంతో 22, 932 వద్ద స్థిరపడింది.

## ఐఫోన్ ఎస్ఈ 4పై పెరుగుతున్న ఆసక్తి.. రిలీజ్, ధర, ఇతర వివరాలు ఇవేనా?



**ముంబై- నవభూమి:**గతంలో ఆపిల్ ఫోన్ అంటే ధనవంతుల దగ్గర మాత్రమే ఉంటుందనే భ్రాంతి ఉండేది. అయితే ప్రస్తుతం చాలా మంది ఐఫోన్ యూజర్లుగా మారిపోయారు. పల్లెటూళ్లలో కూడా ఐఫోన్లు వాడే వాళ్లు కనబడుతున్నారు. ఐఫోన్‌ను మరింత మందికి చేరువ చేసేందుకు యాపిల్ కంపెనీ మరిన్ని ప్రయత్నాలు చేస్తోంది. బడ్జెట్‌లో అందరికీ అందుబాటులో ఉండే ఎస్ఈ 4 వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. బుధవారం రాత్రి 10.30 గంటలకు ఈ ఫోన్ విడుదల అయినట్లు వార్తలు వస్తున్నాయి విపరీతమైన ఆసక్తి నెలకొనడంతో ఎస్ఈ 4 వెర్షన్‌కు సంబంధించి ఇప్పటికే పలు లీక్‌లు వచ్చాయి. 2022లో విడుదలైన ఎస్ఈ 3 వెర్షన్ టచ్ ఐడీతో ఉంటుంది. అయితే తాజాగా విడుదల కాబోతున్న ఎస్ఈ 4 వెర్షన్ ఇతర ఐఫోన్ల తరహాలోనే ఫేస్ ఐడీతో ఉంటుదని సమాచారం అలాగే 6.1 అంగుళాల ఓఎల్ఈడీ స్క్రీన్, యాపిల్ లేటెస్ట్ బయానిక్ చిప్ ఏ18తో రాబోతున్నట్టు సమాచారం. ఇక, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ, 48 ఎంపీ బ్యాక్ కెమేరా, 12 ఎంపీ ఫ్రంట్ కెమేరా, 20 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఎస్ఈ 4 వెర్షన్‌లో అందుబాటులో ఉండబోతున్నట్టు సమాచారం ఐఫోన్ 15 నుంచి లైటినింగ్ కేబుల్ స్థానంలో టైప్-సి ఛార్జింగ్ సదుపాయాన్ని యాపిల్ అందిస్తోంది. ఈ ఎస్ఈ 4 వెర్షన్‌కు కూడా టైప్-సి ఛార్జింగ్ పోర్ట్‌నే ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇక, ధర విషయానికి వస్తే 2022లో ఎస్ఈ 3ని విడుదల చేసినపుడు దాని ధర రూ.43,999గా ప్రకటించారు. తాజా ఎస్ఈ 4 వెర్షన్ ధరను రూ.45 వేల నుంచి 50 వేల మధ్యలో నిర్ణయించవచ్చని వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ మొబైల్ పేరును ఎస్ఈ 4 అని కాకుండా ఐఫోన్ 16ఈ అని కూడా పెట్టవచ్చని కొందరు చెబుతున్నారు. ఏదేమైనా మరికొద్ది గంటల్లో పూర్తి వివరాలు బయటకు రాబోతున్నాయి.

## బంగారం, వెండి ధరలు ఇవే.. ఎంత పెరిగాయంటే..



**ముంబై- నవభూమి:** కొన్ని నెలలుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. మధ్యమధ్యలో స్వల్పంగా తగ్గి ఊరట కలిగించినప్పటికీ గతేడాదితో పోలిస్తే ధరలు భారీగానే పెరిగాయి. పసిడి రేటు పెరగడంతో పండగలు, వివాహాలు వంటి శుభకార్యాయాలకు గోల్డ్ కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి సాధారణంగా బంగారం ధరపై ప్రభావం చూపుతుంటాయి. కాగా, నేడు (19-02-2025) ఉదయం 06:30 గంటల సమయానికి బులియన్ మార్కెట్ ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,833 ఉండగా.. 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.86,000గా ఉంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.79,099కు చేరుకోగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86,290 వద్ద కొనసాగుతోంది.

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

ఇక, వెండి విషయానికి వస్తే.. దేశరాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,000గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబైలో కేజీ వెండి రూ.97,170కు చేరుకుంది. ఇక, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో రూ.97,320 వద్ద కొనసాగుతోంది.

ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఇవే..


ముంబై- రూ.78,971, రూ.86,150
చెన్నై- రూ.79,200, రూ.86,400
బెంగళూరు- రూ.79,035, రూ.86,220
కోల్‌కతా- రూ.78,870, రూ.86,040
పుణె- రూ.78,971, రూ.86,150
భోపాల్- రూ.79,053, రూ.86,240
భువనేశ్వర్- 78,989, రూ.86,170
కోయంబత్తూర్- రూ.79,200, రూ.86,400
జైపూర్- రూ.78,962, రూ.86,140
పట్నా- రూ.78,925, రూ.86,100

## రూ.324 లక్షల కోట్లు

**ముంబై- నవభూమి:**ముంబై: గత ఏడాది (2024)కి గాను భారత్‌లోని అత్యంత విలువైన 500 ప్రభుత్వయేతర కంపెనీల జాబితా విడుదలైంది. యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన ప్రైవేట్ బ్యాంకింగ్ వ్యాపార విభాగమైన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా దీన్ని విడుదల చేశాయి. భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17.52 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా నాలుగోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. గత ఏడాదిలో రిలయన్స్ మార్కెట్ సంపద 12 శాతం పెరిగిందని రిపోర్టు వెల్లడించింది. దేశీయ ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన టీసీఎస (రూ.16.10 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫసీ బ్యాంక్ (రూ.14.22 లక్షల కోట్లు) వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఎయిర్‌టెల్ (రూ.9.74 లక్షల కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.9.30 లక్షల కోట్లు), ఇన్ఫోసిస(రూ.7.99 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.5.80 లక్షల కోట్లు), ఎల్ అండ్ టీ(రూ.5.42 లక్షల కోట్లు), హెచ్‌సీఎల్ టెక్ (రూ.5.18 లక్షల కోట్లు), ఎన్‌ఎసఈ (రూ.4.70 లక్షల కోట్లు) వరుసగా టాప్-10లోని తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. జాబితాలోని 500 కంపెనీ ల మొత్తం మార్కెట్ సంపద గత ఏడాది 40 శాతం పెరిగి 3.8 లక్షల కోట్ల డాలర్లకు (రూ.324 లక్షల కోట్లు) చేరుకుంది.

### లయన్స్‌గేట్ ప్లేలో సౌత్ ఇండియన్ థ్రిల్లర్లు! తెలుగు క్రైమ్ డ్రామా

## 'దక్షిణ' ఫిబ్రవరి 21న వరల్డ్ డిజిటల్ ప్రీమియర్‌కు సిద్ధమవుతోంది




న్యాయానికి కొత్త పేరు ఉంది- ఏసీపీ దక్షిణ! లయన్స్‌గేట్ ప్లే తన అత్యంత ఉత్కంఠభరితమైన సౌత్ డిజిటల్ క్రైమ్ యాక్షన్ చిత్రం 'దక్షిణ'ను ఫిబ్రవరి 21న విడుదల చేస్తోంది. కఠినంగా వ్యవహరించే ఏసీపీ దక్షిణగా సాయి ధన్షిక (కబాలి ఫేమ్) నటించింది. వైజాగ్‌ను భయపెడుతున్న క్రూరమైన సీరియల్ కిల్లర్‌ను విశ్రాంతి తీసుకోకుండా వెంబడించడం, దర్యాప్తులో నేరస్థుడిని మాత్రమే కాకుండా ఆమె స్వంత ప్రవృత్తులు మరియు నమ్మకాలకు అతీతంగా ఎలా వ్యవహరిస్తుందో ఈ చిత్రం చూపిస్తుంది. కల్ట్ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై ఓషో తులసి రామ్ దర్శకత్వం వహించి, అశోక్ షిండే నిర్మించిన ఈ దక్షిణ సినిమా, హై-స్టేక్ యాక్షన్ మరియు ఎమోషనల్ డెప్త్‌ను మిళితం చేసి, ప్రేక్షకులను వారి సీట్ల అంచున ఉంచేలా చేస్తుందనడంలో సందేహం లేదు.

దారుణ హత్యలతో అట్టుడుకుతున్న నగరం నేపథ్యంలో తెరకెక్కించిన ఈ సినిమా, యువతులను లక్ష్యంగా చేసుకుని ఒక మానసిక రోగి అయిన హంతకుడిని వెతికి పట్టుకునేందుకు ఏసీపీ దక్షిణ, ఆమె టీమ్ సమయంతో పోటీ పడుతుండాన్ని చూపిస్తుంది. వారు వెలికితీసే ప్రతి క్లూతో, రహస్యం మరింత లోతుగా మారుతుంది. ఇది వారికి తెలిసిన ప్రతిదాన్ని సవాలు చేసే షాకింగ్ మలుపులు, దాచిన కుట్రలను బయటకు తీస్తుంది. లయన్స్‌గేట్ ప్లే 'థ్రిల్లింగ్, ఫన్ అండ్ ఎక్సైటింగ్' వాగ్దానానికి కట్టుబడి, యాక్షన్, సస్పెన్స్ మరియు కుట్రల అద్భుతమైన మిశ్రమాన్ని దక్షిణ అందిస్తుంది. మీరు తీవ్రమైన క్రైమ్ డ్రామాలకు లేదా డైనమిక్ మహిళా కథానాయికలకు ఆకర్షితులైనా, ఈ వేగవంతమైన చిత్రం తప్పక చూడవలసిన థ్రిల్లర్. తన పాత్ర, ఓటీటీ ప్రీమియర్ గురించి సాయి ధన్షిక మాట్లాడుతూ, "దక్షిణ నాకు చాలా ఉత్తేజకరమైన పాత్ర. ఆమె నిర్భయమైనది, భయపెట్టేది అలాగే, ఆమె ధైర్యవంతురాలు. ఇది శారీరక దృఢత్వం మరియు భావోద్వేగ బలాన్ని కోరుకునే పాత్ర. పాత్ర బలాన్ని సమతుల్యం చేయడంతో పాటు ఆమె మృదుత్వంతోనూ వ్యవహరించే సన్నివేశాలు సవాలుతో కూడుకున్నది. నేను ఆమె పాత్రకు న్యాయం చేశానని భావిస్తున్నారు. నేను 2018లో విడుదలైన కాతాడి తర్వాత, పోలీసు పాత్రలో కనిపించడం 2వసారి. ప్రేక్షకులు ఏసీపీ దక్షిణను ప్రతిసారీ ప్రేమతో అక్కున చేర్చుకుంటారని నేను ధీమాతో ఉన్నాను" అని పేర్కొన్నారు.

ఆమె దీని గురించి మరింత వివరిస్తూ, "సినిమా అనేది ఆకర్షణీయమైన భావన. నా పాత్ర తీరుతెన్నులు నన్ను మొదటి నుంచీ కట్టిపడేసింది. దక్షిణ ఒక భయంకరమైన పోలీసు నుంచి కఠినమైన వ్యక్తిత్వంగా పరిణామం చెందింది. ఆమె ప్రయాణం ప్రేక్షకులను దానికి దారితీసిన పరిస్థితుల గురించి ఆలోచిస్తూ వారి సీట్ల అంచున ఉంచుతుందని నేను కచ్చితంగా భావిస్తున్నాను. ఉత్కంఠ, ఊహించని మలుపులు దక్షిణను ఉత్కంఠభరితమైన ప్రయాణంగా చేస్తాయి. నా అభిమానులందరూ లయన్స్‌గేట్ ప్లేలో ఓటీటీ ప్రీమియర్‌ను ఆనందిస్తారని నేను ఆశిస్తున్నాను" అని తెలిపారు.

## అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం కోసం గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నెలకొల్పిన ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్





**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించింది. కంపెనీ 7వ ఎడిషన్ పశు వికాస్ డే లో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన అతిపెద్ద ఒకరోజు పశువుల సంరక్షణ శిబిరాలు ద్వారా ఈ మైలురాయిని సాధించారు. ఈ శిబిరాలు 16 రాష్ట్రాలలోని 500 ప్రదేశాలలో ఏకకాలంలో నిర్వహించబడ్డాయి, దీనిద్వారా దాదాపు 1,90,000 మంది లబ్ధిదారులు (1,50,000 పశువులు 40,000 పశువుల యజమానులు) ప్రయోజనం పొందారు. భారతదేశంలో, గ్రామీణ ప్రాంత జనాభాలో దాదాపు 65-70% మంది తమ జీవనోపాధి కోసం వ్యవసాయం లేదా వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడుతున్నా రు. అందువల్ల, వారి జీవనోపాధి ఉత్పత్తి కార్యకలాపాలు మరియు ఆర్థిక శ్రేయస్సులో పశువులు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ విడదీయరాని బంధాన్ని గుర్తించి, ఇండియా క్రెడిట్ 7వ ఎడిషన్ పశు వికాస్ దినోత్సవాన్ని "మేరా పశు మేరా పరివార్" అనే నేపథ్యంతో జరుపుకుంది, ఇది ఈ గ్రామీణ కుటుంబాల జీవితాల్లో పశువుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించింది. వార్షిక కార్యక్రమంలో 6,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు చురుకుగా పాల్గొన్నారు, ఇది గ్రామీణ సంక్షేమం పట్ల కంపెనీ నిబద్ధతను వెల్లడించింది. SMFG ఇండియా క్రెడిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శంతను మిత్రా మాట్లాడుతూ, ఇండియా క్రెడిట్ వద్ద, అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించడం పట్ల మేము స్థిరంగా మా నిబద్ధత వెల్లడిస్తున్నాము. భారతదేశ వ్యాప్తంగా 1000o శాఖల నిర్వహణతో, మా ప్రాథమిక దృష్టి టైర్-2o ప్రాంతాలపై నిలిచింది, మా శాఖలలో దాదాపు 90% ఈ ప్రాంతాలలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయబడ్డాయి. వాస్తవానికి, గత రెండు సంవత్సరాలలో, మేము దాదాపు 300 శాఖలను జోడించాము, అన్నీ టైర్-2o భౌగోళిక ప్రాంతాలలో ఉన్నాయి. సరైన ఉత్పత్తులు మరియు ఆర్థిక పరిష్కారాలను అందించడం ద్వారా ఆర్థిక చేరికను ప్రోత్సహించడం మా లక్ష్యం, అది కమ్యూనిటీలకు వారి జీవిత చక్రంలోని ప్రతి దశలో వారికి సేవ చేయడానికి మాకు వీలు కల్పిస్తుంది. అంకితభావంతో బహుళ వేదికలలో అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం కోసం గిన్నిస్ ప్రపంచ రికార్డును సాధించడంలో తమ అత్యుత్తమ నిబద్ధత కృషిని ప్రదర్శించిన మా ప్రతి ఉద్యోగికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సంవత్సరం పశు వికాస్ దినోత్సవం పశువుల సంరక్షణలో అంచనాలను అధిగమించడమే కాకుండా, భారతదేశంలోని బహుళ వేదికలలో ప్రత్యేక విజ్ఞాన సెషన్‌లను పరిచయం చేయటం నిజంగా సంతోషముగా ఉంది, ఇది మాకు గిన్నిస్ ప్రపంచ రికార్డును సంపాదించిపెట్టింది." అని అన్నారు.

## మార్చి 1, 2025 నుంచి ఫాస్టాగ్ నిలిపివేస్తున్నారా.. కారణమిదేనా..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ప్రస్తుతం ఫాస్టాగ్ గురించి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఫిబ్రవరి 17 నుంచి కొత్త రూల్స్ వచ్చినా కూడా, వినియోగదారులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం 2025 మార్చి 1 నుంచి వ్యవస్థను నిలిపివేస్తూ, టోల్ పన్నుల వసూళ్ల కోసం కొత్త విధానం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ప్రజల ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఆటోమేటెడ్ టోల్ రీడింగ్ సిస్టమ్ ను ప్రవేశపెడుతుందని అంటున్నారు. అయితే ఈ కొత్త వ్యవస్థ ఎలా పనిచేస్తుంది, ఏ విధంగా ప్రయోజనాలను పొందవచ్చనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

కొత్త విధానం..ప్రభుత్వం ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సిస్టమ్ ని మార్చి 1, 2025 నుంచి ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. దీని ద్వారా వాహనాల నంబర్ ప్లేట్లను స్కాన్ చేసి టోల్ చెల్లింపులను వసూలు చేస్తారు. ఇది చాలా సులభంగా, ఫాస్ట్‌గా, డిజిటల్ విధానంలో జరగనుంది.

**ఈ వ్యవస్థ ఎలా పని చేస్తుంది?**

కెమెరా స్కానింగ్: టోల్ ప్లాజా వద్ద హై రిజల్యూషన్ కెమెరాలు వాహనాల నంబర్ ప్లేట్లను స్కాన్ చేస్తాయి

డేటాబేస్ మ్యాచింగ్: వాహన నంబర్ ప్రభుత్వ డేటాబేస్‌తో అనుసంధానించి, దాని యజమానిని గుర్తిస్తారు.

ఆటోమేటిక్ చెల్లింపు: మీ బ్యాంక్ ఖాతా లేదా UPI, మొబైల్ వాలెట్ ద్వారా టోల్ చెల్లింపు జరుగుతుంది

ప్రవేశం: టోల్ ప్లాజా వద్ద ఆగిపోవడం వంటివి ఉండవు

ఈ విధానం ఇప్పటికే యూరప్, అమెరికాలో వంటి దేశాల్లో అమల్లో ఉంది. దీనిని ఇండియాలో కూడా అమలు చేయాలని భావిస్తున్నారు.

కొత్త టోల్ వ్యవస్థ ప్రయోజనాలు

ఆగకుండా ప్రయాణించడం: టోల్ ప్లాజా వద్ద పొడవైన లైన్ల వంటివి లేకుండా ప్రయాణించవచ్చు

మోసాల నివారణ: నకిలీ FASTagలను ఉపయోగించలేరు

ఖచ్చితమైన చెల్లింపు: దూరాన్ని బట్టి టోల్ చెల్లింపులు ఉంటాయి, అదనపు రుసుములు ఉండవు

నగదు రహిత విధానం: డిజిటల్ లావాదేవీలు జరగడం వల్ల పారదర్శకత పెరుగుతుంది

తక్కువ కాలుష్యం: టోల్ బూత్ వద్ద ట్రాఫిక్ తగ్గడం వల్ల కాలుష్యం కూడా తగ్గుతుంది

దీని కోసం ఏం చేయాలి..

దీనికోసం మీరు కొత్తగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. మీ కారు రిజిస్ట్రేషన్ నంబర్ స్వయంచాలకంగా %ూచీూ=% సిస్టమ్‌కి లింక్ అవుతుంది. కానీ మీరు ఈ క్రింది విషయాలను మాత్రం గుర్తుంచుకోవాలి:

HSRP (High Security Registration Plate): మీ కారుకి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ ఉండాలి

బ్యాంక్ ఖాతా లేదా UPI: మీ కారు రిజిస్ట్రేషన్, ఫోన్ నంబర్‌కు బ్యాంక్ ఖాతా లేదా UPI ఐడీ కనెక్ట్ చేయబడాలి

**పాత లైసెన్స్ ప్లేట్:** మీ కారుకు పాత లైసెన్స్ ప్లేట్ ఉంటే దాన్ని మార్చుకోవాలి.

ఎందుకు నిలిపివేత..భారతదేశంలో 2016లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడానికి, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, టోల్ పన్నుల వసూళ్లను సరళీకృతం చేయడానికి వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థలో కొన్ని సమస్యలు తలెత్తాయి. చాలా ప్రదేశాల్లో FASTag స్కానింగ్ సమస్యలు, దాని వల్ల వాహనాలు ఆగిపోవడం వంటివి వచ్చాయి. కొంత మంది నకిలీ %ఖీూ్ఝుఖీ్ర%లను కూడా వినియోగించారు. మరికొంత మందికి అధిక బిల్లులు రావడం, బ్యాలెన్స్ తక్కువగా ఉన్న వాటికి టోల్ బూత్ వద్ద వాహనాలు నిలిపివేయడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి.

## పన్ను చెల్లింపుదారులకు గుడ్‌న్యూస్.. ఒక్కొక్కరికీ రూ.4.3 లక్షలు వెనక్కి..!



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికాలో రెండోసారి అధికార బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారు. నిత్యం అనేక ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్‌పై సంతకాలు చేస్తూ.. సంచలన నిర్ణయాలకు తెరలేపుతున్నారు. ఈ క్రమంలోనే ఎలాన్ మస్క్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ- డోజ్.. తన నిర్ణయాలతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తోంది. ప్రభుత్వ ఖజానా నుంచి వృథాగా పోయే ఖర్చును అడ్డుకోవడంలో డోజ్ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అమెరికాలో ట్రంప్ 2.0 పగ్గాలు చేపట్టిన తర్వాత ఇప్పటివరకు 55 బిలియన్ డాలర్ల ఖర్చులను అదుపు చేసింది. అయితే అలాంటి డోజ్ ఇప్పుడు వినూత్నమైన పద్ధతికి శ్రీకారం చుట్టనుంది. అమెరికాలో వచ్చే పన్ను చెల్లించేవారికి 5 వేల డాలర్లు అంటే మన భారత కరెన్సీలో ఏకంగా రూ.4.3 లక్షలను నజరానాగా అందించాలని ప్రతిపాదించింది. పన్ను చెల్లించే అమెరికన్లకు వచ్చే ఏడాది ఈ చెక్కులు అందించేందుకు డోజ్ సన్నాహాలు చేస్తోంది. దీనిపై స్పందించిన డోజ్ చీఫ్ ఎలాన్ మస్క్.. ఈ ప్రతిపాదనను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వద్దకు తీసుకెళ్లి.. ఆయన ఆమోదం కల్పిస్తే అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడి చూద్దామని.. ఆయనే అన్నింటికీ కమాండర్ ఇన్ చీఫ్ అని.. అందుకే ఇదంతా ఆయనపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది జులై 4వ తేదీన అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనేనాటికి ఫెడరల్ బ్యూరోక్రసీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని డోజ్ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలో అనవసర ఖర్చులకు భారీగా కోతలు విధిస్తున్న డోజ్.. ఖర్చులను తగ్గించి మిగిలినదాంట్లో కొంత మొత్తాన్ని తీసి.. పన్ను చెల్లింపుదారులకు డోజ్ డెవిడెండ్ పేరిట 2026 జులై తర్వాత ఈ 5 వేల డాలర్ల చొప్పున చెక్కులను అందించాలని అజోరియా సంస్థ సీఈవో జేమ్స్ ఫిష్‌బ్యాక్ డోజ్‌కు సూచించారు. ఈ జేమ్స్ ఫిష్‌బ్యాక్.. డోజ్‌లో సభ్యుడిగా కాకుండా బయటి నుంచి డోజ్‌కు సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం ఏటా 6.5 ట్రిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.564 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే ఇందులో 2 ట్రిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.173 లక్షల కోట్లు కోత విధించే లక్ష్యంతో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పనిచేస్తోంది. దీని ప్రకారం అందులో 20 శాతం అంటే 7.9 కోట్ల పన్ను చెల్లింపుదారులకు పంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డోజ్ వెబ్‌సైట్ ప్రకారం సోమవారం నాటికి అమెరికాలో 55 బిలియన్ డాలర్లు అంటే రూ. 4.77 లక్షల కోట్లను మిగిల్చింది. మోసాలకు అడ్డుకోవడం.. కాంట్రాక్టులు, లీజ్‌లు రద్దు చేయడం.. ఆస్తుల అమ్మకాలు.. నిధుల రద్దు వంటి వాటితో భారీగా ఖర్చులను అదుపు చేసింది.అయితే డోజ్ విషయంలో ఎలాన్ మస్క్ టీమ్ పైన తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అమెరికా ప్రభుత్వంలోని అన్ని డిపార్ట్‌మెంట్లలోని సమాచారాన్ని ఇష్టం వచ్చినట్లు ఇప్పటికే పలువురు కోర్టులను కూడా ఆశ్రయించారు. వైట్‌హౌస్‌లోని సీనియర్ సలహాదారుల మాదిరిగా స్వతహాగా ప్రభుత్వ నిర్ణయాలు తీసుకునే అధికారం ఎలాన్ మస్క్‌కు లేదని వైట్‌హౌస్ వ్యవహారాల డైరెక్టర్ జోషువా ఫిషర్ తెలిపారు.

## ఈ సింగిల్ పేమెంట్ ఎల్ఐసీ ప్లాన్‌తో.. లైఫ్ లాంగ్ గ్యారెంటీ ఆదాయం..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో అందరూ నమ్మే బీమా సంస్థల్లో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నే టాప్ సంస్థ. ఈ ప్రభుత్వరంగ సంస్థలో పెట్టుబడులు పెడితే తమ సొమ్ము క్షేమంగా ఉంటుందని.. భవిష్యత్తులో అనుకున్న మొత్తం తిరిగొస్తుందని చాలామంది ప్రజల విశ్వాసం. కానీ, ఎల్ఐసీలో అనే రకాల స్కీంలు, ప్లాన్లు ఉంటాయి. ఏది మంచిది అనే సందేహం రావచ్చు. ఏది ఏమైనా ఎల్ఐసీ కొత్తగా ప్రవేశపెట్టిన ప్లాన్ అన్ని రకాల ఆదాయ వర్గాలకు మేలు చేసేదే. ఈ పథకం సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ సదుపాయాలు ఉంటాయి. ఈ ప్రీమియం యాన్యుటీ ఒక్కసారి కొనుగోలు చేస్తే జీవితాంతం స్థిరమైన ఆదాయం గ్యారెంటీగా లభిస్తుంది. మరిన్ని వివరాలు మీకోసం..పదవీ విరమణ సంపాదనకు ముగింపు కాదుఇది ఆర్థిక స్వేచ్ఛకు నాంది! అనే నినాదంతో ఆఫ్ ఇండియా స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రారంభించింది. దీని ద్వారా జీవితాంతం ఒత్తిడి లేకుండా స్థిరమైన ఆదాయం పొందవచ్చు. కనీస యాన్యుటీ మొత్తం రూ. 1,000గా నిర్ణయించారు. ఇందులో నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్, నాన్-లింక్డ్ ప్లాన్, తక్షణ యాన్యుటీ ప్లాన్ (ప్లాన్ 879), ఇండివిడ్యువల్/ గ్రూప్, సేవింగ్స్ ఉంటాయి. సంవత్సర యాన్యుటీ, 6 నెలలు, 3 నెలలు, నెలవారీ యాన్యుటీలకు చెల్లింపులు చేసుకునే సదుపాయం ఉంది. రూల్స్‌కు లోబడి పూర్తిగా లేదా ఎంతో కొంత మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవచ్చు. రుణాలు కూడా పొందవచ్చు.

**స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పూర్తి వివరాలు :**


18- 100 సంవత్సరాల వయసు వారు ఎవరైనా స్మార్ట్ పెన్షన్ ప్లాన్ కొనుగోలు చేయవచ్చు. అయితే, యాన్యుటీ ఎంపికలను బట్టి అర్హత వయసు మారవచ్చు. యాన్యుటీ ఎంపికలను ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి ఎందుకంటే ఒకసారి ఎంచుకున్న తర్వాత దానిని మార్చలేము.

స్మార్ట్ పెన్షన్ ప్లాన్ కింద కనీస కొనుగోలు రూ. 1 లక్ష. గరిష్ఠ కొనుగోలుకు పరిమితి లేదు. అయితే, గరిష్ఠ కొనుగోలు ధర బోర్డు ఆమోదించిన అండర్ రైటింగ్ పాలసీ ప్రకారం అంగీకారానికి లోబడి ఉంటుంది. జాతీయ పెన్షన్ వ్యవస్థ చందాదారులకు తక్షణ యాన్యుటీని ఎంచుకునే సదుపాయం ఉంది.యాన్యుటీ మోడ్‌ను బట్టి కనీస యాన్యుటీ మొత్తాన్ని రూ. 1,000గా నిర్ణయించింది. ఇందులో నెలకు రూ. 1,000 , 3 నెలలకు రూ. 3,000, 6 నెలలకు రూ. 6,000, సంవత్సరానికి రూ. 12,000 చొప్పున యాన్యుటీలు ఉంటాయి.

ఇందులో ఫ్రీ-లుక్ పీరియడ్ లేదా మూడు నెలలు దాటాక ఆదాయపు పన్ను మినహాయించి రుణాలు కూడా పొందవచ్చు.

## బీమా రంగంలో మరిన్ని సంస్కరణలు

**న్యూఢిల్లీ-నవభూమి:** బీమా రంగంలో మరిన్ని సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీల ఏజెంట్లు అవసరం ఉన్నా, లేకపోయినా మాయమాటలతో పాలసీదారులకు పాలసీలు అంటగట్టే పద్ధతికి చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పాలసీదారులు ఎలాంటి జరిమానా లేకుండా పాలసీ నుంచి తప్పుకునే స్వేచ్ఛను (ఫ్రీ లుక్ పీరియడ్) ఏడాదికి పెంచాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఇది నెల రోజులు మాత్రమే. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజు ఈ విషయం తెలిపారు. గృహ రుణాల కోసం వచ్చే వ్యక్తులు లేదా రుణాల కోసం వచ్చే చిన్నచిన్న వ్యాపార సంస్థలకు ప్రస్తుతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏదోలా ఏదో ఒక బీమా పాలసీని అంటగడుతున్నాయి. ఈ జాడ్యంపై ఎప్పటి నుంచే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.





# రైల్వే జాబ్స్ స్కాం.. పలువురు అధికారులపై సీబీఐ కేసు

**న్యూఢిల్లీ-నవభూమి:**రైల్వే ఉద్యోగాల భర్తీకి సంబంధించి తాజాగా మరో స్కాం వెలుగులోకి వచ్చింది. ఈ స్కాంలో రైల్వే ఉద్యోగాలతోపాటు ప్రధానంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడానికి లంచం తీసుకున్న కేసులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ కుంభకోణంలో ఇప్పటికే సీబీఐ అనేక మంది రైల్వే అధికారులపై కేసు నమోదు చేసింది.వీటిలో వడోదర, ముంబై సహా ఇతర ప్రాంతాల రైల్వే అధికారులపై కేసులు రికార్డయ్యాయి. ఈ కేసులో అంకుష్ వాసన్ , సంజయ్ కుమార్ తివారీ (డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్, చర్చ్‌గేట్, వెస్టర్న్ రైల్వే, ముంబై), నీరజ్ సిన్హా (డిప్యూటీ సూపరింటెండెంట్), ముఖేష్ మీనా వంటి పలువురు రైల్వే అధికారుల పేర్లు బయటకొచ్చాయి. వీరు ఉత్తీర్ణత సాధించేందుకు అనేక మంది నుంచి భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు తేలింది.ఈ క్రమంలోనే సీబీఐకి అందిన సమాచారం ప్రకారం 10 మంది అభ్యర్థులు లంచం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న క్రమంలో వారిని పట్టుకున్నారు. ఒక్కో అభ్యర్థి నుంచి వీరు రూ. 4 నుంచి 5 లక్షల మేరకు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ లావాదేవీలు నగదులో కాకుండా బంగారంలో జరగడం విశేషం. ఆ క్రమంలో వారికి సంబంధించిన లావాదేవీ రికార్డులు కూడా ఉంచుకోకుండా పలు రకాలుగా ప్రయత్నం చేస్తున్నారు. పశ్చిమ రైల్వే నిర్వహించనున్న కమిటీ డిపార్ట్‌మెంట్ పరీక్షలో ఎంపిక కోసం లంచం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న 10 మంది అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని అంకుష్ వాసన్.. సంజయ్ కుమార్ తివారీని ఆదేశించినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ గురువారం 20 । ఫిబ్రవరి । 2025

## భూమివైపు దూసుకొస్తున్న "సిటీ కిల్లర్".. ముంబై, కోల్‌కతా నగరాలపై ఆశ వదులుకోవాల్సిందేనా?



**న్యూఢిల్లీ-నవభూమి:**భూమివైపుగా ఓ గ్రహ శకలం దూసుకు వస్తుందని నాసా తెలిపింది. అయితే ఇది ఇండియాలోని కోల్‌కతా, ముంబై సహా ఢాకా, బొగోటా, అబిడ్జాన్, లాగోస్, ఖార్టూమ్ వంటి నగరాలపై పడే అవకాశం ఉందని చెప్పుకొచ్చింది. ఇదే కనుక జరిగితే అత్యంత జన సాంద్రత కల్గిన ఆ ప్రాంతం పూర్తిగా నాశనం అవుతుందని వివరించింది. ఒక నగరాన్ని పూర్తిగా నాశనం చేసే సామర్థ్యం ఉన్నందునే ఈ శకలానికి.. "సిటీ కిల్లర్" అనే పేరు పెట్టినట్లు స్పష్టం చేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.భూమి వైపు ఓ గ్రహ శకలం దూసుకు వస్తుందని నాసా తాజాగా ప్రకటించింది. ముఖ్యంగా 2024 %=%4 పేరుగా నామ కరణం చేసిన ఈ గ్రహశకలం.. చూసేందుకు చిన్నగా ఉన్నా దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చింది. ఇది 2032లో భూమిని ఢీకొట్టబోతుండగా.. ఆ ప్రాంతాలపై పడే అవకాశం ఉందని వివరించింది. ముఖ్యంగా ఐదు నగరాల్లో పడే ఛాన్స్ అత్యధికంగా ఉన్నట్లు తెలుపగా.. అందులో భారత దేశానికి చెందిన రెండు ప్రాంతాలున్నాయి. అవే కోల్‌కతా, ముంబై. ఈ గ్రహశకలం ఏ ప్రాంతంలో పడితే.. ఆ నగరం అంతా కాలి బూడిద అయిపోతుందని.. అందుకే దానికి "సిటీ కిల్లర్"గా పేరు పెట్టినట్లు వెల్లడించింది. ఈ వార్త తెలిసినప్పటి నుంచి భారత ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరి ఆ పూర్తి వివరాలు మీకోసం.2024 %=%4 అనే సాంకేతిక నామం కల్గిన ఆస్టరాయిడ్.. భూమి వైపు దూసుకు వస్తుందని తాజాగా నాసా ప్రకటించింది. అయితే భూమి వైపు వస్తున్నా కొద్ది.. భూమండలాన్ని ఢీకొట్టే అవకాశం మరింత పెరుగుతూ వస్తోందని వివరించింది. ఇప్పటి వరకు దాన్ని గమనించగా.. అది భూమిని తాకే అవకాశం 3.1 శాతంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. అంతేకాకుండా ఇది ఒకవేళ భూమిని ఢీ కొడితే.. ఆ పెద్ద నగరం పూర్తిగా నాశనం అవుతుందని చెప్పుకొచ్చింది.

ఈ సిటీ కిల్లర్ భూగ్రహాన్ని ఢీకొట్టే శాతం 2.6 శాతంగా ఉన్నట్లు గతంలో ప్రకటించగా.. 2024 జనవరి నెల నాటికి దీని శాతం కేవలం 1. కానీ ఏడాదిలోనే 3.1 శాతానికి పెరగడంతో శాస్త్రవేత్తలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలనే దాన్ని నిత్యం పరిశీలిస్తున్నారు. అయితే కేవలం 40 నుంచి 90 మీటర్ల పరిమాణంలో ఉన్న ఇది.. భూమిపైకి చేరితే వాయు విస్ఫోటనంగా మారే ఛాన్స్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీని వల్లే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగబోతుందని అంచనా వేస్తున్నారు.దీని వల్ల ప్రపంచం మొత్తం నాశనం అయ్యే అవకాశం లేకపోయినా.. ఓ నగరం మొత్తం కాలి బూడిద అవుతుందని నాసా సైంటిస్టులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సిటీ కిల్లర్ 2032లో డిసెంబర్ 22వ తేదీన భూమిని ఢీకొట్టబోతున్నట్లు అంచనా వేస్తున్నారు. అలాగే ఇది భూమిపై ఉన్న తూర్పు పసిఫిక్, ఉత్తర దక్షిణ అమెరికా, అట్లాంటిక్, ఆఫ్రికా, అరేబియా సముద్రం, దక్షణాసియ ప్రాంతాల్లో పడే అవకాశం ఎక్కువగా ఉందని వివరిస్తున్నారు.అలాగే ఈ దేశాల్లోని ముంబై, కోల్‌కతా, ఢాకా, బొగోటా, అబిడ్జాన్, లాగోస్, ఖార్టూమ్ వంటి నగరాల్లో పడితే.. పెద్ద ఎత్తున జనాలు ప్రాణాలు కోల్పోతారని.. ఆయా నగరం మొత్తం పూర్తిగా తుడిచి పెట్టుకుపోతుందని చెప్పుకొచ్చారు. చూడాలి మరి ముందు ఏం జరగనుంది అనేది.

## గోల్డెన్ ప్యాలెస్, వేల కోట్ల విలువైన నౌక.. ఖతార్ ఎమిర్ ఆస్తుల గురించి తెలిస్తే షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత్ పర్యటనకు వచ్చిన ఖతర్ ఎమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా విమానాశ్ర యానికి వెళ్లి ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో తమీమ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరింపజేసి.. వ్యూహాత్మక భాగస్వాములుగా ఎదగాలని నిర్ణయించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తూ సుమారు రూ.2.43 లక్షల కోట్ల (28 బిలియన్ డాలర్ల)కు తీసుకువెళ్లాలని నిర్దేశించుకున్నాయి.సంపన్న దేశాల్లో ఒకటైన ఖతర్ పాలకుడి ఆస్తులు గురించి తెలిస్తే షాకవుతారు. ఖతర్ ఆవిర్భావం నుంచి అల్-థానీ కుటుంబపాలనే కొనసాగుతోంది. ప్రస్తుతం వారి వంశంలో 11 మందికి అమీర్ (రూలర్) హోదా ఉంది. పెట్రోలు, గ్యాస్ నిక్షేపాలతో తులతూగుతోన్న ఖతర్‌లో 2013 నుంచి షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీ పాలనలో ఉంది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం.. పశ్చిమాసియాలో ధనిక దేశాన్ని పాలిస్తోన్న అల్‌థానీ వంశం ఆస్తుల విలువ 335 బిలియన్ డాలర్లు. ఒక్క షేక్ తమీమ్ వద్దే రెండు బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి. సహజవనరులతో పాటు విదేశాల్లో పెట్టుబడులు.. వీరిని ప్రపంచంలోనే ధనిక కుటుంబాల్లో ఒకటిగా నిలిపాయి.వారు నివాసం ఉండే దోహా రాయల్ ప్యాలెస్ విలువే ఒక బిలియన్ డాలర్లు కావడం విశేషం. బంగారు తాపడంతో కూడిన ఇంటీరియర్ డిజైన్ ఉన్న దానిని గోల్డెన్ ప్యాలెస్ అని కూడా పిలుస్తారు. మొత్తం 15 భవంతులు ఉండే ఈ ప్యాలెస్‌లో 500 కార్లను నిలిపేంత పార్కింగ్ స్థలం ఉంది. ఈ కుటుంబానికి ఒమన్‌లో వైట్ ప్యాలెస్, లండన్‌లో 17 బెడ్రూంలతో కూడిన విలాసవంతమైన భవనాలతో పాటు పారిస్, న్యూయార్క్‌లోనూ మ్యాన్షన్‌లు ఉన్నాయి. అలాగే, 400 మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన ఓ నౌక ఉండగా.. ఖతర్ అమీరి ఫ్లైట్ పేరిట విమానయాన సంస్థను ఈ కుటుంబం నడుపుతోంది. 1977లో ఏర్పాటుచేసిన ఈ విమానయాన సంస్థ నడిపే విమానాల్లో రాయల్ ఫ్యామిలీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు మాత్రమే ప్రయాణిస్తుంటారు. మూడు బోయింగ్ విమానాలతో సహా మొత్తం 14 జెట్‌లు ఆ సంస్థ సొంతం.ఇక లగ్జరీ కార్లయితే లెక్కలేదు. ఆ జాబితాలో బుగాటి, చిరాన్, లంబోర్గిని, రోల్స్ రాయిస్ తదితర కంపెనీలకు చెంది కార్లు ఉన్నాయి. తమీమ్ టుంబానికి చిత్రలేఖనం వంటి కళలంటే ఎంతో అభిమానం. అందుకే పెయింటిగ్స్ కోసమే కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటారు. ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారులు పాల్ సెజాన్, మార్క్ రొత్కో వేసిన కళాఖండాలను వందల మిలియన్ డాలర్లు పోసి సొంతం చేసుకున్నారు. క్రీడా రంగంలోనూ ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఖతార్ స్పోర్ట్స్ ఇన్వెస్ట్‌మెంట్ ను స్థాపించి, పలు దేశాల్లో పెట్టుబడులు పెట్టారు. పలు ఫ్రాంచైజీలు ముఖ్యంగా ఫుట్‌బాల్ టీమ్‌లను కొనుగోలు చేస్తుంటారు.కిందటిసారి 2022లో ఫిఫా వరల్డ్ కప్‌కు ఖతార్ ఆతిథ్యం ఇచ్చిన విషయం తెలిసిందే. ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ద్వారా పలు దేశాల సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు.

## విపరీతమైన యాడ్స్‌తో సినిమా ప్రదర్శన ఆలస్యం.. పీవీఆర్-ఐనాక్స్‌కు లక్షా 30 వేల జరిమానా!



**బెంగళూరు-నవభూమి:**బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి సినిమా చూసేందుకు పీవీఆర్-ఐనాక్స్‌కు వెళ్లారు. సమయానికి థియేటర్‌కు వచ్చి లోపలికి వెళ్లి కూర్చున్నారు. ఈక్రమంలోనే సినిమా వస్తుందనుకుంటే వరుసగా యాడ్స్ వచ్చాయి. రెండు, మూడు బ్రేకులు రావడం అందరికీ తెలిసిందే. అయినా.. 25 నిమిషాల నుంచి 30 నిమిషాల పాటు వరసగా యాడ్స్ వచ్చాయి. ఇలా అరగంట ఆలస్యంగా సినిమా ప్రారంభం కావడంతో 30 నిమిషాలు లేటుగా సినిమా అయిపోయింది. దీంతో తీవ్ర నిరాశ చెందిన ఆ వ్యక్తి తన సమయాన్ని వృథా చేసినందుకు ఆ థియేటర్‌పై కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలోనే విచారణ చేపట్టిన న్యాయస్థానం లక్షా 30 వేల రూపాయల జరిమానా విధించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.బెంగళూరుకు చెందిన 30 ఏళ్ల అభిషేక్ ఎంఆర్.. 2023 డిసెంబర్ నెలలో పీవీఆర్-ఐనాక్స్‌లో సినిమా చూశాడు. తన కుటుంబంతో కలిసి వెళ్లిన అతడు ముందుగానే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్నాడు. ముఖ్యంగా సాయంత్రం 4.05 గంటలకు చిత్ర ప్రదర్శన ప్రారంభమై 6.30 గంటలకు ముగిసిపోవాలి. ఎలాగూ సమయానికి అయిపోతుంది కదా అని అతడు 7 గంటలకు మరో వ్యక్తిని కలిసే ప్రోగ్రామ్ పెట్టుకున్నాడు. ఈక్రమంలోనే సమయానికి పీవీఆర్-ఐనాక్స్‌కు వచ్చి థియేటర్లో కూర్చున్నాడు. అయితే 4.05 గంటలకు సినిమా ప్రారంభం కావాల్సి ఉండగా.. యాడ్స్ వచ్చాయి. ఏ ఐదు, పది నిమిషాలు బ్రేకులు వస్తే అభిషేక్ కూడా పెద్దగా పట్టించుకోకపోయేవాడు. కానీ ఏకంగా 25 నుంచి 30 నిమిషాల పాటు వరుసగా బ్రేకులు వచ్చాయి. ఎప్పుడు యాడ్ అయిపోతుందా అంటూ ఆత్రుతగా స్క్రీన్ వైపు చూసిన ప్రతీ సారి మరో కొత్త బ్రేక్ రావడంతో.. తీవ్ర నిరాశకు గురయ్యాడు అభిషేక్. దాదాపు అరగంట తర్వాత సినిమా ప్రారంభం కాగా.. చిత్ర ప్రదర్శన పూర్తయ్యేసరికి 7 గంటలు అయింది. దీంతో తాను మరో వ్యక్తిని కలవానుకున్న ప్లాన్ బెడిసికొట్టింది.ఇలా అనవసరంగా తన 30 నిమిషాల సమయం వృథా చేసినందుకు గాను పీవీఆర్-ఐనాక్స్ థియేటర్‌పై చర్యలకు ఉపక్రమించాడు. నేరుగా వెళ్లి వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేశాడు. అయితే ఇదంతా జరిగిన ఏడాదిన్నర తర్వాత అంటే 2025 ఫిబ్రవరి 15వ తేదీన న్యాయస్థానం దీనిపై విచారణ చేపట్టింది. ఇతరుల సమయాన్ని వృథా చేస్తూ లబ్ధి పొందే హక్కు ఎవరికీ లేదని చెబుతూనే.. థియేటర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 25 నుంచి 30 నిమిషాలు ఓ వ్యక్తిని ఖాళీగా కూర్చోపెట్టడం సరికాదని.. ఈరోజుల్లో సమయం డబ్బుతో సమానం అని చెప్పింది. ఈక్రమంలోనే ఫిర్యాదుదారుడు అయిన అభిషేక్ ఎంఆర్‌కు నష్ట పరిహారం చెల్లించాలని కోరింది.ముఖ్యంగా అభిషేక్‌కు పీవీఆర్-ఐనాక్స్ రూ.20 వేలు చెల్లించాలని అలాగే ఫిర్యాదు ఖర్చుల నిమిత్తం మరో 10 వేలు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా అనుచిత వ్యాపార విధానాలను అవలంభిస్తున్నందుకు మరో లక్ష రూపాయలు అదనంగా చెల్లించాలని చెప్పింది. ఆదేశాలు జారీ చేసిన 30 రోజులలోపే ఈ డబ్బులు కట్టాల్సి ఉంటుందని లేని పక్షంలో మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాకుండా ఇకపై 10 నిమిషాలకు మించి యాడ్స్ ఇవ్వకూడని స్పష్టం చేసింది.

## కిడ్నీ టచింగ్ స్టోరీ మామా.. ప్రియురాలి భర్తకు ఆపరేషన్ చేయించేందుకు ఏటీఎం కొల్లగొట్టిన ప్రేమికుడు!




**న్యూఢిల్లీ-నవభూమి:**మనం ఇప్పటి వరకు ఎన్నెన్నో ప్రేమ కథలు చూశాం. ప్రపంచం మొత్తాన్ని కదిలించే దేవదాస్ పార్వతీ, లైలా మజ్నూ, ముంతాజ్ షాజహాన్, రోమియో జూలియెట్.. ఇలా అనేక మంది కథలు విన్నాం. కానీ మనం ఇప్పుడు చూడబోయే లవ్ స్టోరీ మాత్రం వీరిందరినీ ప్రేమ కథలకు మించింది. వీరిలా ప్రేయసి కోసం ప్రాణాలు తీసుకోవడమో, ఏవేవో భవంతులు కట్టించడమో, ప్రేమకు దూరమై తాగుడు బానిసవ్వడమో చేయలేదు.కానీ ఆమెను అనుక్షణం సంతోష పెట్టడానికి ఏటీఎంలలో దొంగతనాలను పాల్పడ్డాడు. ఆ డబ్బుతో ప్రియురాలికి కారు, స్కూటీ, డబ్బులు వంటివి గిఫ్టులుగా ఇచ్చాడు. ఇది మాత్రమే కాకుండా తన ప్రియురాలి భర్తకు ఏకంగా గుండె ఆపరేషన్ కూడా చేయించి అతడిని కాపాడాడు. మరి ప్రతీ ఒక్కటి కిడ్నీని టచ్ చేసేలే ఉన్న ఈ ప్రేమ కథ ఎక్కడ మొదలైంది.. ఎలా సాగిందో మనం ఇప్పుడు తెలుసుకుందాం.మైసూరుకు చెందిన రాజీవ్ ప్రహ్లాద్ కులకర్ణికి 52 ఏళ్ల వయసు. ఇతడికింకా పెళ్లి కాలేదు. ప్రస్తుతం అతడు తాను ప్రేమించిన ఓ అమ్మాయి ఇంట్లోనే నివాసం ఉంటున్నాడు. అయితే గతంలోనే ఆమెకు పెళ్లి కాగా.. ఆమె భర్త కూడా అదే ఇంట్లో ఉంటున్నాడు. ఇలా ముగ్గురూ కలిసే ఉంటుండగా.. రాజీవ్ ప్రహ్లాద్ కులకర్ణి తరచుగా దొంగతనాలు చేస్తుంటాడు. ఆ విషయం ప్రియురాలితో పాటు ఆమె భర్తకు కూడా తెలుసు. కానీ ఏమీ అనేవారు కాదు. అందుకు చాలానే కారణాలు ఉన్నాయి.ముఖ్యంగా కులకర్ణి నరగంలోని.. విశ్రాంబాగ్, సహకార్ నగర్, బిబ్వేవాడి, సింహగడ్ రోడ్డు, కోత్రుడ్, విశ్రాంత్ వాడి, అలండి, భోసారి, కంటోన్మెంట్, భారతి విద్యాపీఠ్, శివాజీ నగర్.. ఇలా అనేక ప్రాంతాల్లోని ఏటీఎంలలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ముఖ్యంగా చదువురాని, వృద్ధులే లక్ష్యంగా చేసుకున్న కులకర్ణి.. ఏటీఎంల వద్దే వేచి చూసేవాడు. వృద్ధులు వస్తున్నట్లు కనిపించిన వెంటనే వారి వెనకాలే వెళ్లి డబ్బులు తీసుకునే నెపంతో క్యూలో నిలబడేవాడు. ఈక్రమంలోనే ఆ వృద్ధులు కులకర్ణిని సాయం చేయమని అడిగేవారు.అది ఆసరాగా చేసుకున్న అతడు వారి వద్ద నుంచి పిన్ నెంబర్ తెలుసుకునేవాడు. దాన్ని సైలెంటుగా తన ఫోన్‌లో రాసుకుని.. వారి దృష్టి మరల్చేవాడు. ఆపై తన వద్ద ఉన్న బ్లాక్ అయిన కార్డును వారికి ఇచ్చి డబ్బులు రావడం లేదని చెప్పి పంపించేవాడు. ఒకే రంగులో ఉన్న కార్డు ఇవ్వడంతో అది తమదే అని భావించిన వృద్ధులు అక్కడి నుంచి వెళ్లిపోయేవారు. ఆ తర్వాత వారి కార్డును ఉపయోగించి.. ఖాతాలో ఎన్ని డబ్బులు ఉన్నాయో చూసి మరీ వాటిని తీసుకునేవాడు.ఇలా వచ్చిన డబ్బుతో తాను విలాసవంతమైన జీవితాన్ని గడపడమే కాకుండా.. తన ప్రియురాలికి కాస్ట్లీ బహుమతులు ఇచ్చేవాడు. ఇప్పటికే ఓ కారు, స్కూటీ ఇచ్చిన అతడు.. అనేక సార్లు డబ్బు సాయం కూడా చేశాడు. ఆమెకు నడుము నొప్పి ఉందని తెలుసుకుని ఓ పెద్ద ఆసుపత్రిలో కూడా చూపించాడు. అలాగే ఆమె భర్తకు గుండె సమస్య ఉన్నట్లు తెలుసుకుని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు శస్త్ర చికిత్స చేయాలన్నారు. ఇందుకు కూడా అతడే డబ్బులు చెల్లించి మరీ ఆమె భర్తకు వైద్యం చేయించాడు.ఇదంతా బాగానే ఉన్నా ఫిబ్రవరి 2వ తేదీ రోజు సాయంత్రం కులకర్ణి..లాల్ బహదూర్ శాస్త్రి రోడ్డులోని ఓ ఏటీఎంలో వృద్ధుడిని మోసం చేశాడు. అది గుర్తించిన అతడు పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కులకర్ణిని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. అలా ఫిబ్రవరి 5వ తేదీన అతడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. ఆపై విచారణ చేయగా.. కులకర్ణి జరిగిందంతా చెప్పాడు.2022 సంవత్సరం నుంచి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు నిందుతుడి ఒప్పుకోగా పోలీసులు షాక్ అయ్యారు. ముఖ్యంగా ప్రియురాలికి అతడిచ్చిన బహుమతులు(కారు, ద్విచక్రవాహనంతో పాటు 166 ఏటీఎం కార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. కార్డులు ఎక్కువగా ఉండడం చూస్తుంటే వందకు పైగానే మోసాలు చేసినట్లు అర్థం అవుతుందని.. కానీ బాధితులు ఇంకా ఎవరూ బయటకు రాలేదని వివరించారు. ఇప్పటి వరకు కేవలం 16 కేసులను మాత్రమే గుర్తించగా.. వాటి వల్ల రూ.17.9 లక్షలు మోసపోయినట్లు తెలుసుకున్నామన్నారు.

## కర్నాటక సీఎంకు ఊరట



**బెంగళూరు-నవభూమి:**మైసూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ భూముల కేటాయింపు కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆయన భార్య బీఎం పార్వతి, మరో ఇద్దరికి ఊరట లభించింది. వీరికి లోకాయుక్త పోలీసులు క్లీన్ చిట్ ఇచ్చారు. ముడా కుంభకోణంలో వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన తుది నివేదికను దర్యాప్తు అధికారులు హైకోర్టుకు సమర్పించారు. ఈ కేసులో సిద్ధరామయ్య, బీఎం పార్వతితో పాటు సిద్ధరామయ్య బావమరిది మల్లికార్జున స్వామి, ల్యాండ్ ఓనర్ దేవరాజు నిందితులుగా ఉన్నారు.'ఈ కేసులో మొదటి నిందితుడి నుంచి నాలుగవ నిందితుడి వరకూ వచ్చిన అభియోగాలపై తగిన ఆధారాలు లేవు. తుది రిపోర్టు హైకోర్టుకు సమర్పిస్తున్నాం" అని లోకాయుక్త పోలీసులు.. 'ముడా' కేసు ఫిర్యాదుదారు, యాక్టివిస్ట్ స్నేహమయి కృష్ణకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.బీఎం పార్వతి నుంచి డవలప్‌మెంట్ కోసం ముడా స్వాధీనం చేసుకున్న భూములకు కొన్ని రెట్లు విలువైన భూములను ఆమె పొందారన్నది ఈ కేసులో ఉన్న ప్రధాన అభియోగం. ఖరీదైన భూములకు తన భార్యకు దక్కేలా సిద్ధరామయ్య చేశారంటూ సమాచార హక్కు చట్టం కింద టీజే అబ్రహం, ఎస్పీ ప్రదీప్, స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశారు. వారి అభ్యర్థన మేరకు కేసు విచారణకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్ అనుమతి మంజూరు చేశారు. దీంతో ముడా కేసు సంచలనమైంది. దీంతో కేసు దర్యాప్తును లోకాయుక్త పోలీసులకు అప్పగించారు.

## నేను అమిత్ షా కొడుకు జై షా.. బీజేపీ ఎమ్మెల్యేలంతా 5 లక్షలివ్వాలి



"నేను కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఛైర్మన్ జై షా. మీరు నాకు 5 లక్షల రూపాయలు వెంటనే పంపిస్తే మీకు మంత్రి పదవిని ఇప్పిస్తాను. పదవి వద్దనుకున్నా ఫర్వాలేదు కానీ పార్టీ కోసం డబ్బులు మాత్రం కచ్చితంగా పంపించండి." అంటూ ఓ వ్యక్తి బీజేపీ ఎమ్మెల్యేలకు ఫోన్‌లు చేస్తున్నాడు. ఈ రకంగా బెదిరిస్తూ.. ఒక్కొక్కరి వద్ద నుంచి 5 లక్షల రూపాయలు కొట్టేసే ప్రయత్నం చేయగా.. తాజాగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా ఎంతకూ భయపడిని ఓ ఎమ్మెల్యే ఈ దారుణాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. మరి ఇదంతా చేసింది ఎవరో మనం ఇప్పుడు తెలుసుకుందాం.ఉత్తరాఖండ్‌కు చెందిన 19 ఏళ్ల ప్రియాంశు పంత్.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు, ఐసీసీ ఛైర్మన్ జై షా పేరుతో స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఆదేశ్ చౌహాన్‌కు ఫోన్ చేశాడు. పార్టీ కోసం 5 లక్షల రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. అతడి మాటల్లో తేడా ఉండడం గుర్తించిన ఎమ్మెల్యే ఆదేశ్ చౌహాన్‌కు అనుమానం వచ్చింది. దీంతో నీవు ఎవరంటూ ప్రశ్నించారు. కానీ పంత్ మాత్రం తాను జై షానే అంటూ మరింత గట్టిగా చెప్పాడు. అయినా నమ్మని ఎమ్మెల్యే.. ఈ కాల్ రికార్డ్ చేస్తున్నాను, పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ చెప్పాడు. దీంతో భయపడిపోయిన అతడు ఫోన్ కట్ చేశాడు.

కావాలనే ఓ వ్యక్తి ఇలా తనను మోసం చేయాలని ప్రయత్నించడంతో.. ఎమ్మెల్యే ఆదేశ్ చౌహాన్ వెంటనే పోలీసులను ఆశ్రయించారు. తనకు వచ్చిన కాల్ ఆడియో రికార్డింగ్ వినిపించి మరీ ఫిర్యాదు చేశారు. పార్టీ కోసం 5 లక్షల ఇవ్వమని కూడా నిందితుడు అడిగాడని చెప్పారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే నిందితుడు ప్రియాంశు పంత్‌ను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఈ విషయం కాస్తా వెలుగులోకి రావడంతో.. మోసపోయిన మరికొంత మంది బీజేపీ ఎమ్మెల్యేలు సైతం బయటకు వచ్చారు.నిందితుడు ప్రియాంశు పంత్.. నైనీతాల్ ఎమ్మెల్యే సరిత ఆర్య, రుద్రాపూర్ ఎమ్మెల్యే శివ్ ఆరోడాలకు కూడా ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా వీరికి మంత్రి పదవి ఇప్పిస్తానంటూ పేర్కొనడం గమనార్హం. అయితే నిందితుడికి మరో ఇద్దరు వ్యక్తులు కూడా సహకరించారని వారిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు తెలిపారు. విలాసవంతమైన జీవితం గడిపేందుకే నిందితులు ఈ దారుణానికి పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నారని చెప్పారు.

## కార్పొరేటర్ టు సీఎం.. ఆమె వైపు అధిష్టానం మొగ్గుకు కారణం అదేనా



**న్యూఢిల్లీ-నవభూమి:** ముఖ్యమంత్రుల ఎంపికలో బీజేపీ ఆలోచన ఎలా ఉంటుందనేది ఎవరికి అంతుపట్టని విషయం.. లోకమంతా ఒకటి అనుకుంటే.. బీజేపీ అధిష్టానం మాత్రం మరొకటి తలుస్తుంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ సీఎంల ఎంపిక విషయంలో బీజేపీ ఇలానే చేసింది. తాజాగా ఢిల్లీ సీఎం ఎంపిక విషయంలోనూ బీజేపీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకోబోతుందనే చర్చ జరుగుతోంది. మరికొన్నిగంటల్లో బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై సీఎం అభ్యర్థిని ఎన్నుకుంటారు. అధిష్టానం ముందుగానే నిర్ణయించిన పేరును సమావేశంలో ప్రతిపాదిస్తారు. దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ.. ఏకగ్రీవంగా సీఎంను ఎంచుకోవడం లాంఛనమే. బీజేపీ ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తాను ప్రకటించనుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీజేపీలో సీనియర్ నాయకురాలుగా ఉన్నప్పటికీ గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం లేదు. వార్డు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేశారు. కార్పొరేటర్‌గా పనిచేసిన వ్యక్తిని బీజేపీ సీఎం ఎందుకు చేయాలనుకుంటోంది. కార్పొరేటర్ టు సీఎం కాబోతున్న ఆమె అసలు హిస్టరీ ఏమిటో ఓసారి తెలుసుకుందాం.


రేఖా గుప్తాకు గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన అనుభవం లేదు. కానీ రాజకీయంగా ఆమెకు సుదీర్ఘ అనుభవం ఉంది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. పితంపుర, షాలీమార్ బాగ్ ప్రాంత ప్రజలకు సుపరిచితురాలు. స్థానికంగా పార్కుల అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషిచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు. రేఖాగుప్తా కుటుంబానికి సంఘ్ నేపథ్యం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆమె ఆ తర్వాత బీజేపీలో చేరారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బి నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలు. ఢిల్లీ ప్రాంతంలో పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించే నేతల్లో ఆమె ఒకరు. షాలీమార్ బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి సమీప ప్రత్యర్థి ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో ఓటమి చెందారు. 2025లో అదే నియోజకవర్గం నుంచి బందనాకుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. రేఖాగుప్తా బీజేపీలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడమే ఆమెను సీఎంగా బీజేపీ ఎంపిక చేయడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

## సీఈసీగా జ్ఞానేష్ కుమార్ బాధ్యతలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి జ్ఞానేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎన్నికల కమిషనర్ సుఖ్బీర్ సింగ్ సంధు అభినందలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సీఈసీ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ.. దేశ నిర్మాణానికి తొలి అడుగు ఓటు అని,. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఎలక్టోర్‌గా మారాలని సూచించారు. ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. భారత రాజ్యాంగంలోని ఎన్నికల చట్టాలు, నియమాలు అందులో జారీ చేసిన సూచనల ప్రకారం, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ ఓటర్లతోనే ఉంటుందని జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్ 2029 జనవరి 26 వరకు సీఈసీ పదవిలో కొనసాగనున్నారు. భారత ఎన్నికల చట్టం ప్రకారం.. సీఈసీగా నియమితులైన వ్యక్తి 65 ఏళ్ల వయసు వరకు లేదా ఆరేళ్లు పాటు ఆ పదవిలో ఉండొచ్చు. రాజీవ్ కుమార్ పదవీ కాలం ఫిబ్రవరి 18తో ముగిసిన విషయం తెలిసిందే.

ఎన్నికల కమిషనర్‌గా ఆయన స్థానంలో హర్యానా కేడర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ వివేక్ జోషి నియమితులయ్యారు. ఇక, 1988 బ్యాచ్ కేరళ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశు క్మార్. సివిల్ ఇంజనీరింగ్‌లో ఐఐటీ కాన్పూర్ నుంచి బీటెక్ పూర్తిచేశారు. ఇక్ఫైలో బిజినెస్ ఫైనాన్స్‌లో పీజీ డిప్లొమా, హార్వర్డ్ నుంచి ఎన్విరాన్‌మెంటల్ ఎకనమిక్స్‌లో డిప్లొమా తీసుకున్నారు.కేంద్ర హోంశాఖలో సీనియర్ అధికారిగా పనిచేసిన కుమార్.. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370 రద్దు, అయోధ్య రామ మందిర ట్రస్టు ఏర్పాటు సహా మోదీ నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు. అలాగే, రామ మందిరం- బాబ్రీమసీదు వివాదంపై సుప్రీంకోర్టు విచారణలను కూడా కుమార్ క్రమం తప్పకుండా పర్యవేక్షించారు.¬ హోంశాఖ సంయుక్తి కార్యదర్శిగా ఆర్టికల్ 370 రద్దు ముసాయిదా బిల్లు రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. తర్వాత ఆ శాఖ అడిషినల్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. అమిత్ షాకు అత్యంత సన్నిహితుడిగా జ్ఞానేష్ కుమార్ గుర్తింపు ఉంది. జనవరి 2024లో సివిల్ సర్వీసెస్ నుంచి రిటైర్ అయిన ఆయన.. తర్వాత ఆధ్వర్యంలోని సహకార శాఖ సెక్రటరీగా.. మార్చి 2024లో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు పార్లమెంటరీ వ్యవహారాల శాఖలో కార్యదర్శిగా... కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీయే హయాంలో రక్షణ శాఖలో విధులు నిర్వహించారు.



## సతీమణితో కలిసి స్టార్ హీరో బిగ్ గ్యాంబ్లింగ్

బాలీవుడ్ ఎనర్జిటిక్ హీరో రణ్ వీర్ సింగ్ చాలా కాలంగా ఫ్లాపుల్లో ఉన్నాడు. అతడు నటించిన భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా మారాయి. చివరి చిత్రం అజయ్ దేవగన్‌తో కలిసి నటించిన సింఘం ఎగైన్ సైతం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో రణవీర్ నిజంగానే నిరాశపడ్డాడు. ప్రస్తుతం డాన్ 3, దురంధర్ చిత్రాల్లో నటిస్తున్నాడు రణవీర్. ఈ సినిమాలకు సంబంధించిన కొత్త అప్ డేట్లు రావాల్సి ఉంది. ఇంతకుముందు దురంధర్ లీక్డ్ వీడియోలు వైరల్ అయ్యాయి. వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమాని పూర్తి చేస్తూనే రణవీర్ సింగ్ ఒక కొత్త పని మొదలు పెట్టాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. సీరియస్ అతడు త్వరలో సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టనున్నాడు. ప్రస్తుతం ముంబైలో విలాసవంతమైన ఆఫీస్‌ని ఏర్పాటు చేస్తున్నాడు. ఇందులో తన కొత్త నిర్మాణ సంస్థను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాడని పీపింగ్ మూన్ తన కథనంలో పేర్కొంది. నిర్మాతగా అతడు ఉన్నతమైన స్క్రిప్టుల కోసం వెతుకుతున్నాడు. ఇప్పటికే స్క్రిప్ట్‌లను వినడం ప్రారంభించాడని, ఆరంభ దశలో తన నిర్మాణ సంస్థలో చారిత్రక, పౌరాణిక డ్రామా కథల్ని ఓకే చేస్తున్నాడని తెలుస్తోంది. ఇది ఎవరైనా చరిత్రకారుడి బయోపిక్ అవుతుందా లేదా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఇకపోతే రణవీర్ సింగ్ గతంలో మా కసమ్ ఫిల్మ్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించాడు. అయితే ఈ బ్యానర్ గురించి ఎప్పుడూ అధికారికంగా ప్రకటించలేదు. అతడి సహచరి దీపిక కేఏ ప్రొడక్షన్స్‌ని ప్రారంభించి సినిమాలు నిర్మించింది. కానీ ఇది కూడా కలిసి రాలేదు. ప్రస్తుతం కొత్త నిర్మాణ సంస్థను స్థాపించడం ద్వారా నిర్మాతలుగా రీవ్యాంప్ అవ్వాలని చూస్తున్నారు.

నవచిత్ర



# బాలీవుడ్‌లో శ్రీలీలకి అంత తక్కువా..?




టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా సినిమాలు చేస్తున్న శ్రీలీల ఇటీవలే కోలీవుడ్ సినిమాల్లోనూ అవకాశాలు దక్కించుకుంది. ఈమధ్య కాలంలో శ్రీలీల జోరు మామూలుగా లేదు. ఈ అమ్మడు చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం సక్సెస్ రేటు ఉండటంతో లక్కీ బ్యూటీ అనే పేరును సొంతం చేసుకుంది. అల్లు అర్జున్‌తో కలిసి పుష్ప 2లో వేసిన కిస్సిక్ డాన్స్‌తో ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి డాన్సర్‌గా ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కడంతో మరిన్ని సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి. అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు చేస్తున్న సినిమాల సంఖ్య చాలా ఉన్నాయి. తాజాగా బాలీవుడ్‌లోనూ ఈ అమ్మడు అడుగు పెట్టేందుకు రెడీ అయింది. వీకీలో శంభాజీ మహారాజ్ కథ తప్పులపై సీరియస్ బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ హీరోగా రూపొందబోతున్న ఒక సినిమాలో శ్రీలీలను ఎంపిక చేశారనే వార్తలు వస్తున్నాయి. మొదట ఆ పాత్రకు యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రిని ఎంపిక చేశారు. కానీ ఆ పాత్రలో త్రిప్తి కంటే శ్రీలీల అయితే బాగుంటుంది అనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయానికి వచ్చారు అంటూ హిందీ సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తున్న ఎంతో మంది హీరోయిన్స్ బాలీవుడ్‌లో ఒక్క అవకాశం అంటూ ఎదురు చూస్తూ ఉంటారు. అలాంటిది శ్రీలీల వెయిట్ చేయకుండానే బాలీవుడ్‌లో నటించే అవకాశం దక్కింది. ముందు ముందు బాలీవుడ్‌లో ఈ అమ్మడు ఫుల్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈసారి మరింత ఇంట్రెస్టింగ్ గా.. శ్రీలీల బాలీవుడ్‌లో మొదటి సారి నటించబోతున్న నేపథ్యంలో ఆమె పారితోషికం గురించి ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. పుష్ప 2 సినిమాలో కిస్సిక్ సాంగ్‌ను చేసేందుకు గాను శ్రీలీల ఏకంగా రూ.2 కోట్ల పారితోషికం తీసుకుంది. అలాంటిది బాలీవుడ్‌లో సినిమాకు రూ.4 కోట్ల పారితోషికం అందుకుంటూ ఉంటుందని అంతా భావిస్తున్నారు. కానీ విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం శ్రీలీల తన మొదటి హిందీ సినిమాకు గాను కేవలం రూ.1.75 కోట్లను మాత్రమే పారితోషికంగా అందుకుంటుందట. మొదటి హిందీ సినిమా కావడంతో ఈ అమ్మడికి పారితోషికం తక్కువ ఇస్తున్నారని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో రెండు కోట్లకు తగ్గకుండా పారితోషికం తీసుకుంటూ సినిమాలు చేస్తున్న శ్రీలీల బాలీవుడ్‌లో మాత్రం ఎందుకు తక్కువకు సినిమాలు చేసేందుకు ఒప్పుకుంటుంది అంటూ కొందరు ఆమె ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్తీక్ ఆర్యన్‌తో చేస్తున్న సినిమా హిట్ కొడితే వెంటనే శ్రీలీల తన పారితోషికాన్ని డబుల్ చేసే అవకాశాలు ఉన్నాయని, ఆ ఉద్దేశంతోనే శ్రీలీల ఈ నిర్ణయం తీసుకుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సినిమాలతో టాప్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో నిలిచిన శ్రీలీల త్వరలో కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ సక్సెస్‌లతో తన సత్తా చాటేనా చూడాలి.

# రామ్ ఈసారి గురి తప్పకుండా..?



ఎనర్జిటిక్ స్టార్ రామ్ సినిమాలు ఈమధ్య బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అవుతున్నాయి. ఇస్మార్ట్ శంకర్‌తో తిరిగి ఫాంలోకి వచ్చినట్టే అనుకున్న రామ్ మళ్లీ అదే ఫెయిల్యూర్ పంథా కొనసాగిస్తున్నాడు. ఐతే సక్సెస్ ఫుల్ సినిమా కోసం రామ్ తన ప్రయత్నాలను మాత్రం ఆపట్లేదు. ప్రస్తుతం రామ్ తన 22వ సినిమాను మహేష్ డైరెక్షన్‌లో చేస్తున్నాడు. ఈ సినిమాలో భాగ్య శ్రీ బోర్స్ హీరోయిన్‌గా నటిస్తుంది. మిస్టర్ బచ్చన్‌తో యూత్ ఆడియన్స్‌లో పాపులర్ అయిన భాగ్య శ్రీ రామ్‌తో జత కడుతుంది. వీకీలో శంభాజీ మహారాజ్ కథ తప్పులపై సీరియస్ ఈ సినిమా రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రాబోతుందని తెలుస్తుంది. ఈ సినిమాతో ఎలాగైనా సూపర్ హిట్ కొట్టాలని రామ్ పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో ఉన్నాడు. అందుకే గురి తప్పకుండా ఉండేలా సినిమా మీద స్పెషల్ ఫోకస్ చేస్తున్నాడట. ఈ సినిమాలో రామ్, భాగ్య శ్రీ కెమిస్ట్రీ సినిమాకు హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. క్లాస్ మాస్ అనే తేడీ లేకుండా రామ్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. ఐతే ఈ సినిమా మాత్రం సంథింగ్ స్పెషల్ అనిపించేలా ఉంటుందని అంటున్నారు. వరుస ఫ్లాపులతో కెరీర్ రిస్క్ లో పడుతున్న విషయాన్ని గుర్తించిన రామ్ కథల విషయంలో చాలా జాగ్రత్త పడాలని ఫిక్స్ అయ్యాడు. ఐతే రామ్ మహేష్ కాంబోలో రాబోతున్న ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ ఇంకా స్క్రీన్ ప్లే మ్యాజిక్ చేస్తాయని అంటున్నారు. యూత్ ఆడియన్స్‌లో రామ్‌కి మంచి ఫాలోయింగ్ ఉంది. ఐతే సినిమా సినిమాకు తన రేంజ్ పెంచుకోవాలన్న రామ్ ప్రయత్నాలన్నీ ఆశించిన విధంగా వర్క్ అవుట్ అవ్వట్లేదు. ముఖ్యంగా ఇస్మార్ట్ శంకర్ తర్వాత తీసిన రెడ్, ది వారియర్, స్కంద, డబుల్ ఇస్మార్ట్ ఇవేవి రామ్ కి సరైన సక్సెస్ ఇవ్వలేకపోయాయి. అందుకే ఈసారి తన మార్క్ రొమాంటిక్ ఎంటర్టైనర్‌తో వచ్చి హిట్ కొట్టాలని చూస్తున్నాడు రామ్. సెట్స్ మీద ఉన్నప్పుడే ఈ సినిమాకు పాజిటివ్ బజ్ ఏర్పడిందని తెలుస్తుంది. మరి రామ్ కోరుకుంటున్న సూపర్ హిట్ సినిమా ఇది అవుతుందా లేదా అన్నది చూడాలి. రామ్ 22గా రాబోతున్న ఈ సినిమా గురి తప్పకూడదని ప్రయత్నిస్తున్నాడు. ఐతే మేకర్స్ మాత్రం ఈ సినిమా మీద సూపర్ కాన్ఫిడెంట్ గా ఉన్నారని తెలుస్తుంది.

## సోలో పాన్ ఇండియా కోసం చరణ్ రాజీ లేని పోరాటం!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్- స్టార్ మేకర్ సుకుమార్ అనూహ్యంగా దుబాయ్ లో కనిపించడంతో నెట్టింట రచ్చ మొదలైన సంగతి తెలిసిందే. ఇద్దరు తమ ప్రాజెక్ట్ డిస్కషన్ లో భాగంగానే దుబాయ్‌లో సిట్టింగ్ వేసినట్లు మీడియా కథనాలు అంతకంతకు వెడెక్కించాయి. ఆర్సీ 16 పూర్తి కాకుండానే ఆర్సీ 17 కూడా పట్టాలెక్కించే ప్లాన్‌లో భాగంగానే ఇద్దరు దుబాయ్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారని ప్రచారం జరిగింది. అయితే అదంతా అవాస్తవమని తెలుస్తోంది. ఇద్దరు దుబాయ్‌కి వెళ్లింది స్టోరీ డిస్కషన్ కోసం కాదట. ఓ సెలబ్రిటీ ఫ్యామిలీ ఈవెంట్‌కు హాజరయ్యేందుకు వెళ్లినట్లు తెలిసింది. రామ్ చరణ్-సుకుమార్ ఇద్దరు వేర్వేరు రోజుల్లో అక్కడికి చేరుకున్నారే తప్ప అంతకు మించి ఎలాంటి సినిమా డిస్కషన్ ఇద్దరి మధ్య జరగలేదు అన్నది తాజా సమాచారం. రామ్ చరణ్ ఆర్సీ 16కి బ్రేక్ ఇచ్చి మరీ దుబాయ్ వెళ్లడంతో ఏదో ముఖ్యమైన పనే అనుకున్నారంతా. కానీ ఇలా ఓ వేడుక కోసం వెళ్లారన్నది ఇప్పుడే తెలుస్తోంది. సీరియస్ ప్రస్తుతం రామ్ చరణ్ ఫోకస్ అంతా ఆర్సీ 16పైనే ఉంది. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ఇప్పటికే కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం చరణ్ లేని సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. దుబాయ్ ట్రిప్ ముగించుకుని వచ్చిన అనంతరం చరణ్ షూట్‌లో జాయిన్ అవుతాడని తెలుస్తోంది. చరణ్ ఈ సినిమా పూర్తిచేసే వరకూ మరో ప్రాజెక్ట్ పై దృష్టి సారించే అవకాశం లేదు. ఇది పాన్ ఇండియా సినిమా కాబట్టి అంతే శ్రద్ధగా చేయాలి. గత సినిమాగేమ్ ఛేంజర్‌తో సంచలనం అవుదామనుకుంటే? అది డిజాస్టర్ అయింది. దీంతో చరణ్‌కి సోలో పాన్ ఇండియా సక్సెస్ ఇంకా దూరంగానే ఉన్నాడు. ఆర్సీ 16తో అది ప్రూవ్ అవుతుందని ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు.

## మొత్తానికి ఎన్టీఆర్- నీల్‌కు టైమొచ్చేసింది



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ రానున్నట్టు అనౌన్స్‌మెంట్ వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. అయినా ఇప్పటివరకు సినిమా పట్టాలెక్కింది లేదు. వాస్తవానికి ఈ సినిమా కెజిఎఫ్2 తర్వాతే రావాల్సింది. కానీ మధ్యలో ఎన్టీఆర్ డేట్స్ అందుబాటులో లేకపోవడంతో సలార్ వచ్చింది. మొత్తానికి నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఎన్టీఆర్- నీల్ సినిమా పట్టాలెక్కబోతుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ రేపటి నుంచి ప్రారం భం కానుందని తెలుస్తోంది. మాస్ యాక్షన్ చిత్రంగా రూపొందనున్న ఈ సినిమా పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కనుంది. అయితే ఈ మొదటి షెడ్యూల్‌లో హీరో ఎన్టీఆర్ పాల్గొనడం లేదు. ఎన్టీఆర్ మార్చి నుంచే షూటింగ్‌లో జాయిన్ కానున్నాడని, ఈ లోపు మొదటి షెడ్యూల్ పూర్తైపోతుందని సమాచారం. పది రోజుల పాటూ జరగనున్న ఈ షెడ్యూల్ లో ఎన్టీఆర్ లేని సీన్స్‌ను తెరకెక్కించనున్నాడట నీల్. ఎన్టీఆర్ డేట్స్ ను బట్టి రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టి అందులో తారక్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నాడు నీల్. ఈ సెకండ్ షెడ్యూల్‌ను నీల్ లెంగ్తీ గానే ప్లాన్ చేశాడని తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేక్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన సప్త సాగరాలు దాటి ఫేమ్ రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేశారని ఎప్పటినుంచో వార్తలొస్తున్నాయి. కానీ దానికి సంబంధించి మేకర్స్ నుంచి మాత్రం ఎలాంటి అప్డేట్ రాలేదు. ఎన్టీఆర్- నీల్ సినిమా భారీ రేంజ్‌లో రానుందని, ఇప్పటికే సినిమాపై అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ ప్రస్తుతం వార్2 షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. అది కాకుండా దేవర సీక్వెల్ దేవర2ను కూడా ఎన్టీఆర్ పూర్తి చేయాల్సి ఉంది.

## టీమిండియాను తలెత్తుకునేలా చేసిన గిల్.. ఎంత మెచ్చుకున్నా తక్కువే



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత వైస్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మరో అరుదైన ఘనత సాధించాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాను తలెత్తుకునేలా చేశాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో అతడు నంబర్ వన్ పొజిషన్‌లో నిలిచాడు. వన్డే బ్యాటర్ల లిస్ట్‌లో 769 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు గిల్. ఇప్పటివరకు టాప్‌లో ఉన్న పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ ఆజం (773 పాయింట్లు)ను వెనక్కి నెట్టి ఫస్ట్ ప్లేస్‌ను కైవసం చేసుకున్నాడు టీమిండియా స్టార్. మెన్ ఇన్ బ్లూ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో రఫ్ఫాడించాడు. హిట్‌మ్యాన్ 761 రేటింగ్ పాయింట్లతో వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానంలో నిలిచాడు. టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 727 పాయింట్లతో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. అటు టీమ్ ర్యాంకింగ్స్‌లోనూ టీమిండియా హవా నడుస్తోంది. వన్డే క్రికెట్‌లో 119 రేటింగ్ పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. చాంపియన్స్ ట్రోఫీ షురూ అయిన నేపథ్యంలో అటు జట్టుతో పాటు బ్యాటర్లు కూడా ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపడం మెన్ ఇన్ బ్లూకు సానుకూల అంశంగా చెప్పొచ్చు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో గిల్ బ్యాక్ టు బ్యాక్ ఫెంటాస్టిక్ నాక్స్ ఆడటం, కెప్టెన్ రోహిత్ శతకం కొట్టడం ర్యాంకింగ్స్‌లో టాప్‌లో నిలవడానికి గల కారణాలుగా చెప్పొచ్చు. ఈ కాన్ఫిడెన్స్‌తో మెగా టోర్నీలోనూ వాళ్లు దుమ్మురేపాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇదే జోరులో మరో ఐసీసీ ట్రోఫీ సొంతం చేసుకోవాలని కామెంట్స్ చేస్తున్నారు.

## ఈ జనరేషన్‌లో అతడే బెస్ట్ ప్లేయర్.. కుండబద్దలు కొట్టిన యువరాజ్



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్‌లో బెస్ట్ ప్లేయర్ ఎవరు? అనేది ఎప్పటికీ ముగిసిపోని చర్చ. ఆ ఆటగాడు గొప్ప? అంటే ఆ ఆటగాడు గొప్ప? అంటూ ఫ్యాన్స్ నిత్యం గొడవపడుతుంటారు. అయితే ప్రతి తరంలో ఒకరిద్దరు క్రికెటర్లు మాత్రం అద్భుతమైన ఆటతీరుతో గేమ్‌పై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వాళ్లే బెస్ట్ అని సీనియర్ క్రికెటర్లు, ఎక్స్‌పర్ట్స్ మెచ్చుకుంటారు. ఇప్పుడు టీమిండియా లెజెండ్ యువరాజ్ సింగ్ కూడా ఓ ఆటగాడ్ని ఇలాగే ప్రశంసించాడు. ఈ జనరేషన్‌లో అతడే బెస్ట్ అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. మరి.. యువీ లాంటి దిగ్గజం నుంచి ప్రశంసలు అందుకున్న ఆ ప్లేయర్ ఎవరు అనేది ఇప్పుడు చూద్దాం..'ఈ జనరేషన్‌లో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఆటగాడు. అతడ్ని నేను కింగ్ కోహ్లీ అని పిలుస్తుంటా. చాలా ఏళ్ల పాటు అతడు మహావిరాట్‌గా కొనసాగాడు. కెరీర్‌ను గమనిస్తే.. 15 నుంచి 18 ఏళ్ల పాటు భీకర ఫామ్‌లో కొనసాగాడు. ఇది మామూలు విషయం కాదు. అతడి గ్రాఫ్ కూడా అదే రేంజ్‌లో ఉంది. ఈ తరంలో అన్ని ఫార్మాట్లలోనూ బెస్ట్ ప్లేయర్‌గా కోహ్లీని చెప్పొచ్చు. అతడికి పోటీనే లేదు' అని యువరాజ్ చెప్పుకొచ్చాడు. చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం నేపథ్యంలో ఓ స్పోర్ట్స్ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న యువీ.. కోహ్లీని మించినోడు లేడంటూ పొగడ్తల్లో ముంచెత్తాడు.

నవక్రీడ

## దిగొచ్చిన పాకిస్థాన్.. భారత్ అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్ ఫైరు



**న్యూఢిల్లీ-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందే పాకిస్థాన్‌కు ఘోర అవమానం చోటుచేసుకుంది. భారత్‌తో ఆడుకుందామని భావించిన దాయాది తాను తీసిన గోతిలో తానే పడింది. మెగా టోర్నీ స్టార్ట్ అవడానికి ముందు రీసెంట్‌గా కరాచీ స్టేడియంలో జరిగిన ఓ ఘటన వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ మైదానంలో అన్ని దేశాల జెండాలను ప్రదర్శించి, ఒక్క భారత జెండాను ప్రదర్శించకపోవడంతో దాయాదిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో దిగొచ్చిన పాక్ క్రికెట్ బోర్డు.. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పెద్ద పెట్టున విమర్శలు రావడంతో బుద్ధి తెచ్చుకున్న పాకిస్థాన్.. కరాచీ స్టేడియంలో తాజాగా భారత పతాకాన్ని ప్రదర్శించింది. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన నెటిజన్స్.. భారత్ అంటే ఫైరు అనుకుంటివా.. కాదు, వైల్డ్ ఫైరు అని కామెంట్స్ చేస్తున్నారు. ఇండియాతో పెట్టుకుంటే ఇలాగే ఉంటుందని వార్నింగ్ ఇస్తున్నారు. బోర్డర్‌లోనే కాదు.. క్రికెట్‌లోనూ భారత్‌తో పెట్టుకోవద్దని హెచ్చరిస్తున్నారు. మెగా టోర్నీలో ఇరు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో పాక్‌కు పరాభవం తప్పదని.. అంతకంతా అనుభవించాల్సిందేనని చెబుతున్నారు. జెండా ప్రదర్శించకపోవడం తర్వాత మళ్లీ దిద్దుబాటు చేయడం లాంటి పనులతో పీసీబీ పరువు పోగొట్టుకోవడం తప్ప సాధించిందేమీ లేదని దుయ్యబడుతున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**